

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 18-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 273 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 8.46 తదుపరి నవమి; నక్షత్రం: అశ్వని రా. 2.59 తదుపరి భరణి; వర్జ్యం: రా. 11.05-12.38; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.19, మ. 3.01-4.36; అమృతఘడియలు: రా. 7.57-9.31; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.59 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





మార్కెట్ బేజార్!



భారీగా పతనమైన స్టాక్ సూచీలు.. సెన్సెక్స్ 1,628 పాయింట్లు డౌన్.. 21,600 దిగువకు నిఫ్టీ

2022 జూన్ తర్వాత అతిపెద్ద నష్టం
బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లు విలవిల
రూ.4.60 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ బుధవారం మహా పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,628 పాయింట్లు (2.23 శాతం) క్షీణించి 71,500.76 వద్దకు జారుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 460.35 పాయింట్లు (2.09 శాతం) కోల్పోయి 21,571.95 వద్ద ముగిసింది. ప్రామాణిక సూచీలకు గడిచిన ఏడాదిన్నరకు పైగా కాలంలో (2022 జూన్ 13 తర్వాత) ఇదే అతిపెద్ద నష్టం. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే ప్రక్రియ జాప్యం కావచ్చన్న ఆందోళనలతో యూఎస్ డాలర్‌తో పాటు బాండ్ల రేట్లు మళ్లీ 4 శాతం పైకి ఎగబాకడం, ఎర్ర సముద్రంలో సంక్షోభం వంటి అంశాలు అంతర్జాతీయంగా ఈక్విటీ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పైగా, మన సూచీలు ఆల్‌టైం గరిష్ఠాల వద్ద కదలాడుతున్న నేపథ్యంలో మదుపర్లు ముందు జాగ్రత్త చర్యగా పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ వర్గాలంటున్నాయి. అమ్మకాలు పోటెత్తడంతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.59 లక్షల కోట్లకు పైగా తరిగి రూ.370.36 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 నష్టపోగా.. 6 లాభపడ్డాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.09 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్ ఏకంగా 4.02 శాతం పతనమైంది.

ఎంఆర్ఎఫ్ షేరు @ రూ.1.50 లక్షలు

మార్కెట్లో అత్యంత ఖరీదైన షేరుగా పేరున్న ఎంఆర్ఎఫ్.. ఇంట్రాడే ట్రేడింగ్‌లో మరింత ఎగబాకి సరికొత్త రికార్డు స్థాయి రూ.1.50 లక్షలకు చేరుకుంది. ఇప్పటివరకు మార్కెట్లో రూ.లక్షన్నర పలికిన ఏకైక కంపెనీ షేరు ఇదే. అయితే, చివర్లో 1.11 శాతం నష్టంతో రూ.1,34,969 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.లక్ష కోట్ల నష్టం

డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించిన ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోవడంతో బ్యాంక్ షేర్లు 8 శాతానికి పైగా క్షీణించాయి. కొవిడ్ సంక్షోభ కాలమైన 2020 మార్చి 23న 12.7 శాతం నష్టపోయిన బ్యాంక్ షేరుకు ఆ తర్వాత ఇదే అతిపెద్ద పతనం. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.లక్ష కోట్లకు పైగా తగ్గి రూ.11.67 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్ దిగ్గజ షేర్లలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల భారీ పతనం ఇతర బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడిని పెంచింది. దాంతో ప్రామాణిక సూచీలు అతిపెద్ద నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2,000 పాయింట్లకు పైగా కోల్పోయి 2020 మే తర్వాత అతిపెద్ద నష్టాన్ని నమోదు చేసుకుంది.

ఎన్‌హెచ్‌పీసీలో వాటా విక్రయించనున్న ప్రభుత్వం

గురువారం నుంచి ఎన్‌హెచ్‌పీసీలో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రభుత్వం 3.5 శాతం వాటాకు సమానమైన 25 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఒక్కో షేరును రూ.66కు విక్రయించటం ద్వారా ప్రభుత్వం రూ.2,300 కోట్లు సమీకరించనుంది.

అత్యంత విలువైన పీఎస్‌యూగా ఎల్ఐసీ

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా, దేశంలో అత్యంత విలువైన ప్రభుత్వ రంగ కంపెనీ (పీఎస్‌యూ) జాబితాలో ఎస్‌బీఐని వెనక్కి నెట్టి ఎల్ఐసీ అగ్రస్థానానికి ఎగబాకింది. ప్రారంభ ట్రేడింగ్‌లో ఎల్ఐసీ షేరు 3 శాతం పెరిగి రూ.919.45 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని రికార్డు చేసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.5.75 లక్షల కోట్లకు ఎగబాకింది. అదే సమయంలో ఎస్‌బీఐ షేరు నష్టాల్లో ట్రేడైంది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.5.60 లక్షల కోట్లకు పరిమితమైంది. చివర్లో ఎల్ఐసీ షేరు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ, కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.5.61 లక్షల కోట్లుగా నమోదు కావడంతో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగలిగింది.

22 నుంచి నోవా అగ్రిటెక్ పబ్లిక్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భూసార నిర్వహణ, పంట ఉత్పత్తికారకాల, పోషకాలను తయారు చేస్తున్న నోవా అగ్రిటెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.144 కోట్లు సమీకరించనుంది. ఇష్యూ జనవరి 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. దరఖాస్తుకు ఒక్కో షేరు ధర శ్రేణిని రూ.39-41గా నిర్ణయించింది. కనీసం 365 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. రూ.2 ముఖ విలువ కలిగిన రూ.112 కోట్ల విలువైన కొత్త షేర్లను ఇష్యూలో జారీ చేస్తారు. ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్ నూతలపాటి వెంకటసుబ్బారావు 77,58,620 షేర్లను విక్రయిస్తారు.

గూగుల్ పేతో విదేశాల్లోనూ చెల్లింపులు..
ఎన్‌పీసీఐతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

న్యూఢిల్లీ: గూగుల్ ఇండియా డిజిటల్ సర్వీసెస్‌తో ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూనిఫైడ్ పేమెంట్ సర్వీసెస్(యూపీఐ) ద్వారా చెల్లింపుల సేవలను విదేశాలకు విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. అంటే, భారతీయులు విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడా గూగుల్ పే ద్వారా చెల్లింపులు జరిపేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా వెంట నగదు తీసుకెళ్లాల్సిన లేదా అంతర్జాతీయ పేమెంట్ గేట్‌వేలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది.

సెలోజీన్‌లో నాట్కో ఫార్మా పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఢిల్లీకి చెందిన బయోటెక్నాలజీ కంపెనీ సెలోజీన్ థెరప్యూటిక్స్‌లో నాట్కో ఫార్మా 20 లక్షల డాలర్ల (దాదాపు రూ.16 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. సెల్, జీన్ థెరపీకి సంబంధించి రెండు పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను సెలోజీన్ నిర్వహిస్తోంది. కిమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్ టీ (కార్ టీ) సెల్ థెరపీపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. తలసేమియా వ్యాధికి సంబంధించిన జీన్ థెరపీపై కూడా సెలోజీన్ పరిశోధనలు చేస్తోంది. కార్ టీ థెరపీపై మొదటి దశ క్లినికల్ పరీక్షలను ఈ ఏడాది ప్రథమార్థంలో ప్రారంభించాలని భావిస్తోంది.

రూ.60 కోట్లతో ఎన్‌కోర్-అల్కామ్ కొత్త ప్లాంట్
హైదరాబాద్‌లో ఫ్యాబ్రికేషన్ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఎన్‌కోర్- అల్కామ్.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రూ.60 కోట్లతో అల్యూమినియం డోర్స్, విండోల తయారీ యూనిట్‌ను సూరత్‌లో ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లోని మోకిలా వద్ద ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. జర్మనీ టెక్నాలజీతో రోజుకు 30 వేల చదరపు అడుగుల అల్యూమినియం డోర్లు, విండోలను సూరత్ యూనిట్‌లో తయారు చేయనున్నట్లు సంస్థ సీఎండీ శివ కోటి రెడ్డి తెలిపారు. 1.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉండే ఈ యూనిట్ విస్తీర్ణం పరంగా దేశంలోనే అతిపెద్దది. అల్కామ్ బ్రాండ్‌తో అల్యూమినియం డోర్లు, విండోలను కంపెనీ ఉత్తరాదిలో విక్రయిస్తోంది. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత దక్షిణాదిలోని రిటైల్ మార్కెట్లో కూడా అల్యూమినియం డోర్లు, విండోలను కంపెనీ ప్రవేశపెట్టనుంది.



ప్రారంభ ధర రూ.10.99 లక్షలు

మార్కెట్లోకి టాటా 'పంచ్.ఈవీ'

న్యూఢిల్లీ :టాటా మోటార్స్ మార్కెట్లోకి ఎలక్ట్రిక్ వెర్షన్ 'పంచ్.ఈవీ' విడుదల చేసింది. రెండు బ్యాటరీ ప్యాక్స్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.10.99 లక్షలు, రూ.14.49 లక్షలుగా ఉన్నాయి. ప్యూర్ ఈవీ ఆర్కిటెక్చర్ 'యాక్టి.ఈవీ' పై కంపెనీ తీసుకువచ్చిన మొదటి ఎలక్ట్రిక్ కారు ఇది. 25 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన పంచ్.ఈవీ కారు ఒకసారి చార్జింగ్‌తో 315 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. 35 కిలోవాట్ బ్యాటరీతో కూడిన కారు సింగిల్ చార్జింగ్‌తో 421 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. కాగా ఏడాది ద్వితీయార్థంలో కర్వ్, హారియర్ ఈవీ, సియెర్రా, ఆల్ట్రోజ్ ఈవీ కార్లను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు చంద్ర తెలిపారు.

భారత్‌లో బలమైన బ్రాండ్ జియో

వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానం

» అత్యంత విలువైన బ్రాండ్ టాటా

» బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక విడుదల

న్యూఢిల్లీ: ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సేవల సంస్థ రిలయన్స్ జియో భారత్‌లో అత్యంత బలమైన కార్పొరేట్ బ్రాండ్‌గా నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ అనే సంస్థ 2024కు గాను విడుదల చేసిన గ్లోబల్ 500 లిస్ట్‌లోని భారత కంపెనీల్లో జియో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానం దక్కించుకుంది. ప్రపంచ జాబితాలో జియోకు ఈసారి 17వ స్థానం దక్కింది. కాగా, దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీకి 23, ఎస్‌బీఐకి 24వ స్థానాలు లభించాయి. "అంతర్జాతీయ టెలికాం రంగంలో జియో కొత్త కంపెనీ అయినప్పటికీ, 610 కోట్ల డాలర్ల బ్రాండ్ విలువ (14 శాతం వృద్ధి)తో పాటు బ్రాండ్ సత్తా సూచీలో 89 పాయింట్ల స్కోర్, ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌తో శక్తిమంతమైన బ్రాండ్‌గా ఎదిగిందని బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్టు పేర్కొంది. కాగా, దేశంతోపాటు దక్షిణాసియాలో అత్యంత విలువైన బ్రాండ్‌గా టాటా గ్రూప్ నిలిచింది. గ్లోబల్ 500 లిస్ట్‌లో టాటా గ్రూప్‌నకు 64వ స్థానం దక్కింది. భారత్ నుంచి మొత్తం 13 కంపెనీలకు ఈ లిస్ట్‌లో చోటు లభించింది. కాగా, ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ ప్రపంచంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా ఉంది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, సామ్‌సంగ్ వరుసగా టాప్-5లో ఉన్నాయి.

వచ్చే ఏడాది వృద్ధి 7%

» ద్రవ్యోల్బణం దిగి రావడం ఖాయం

» 2024-25పై ఆర్‌బీఐ అంచనా

దావోస్: భారత్‌లో త్వరలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్న ధీమా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశాల సందర్భంగా దావోస్‌లో "గరిష్ఠ వృద్ధి, కనిష్ఠ రిస్క్ : భారతదేశ గాథ" అనే అంశంపై సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వ్యవస్థాత్మక సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ మధ్యకాలిక, దీర్ఘకాలిక వృద్ధిని ఉత్తేజితం చేశాయని చెప్పారు. స్థూలంగా ప్రపంచం పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ అందుకు భిన్నంగా భారతదేశం వృద్ధి, సుస్థిరతల చిత్రాన్ని ఆవిష్కరించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనాగా చెప్పారు. దేశీయంగా డిమాండ్ బలంగా ఉండడంతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నదని, పలు ప్రపంచ పరిణామాల మధ్య భారత్ పటిష్ఠంగా నిలిచిందని ఆయన తెలిపారు. విదేశీ మారకం నిల్వలు పుష్కలంగా ఉండడంతో విదేశీ చెల్లింపులకు ఎలాంటి అవరోధం ఉండబోదని దాస్ చెప్పారు. 2022 వేసవితో పోల్చితే ద్రవ్యోల్బణం విశేషంగా తగ్గిందని, ద్రవ్య విధాన చర్యలతో పాటు లిక్విడిటీని సద్దుబాటు చేసే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయనేందుకు ఇది నిదర్శనమని దాస్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	77,400 ▼
ముంబై	62,277 ▼	57,046 ▼	71,191 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	520	విశాఖపట్నం	550
18 జనవరి		వరంగల్	522
చిత్తూరు	563		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	113
విశాఖపట్నం	101		

వరల్డ్ చాంపియన్‌కు ప్రజ్ఞానంద షాక్



విషీని వెనక్కునెట్టి అగ్రస్థానానికి

విజ్కాన్‌జీ (నెదర్లాండ్స్): టీనేజ్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు పెను సంచలనం సృష్టించాడు. టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)కు షాకిచ్చిన 18 ఏళ్ల ప్రజ్ఞానంద.. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను వెనక్కునెట్టి భారత టాప్ రేటెడ్ ప్లేయర్‌గా నెం:1 స్థానాన్ని ఆక్రమించాడు. మంగళవారం రాత్రి జరిగిన నాలుగో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 62 ఎత్తుల్లో లిరెన్ ఆట కట్టించాడు. ఈ క్రమంలో క్లాసికల్ చెస్‌లో ఆనంద్ తర్వాత వరల్డ్ చాంపియన్‌ను ఓడించిన రెండో భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద రికార్డులకెక్కాడు. అంతేకాకుండా ఫిడే లైవ్ రేటింగ్స్‌లో ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విషీ (2748)ను ప్రజ్ఞానంద (2748.3) స్వల్ప తేడాతో అధిగమించాడు. గతేడాది కూడా ఇదే టోర్నీలో లిరెన్‌పై మన చిన్నోడు గెలిచాడు. కాగా, నెదర్లాండ్స్ జీఎం అనీష్ గిరీ చేతిలో గుకేష్ పరాజయం పాలయ్యాడు. టోర్నీలో మొత్తం 4 రౌండ్ల నుంచి ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా.. గుకేష్ 1.5 పాయింట్లతో 10వ స్థానంలో ఉన్నాడు. అద్వితీయ విజయం సాధించిన ప్రజ్ఞానందపై సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు.

స్టార్లకు రష్యన్ల ఝులక్

జెబ్యూర్, సక్కారి, వోజ్నియాకి ఇంటికి
రెండోరౌండ్లోనూ కష్టపడ్డ జొకోవిచ్
ఆస్ట్రేలియన్ ఓపెన్



ఎలీనా అవనెస్యాన్ మిరా ఆండ్రీవా



మరియా తొమఫీవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగోరోజు సంచలనాలు నమోదయ్యాయి. బుధవారం జరిగిన సింగిల్స్‌లో టాప్‌టెన్ క్రీడాకారిణులైన ఓన్స్ జెబ్యూర్, మరియా సక్కారితో పాటు మాజీ చాంపియన్ కరోలిన్ వోజ్నియాలకు చుక్కెదురైంది. ఈ ముగ్గురూ రెండోరౌండ్లో రష్యన్ యువ కెరటాల జోరుకు తలొగ్గడం విశేషం. మూడు గ్రాండ్‌స్లామ్‌ల రన్నరప్, ఆరోసీడ్ జెబ్యూర్‌ను రెండోరౌండ్లో 16 ఏళ్ల టీనేజర్ మిరా ఆండ్రీవా 6-0, 6-2తో చిత్తుచేసింది. నిరుడు ఇదే టోర్నీ జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఆండ్రీవా.. ఈ వేదికపై సీనియర్ కేటగిరిలో ఆడుతున్న రెండోమ్యాచ్‌లోనే టాప్‌టెన్ ప్లేయర్‌పై విజయాన్నందుకొని సత్తాచాటింది. మరో రెండోరౌండ్ పోరులో గ్రీస్ క్రీడాకారిణి, 8వ సీడ్ మరియా సక్కారికి 6-4, 6-4తో 21 ఏళ్ల ఎలీనా అవనెస్యాన్ షాకిచ్చింది. ఇద్దరు పిల్లలకు తల్లి అయ్యాక గతేడాదే టెన్నిస్‌లో పునరాగమనం చేసిన 2018 విజేత కరోలిన్ వోజ్నియాకి రెండోరౌండ్లో పోరాడి ఓడింది. 33 ఏళ్ల ఈ డెన్మార్క్ స్టార్‌ను 20 ఏళ్ల మరియా తొమఫీవా 1-6, 6-4, 6-1తో కంగుతినిపించింది. మిగతా స్టార్లలో డిఫెండింగ్ చాంప్ సబలెంక, అమెరికా యువ సంచలనం కొకొ గాఫ్, క్రెజికోవా ప్రత్యర్థులపై గెలిచి మూడోరౌండ్లో ప్రవేశించారు. మార్టా కొస్ట్యుక్ 5-7, 6-1, 7-6(6)తో 25వ సీడ్ మెర్టెన్స్‌కు, మాగ్డలీనా 6-4, 7-6(2)తో 16వ సీడ్ గార్సియాకు, అలీసియా7-5, 6-4తో 32వ సీడ్ లైలా ఫెర్నాండెజ్‌కు ఝులకిచ్చారు.

మళ్లీ సెట్ కోల్పోయిన జొకో: పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జొకోవిచ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ కష్టపడ్డాడు. రెండోరౌండ్లోనూ ఓ సెట్ కోల్పోయి గట్టెక్కాడు. మూడు గంటలా 11 నిమిషాల పాటు సాగిన పోరులో 36 ఏళ్ల జొకోవిచ్ 6-3, 4-6, 7-6(4), 6-3తో స్థానిక ఆటగాడు అలెక్సీ పాపిరిన్‌పై గెలిచాడు. సీడెడ్ ఆటగాళ్లలో సిన్నర్, రుబ్లెవ్, సిట్సిపాస్, కచనోవ్ మూడోరౌండ్లో అడుగుపెట్టారు.

శ్రీకాంత్ అవుట్
ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్‌లోనూ విఫలమయ్యాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో శ్రీకాంత్ 22-24, 13-21తో లీ చిక్ యూ (హాంకాంగ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 21-15, 19-21, 21-16తో చైనీస్ తైపీ జంట ఫాంగ్ చిన్ లీ-ఫాంగ్ జెన్ లీపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మహిళల డబుల్స్‌లో తనీషా/అశ్వినీ పొన్నప్ప జంట, అశ్విని భట్/శిఖా గౌతమ్ ద్వయం, పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్/ప్రతీక్ జంటలు ప్రత్యర్థుల చేతిలో ఓడారు.

అలెన్ తుఫాన్

16 సిక్సర్లతో రికార్డు సెంచరీ
కివీస్‌దే మూడో టీ20
పాక్‌పై సిరీస్ కైవసం



డ్యునెడిన్: పాకిస్థాన్‌పై న్యూజిలాండ్ వరుసగా మూడో టీ20లోనూ గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మూడో టీ20లో ఫిన్ అలెన్ రికార్డుల మోత మోగించడంతో కివీస్ 45 పరుగులతో పాక్‌ను చిత్తుచేసింది. తొలుత ఓపెనర్ ఫిన్ అలెన్ (62 బంతుల్లో 5 ఫోర్లు, 16 సిక్సర్లతో 137) మెరుపు సెంచరీ చేయడంతో కివీస్ 20 ఓవర్లలో 224/7తో భారీస్కోరు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అలెన్ దెబ్బకు రౌఫ్ 4 ఓవర్లలో 60 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. ఛేదనలో పాక్ 20 ఓవర్లలో 179/7 స్కోరుకే పరిమితమైంది. బాబర్ ఆజమ్ (58) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో జట్టు ఓటమిపాలైన వరుస మూడు మ్యాచ్‌ల్లోనూ అర్ధ సెంచరీలు చేసిన తొలి ఆసియా బ్యాటర్‌గా బాబర్ నిలిచాడు.

రికార్డుల కింగ్

1అలెన్ ఒకే ఇన్నింగ్స్‌లో 16 సిక్సర్లు కొట్టి అజ్రతుల్లా జజాయ్ (అఫ్ఘానిస్థాన్) పేరిట నున్న ప్రపంచ రికార్డును సమం చేశాడు. జజాయ్ 2019లో ఐర్లాండ్‌పై 16 సిక్సర్లు బాదాడు. 1టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన న్యూజిలాండ్ ఆటగాడిగా మెకల్లమ్ (123)ను అలెన్ అధిగమించాడు.

టాప్-10లోకి అక్షర్, యశస్వి

దుబాయ్: అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచడంతో టీమిండియా స్పిన్నర్ అక్షర్ పటేల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ టెన్‌లో చోటు దక్కించుకున్నారు. బౌలర్ల జాబితాలో అక్షర్ ఐదో ర్యాంకు, బ్యాటర్లలో జైస్వాల్ ఆరో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

సూపరో.. సూపర్

తొలుత టై.. ఆపై రెండు సూపర్ ఓవర్లు
భారత్ థ్రిల్లింగ్ విన్



రోహిత్ (121 నాటౌట్)

రింకూ సింగ్ (69 నాటౌట్)

మూడో టీ20లో పోరాడి ఓడిన అఫ్ఘానిస్థాన్
రోహిత్ సెంచరీ
సిరీస్ క్లీన్‌స్వీప్

బెంగళూరు : ఆహా..ఏమి మ్యాచ్..భారత్-అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య బుధవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆఖరి టీ20 ఫ్యాన్స్‌కు నాలుగు గంటలపాటు మస్త్ మజాను పంచింది..పరుగుల వరద పారిన పోరులో విజేతను తేల్చేందుకు ఏకంగా రెండు సూపర్ ఓవర్లు అనివార్యమయ్యాయి..అయితే రెండో సూపర్ ఓవర్లో యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుత బౌలింగ్‌తో రెండు వికెట్లు పడగొట్టి టీమిండియాకు ఉత్కంఠ విజయం అందించాడు. సూపర్ ఓవర్లో రెండు వికెట్లు పతనమైతే ఆలౌట్ అయినట్టు లెక్క. బుధవారం జరిగిన మూడో టీ20లో కెప్టెన్ రోహిత్ శర్మ (69 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో 121 నాటౌట్) సెంచరీతో, డాషింగ్ బ్యాటర్ రింకూ సింగ్ (39 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 69 నాటౌట్) అర్ధ శతకంతో అదరగొట్టగా, తొలుత టీమిండియా 20 ఓవర్లలో 212/4 స్కోరు చేసింది. రోహిత్, రింకూ ఐదో వికెట్‌కు 190 పరుగుల (95 బంతుల్లో) అభేద్య భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. టీ20ల్లో భారత్‌కు ఏ వికెట్‌కైనా ఇది రికార్డు. ఫరీద్ అహ్మద్ మూడు వికెట్లు పడగొట్టాడు. భారీ ఛేదనలో గుల్బదిన్ నైబ్ (23 బంతుల్లో 55 నాటౌట్), రహ్మనుల్లా గుర్బాజ్ (32 బంతుల్లో 50), ఇబ్రహీం జద్రాన్ (41 బంతుల్లో 50) అర్ధ శతకాలతో విజృంభించడంతో అఫ్ఘాన్ కూడా 20 ఓవర్లలో 212/6 స్కోరు చేసింది. నబీ (16 బంతుల్లో 34) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. రోహిత్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా, దూబే 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

వణికించిన అఫ్ఘానిస్థాన్..: భారీ ఛేదనలో అఫ్ఘానిస్థాన్ ఓపెనర్లు గుర్బాజ్, ఇబ్రహీం భారత బౌలర్లను బెంబేలెత్తిస్తూ, తొలి వికెట్‌కు ఏకంగా 93 పరుగులు జోడించారు. అయితే స్పిన్నర్ కుల్దీప్ బౌలింగ్‌లో సుందర్ పట్టిన సూపర్ క్యాచ్‌తో రహ్మనుల్లా గుర్బాజ్ అవుట్ కావడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆపై మరో రెండు వికెట్లను వెంటవెంటనే చేజార్చుకున్నా..నబీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో మరోసారి ఆతిథ్య జట్టులో గుబులు రేపాడు. నబీ ఇన్నింగ్స్‌కు సుందర్ ముగింపు పలికినా..చివరి బ్యాటర్లు జతగా గుల్బదిన్ నైబ్ అఫ్ఘానిస్థాన్‌ను గెలుపు అంచులదాకా తీసుకొచ్చాడు. ఆఖరి ఓవర్లో అఫ్ఘాన్ విజయానికి 19 పరుగులు చేయాల్సి వచ్చింది. ముకేశ్ వేసిన ఆ ఓవర్లో గుల్బదిన్ 4,6 కొట్టడంతో ఆఖరి బంతికి మూడు పరుగులుగా సమీకరణం మారింది. కానీ గుల్బదిన్ రెండు పరుగులే తీయడంతో మ్యాచ్ టై అయింది.

రోహిత్, రింకూ విన్యాసం..: టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన భారత్‌ను..ఫరీద్ అహ్మద్, ఒమర్జాయ్ కట్టుదిట్టమైన బంతులతో పరుగులు చేయకుండా నిరోధించారు. ఫరీద్ వేసిన మూడో ఓవర్లో రోహిత్ బౌండరీ కొట్టినా..తర్వాత రెండు వరుస వికెట్లతో అఫ్ఘాన్ పేసర్ ఝులక్ ఇచ్చాడు. ఫరీద్ బంతిని క్రీజునుంచి బయటకు వచ్చి జైస్వాల్ (4) భారీ షాట్‌గా మలచబోయి నబీకి చిక్కాడు. ఇక..ఎదుర్కొన్న తొలి బంతినే షాట్‌గా కొట్టబోయి విరాట్ కూడా క్యాచవుట్ అయ్యాడు. దాంతో కిక్కిరిసిన చిన్నస్వామిస్టేడియం చిన్నబోయింది.ఇక అజ్మతుల్లా ఒమర్ జాయ్..దూబే (1)ను కీపర్ గుర్బాజ్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చడంతో స్టేడియం అంతా షాక్. దీని నుంచి కోలుకొనేలోపే..ఫరీద్ బౌలింగ్‌లో చెత్త షాట్‌కు యత్నించి శాంసన్ డకౌటయ్యాడు. దాంతో పవర్ ప్లేలోపే 22/4తో టీమిండియా తీవ్ర కష్టాల్లో పడింది. కానీ ఎనిమిదో ఓవర్లో..అరంగేట్ర పేసర్ సలీమ్‌కు రింకూసింగ్, రోహిత్ భారీ సిక్సర్లతో స్వాగతం పలికారు. అక్టోబరు 2022 తర్వాత పొట్టి క్రికెట్‌లో రోహిత్‌కి మొదటి అర్ధ శతకం ఇక్కడ సాధించాడు. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో 6,4,4తో దుమ్ము రేపిన రోహిత్ 2018 అనంతరం టీ20లలో తొలి సెంచరీ అందుకున్నాడు. ఇదే ఓవర్లో సిక్సర్ బాదిన రింకూ సింగ్ హాఫ్ సెంచరీ మార్క్ చేరాడు. రింకూ సింగ్ 6,6,6 దంచడంతో..ఆఖరి ఓవర్లో భారత్ ఏకంగా 36 పరుగులు సాధించింది. మొత్తంగా చివరి ఐదు ఓవర్లలో భారత్ 103 కొల్లగొట్టింది.

1

టీ20ల్లో అత్యధిక సెంచరీ (5)లు చేసిన తొలి బ్యాటర్ రోహిత్ శర్మ. అలాగే ఈ ఫార్మాట్‌లో అతడికి అత్యధికం కూడా. 2017లో ఇండోర్‌లో శ్రీలంకపై 118 రోహిత్ గత అత్యుత్తమం.

అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీకిది 35వ డకౌట్. ఈ క్రమంలో సచిన్ (34)ను అధిగమించాడు.

మొదటి సూపర్ ఓవర్ సాగిందిలా..
(భారత్ లక్ష్యం 16 రన్స్)

అఫ్ఘానిస్థాన్	బంతి	భారత్
1 రన్, వికెట్	తొలి బంతి	1 రన్ (లెగ్‌బై)
1 రన్	రెండో బంతి	1 రన్
4 రన్స్	మూడో బంతి	6 రన్స్
1 రన్	నాలుగో బంతి	6 రన్స్
6 రన్స్	ఐదో బంతి	1 రన్, వికెట్
3 రన్స్ (బైస్)	ఆరో బంతి	1 రన్
16/1	మొత్తం రన్స్	16/1

రెండో సూపర్ ఓవర్ సాగిందిలా...
(అఫ్ఘాన్ లక్ష్యం 12 రన్స్)

భారత్	బంతి	అఫ్ఘానిస్థాన్
6 రన్స్	తొలి బంతి	వికెట్
4 రన్స్	రెండో బంతి	1 రన్
1 రన్	మూడో బంతి	వికెట్
వికెట్	నాలుగో బంతి	.....
వికెట్	ఐదో బంతి	......
11/2	మొత్తం రన్స్	1/2

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) నబీ (బి) ఫరీద్ 4, రోహిత్ (నాటౌట్) 121, కోహ్లీ (సి) ఇబ్రహీం (బి) ఫరీద్ 0, దూబే (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 1, శాంసన్ (సి) నబీ (బి) ఫరీద్ 0, రింకూ (నాటౌట్) 69; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 20 ఓవర్లలో 212/4; వికెట్ల పతనం:** 1-18, 2-18, 3-21, 4-22; **బౌలింగ్:** ఫరీద్ 4-0-20-3, అజ్మతుల్లా 4-0-33-1, కైస్ 4-0-28-0, సలీమ్ 3-0-43-0, అష్రఫ్ 2-0-25-0, కరీమ్ 3-0-54-0.

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) సుందర్ (బి) కుల్దీప్ 50, ఇబ్రహీం (స్టంప్డ్) శాంసన్ (బి) సుందర్ 50, గుల్బదిన్ (నాటౌట్) 55, అజ్మతుల్లా (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 0, నబీ (సి) అవేశ్ (బి) సుందర్ 34, జనత్ (రనౌట్/శాంసన్) 2, నజీబుల్లా (సి) కోహ్లీ (బి) అవేశ్ 5, అష్రఫ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 212/6; వికెట్ల పతనం:** 1-93, 2-107, 3-107, 4-163, 5-167, 6-182; **బౌలింగ్:** ముకేష్ 4-0-44-0, అవేశ్ 4-0-55-1, బిష్ణోయ్ 4-0-38-0, సుందర్ 3-0-18-3, దూబే 2-0-25-0, కుల్దీప్ 3-0-31-1.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 18-1-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


ముందు ఇలా..

పనులు పూర్తికాకుండా ప్రారంభోత్సవమా?

బెజవాడలో అంబేడ్కర్ స్మృతివనం పూర్తికి మరో మూడు నెలలు!
వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని రేపే హడావుడిగా ప్రారంభం
పూర్తికాని కన్వెన్షన్ సెంటర్.. ఆ పనులు కనపడకుండా గ్రీన్ మ్యాట్‌లతో మేకప్
పార్కింగే ఇక్కడ ప్రధాన సమస్య.. పశ్చిమ, ఉత్తర దిక్కుల్లో ఆ వసతి ఏర్పాటే చేయలేదు
వ్యయంపై నోరెత్తని అధికారులు.. 400 కోట్లన్న సీఎం రోతపత్రిక.. అనుమానాలెన్నెన్నో

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)
బెజవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవానికి జగన్ ప్రభుత్వం సిద్ధమైంది. వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని.. పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభించేస్తోంది. స్మృతి వనం పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోవడానికి ఎంతలేదన్నా మరో మూడు నెలలు పైనే పడుతుంది. అంబేడ్కర్

మిగతా 9వ పేజీలో...

బస్సుల కోసం బడులకు మోసం!

21 వరకు సంక్రాంతి సెలవులు పొడిగింపు
అంబేడ్కర్ కార్యక్రమానికి జనం తరలింపునకు పాఠశాల బస్సులను వినియోగించే ప్లాన్
టీచర్లు, తల్లిదండ్రులు కోరినట్లు వివరణ
ఎవరూ కోరలేదంటున్న ఉపాధ్యాయులు


వెనుక అలా..
విజయవాడలో ఏర్పాటు చేసిన భారీ అంబేడ్కర్ విగ్రహం పనులు ముందువైపు దేదీప్యమానంగా కనిపిస్తుండగా.. వెనుక మాత్రం ఇలా అసంపూర్తిగానే ఉన్నాయి.

ఊరు మారలేదు! దాని తీరూ మారలేదు! ఐదేళ్ల క్రితం వేసిన సిమెంట్ రహదారులే తప్ప జగన్ హయాంలో వేసిన రోడ్లే లేవు. అభివృద్ధి లేదు. అయినా సరే... 'ఊరు మారింది' అంటూ జగన్ సర్కారు ఊదరగొడుతోంది. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ గ్రంథాలయాలు, ఇతర భవనాలతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని సంక్రాంతి సందర్భంగా జగన్ రోత పత్రికలో జనం సొమ్ముతో ప్రకటన ఇచ్చారు. పల్లెలు పండగ చేసుకుంటున్నాయని ప్రచారం హోరెత్తించారు. కానీ, ఆ 'ప్రకటనల్లో ఉన్నంత విషయం పల్లెల్లో ఎక్కడుందబ్బా' అంటూ ఎక్కడికక్కడ జనం చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో వైసీపీ నేతలు కూడా జగన్ 'అభివృద్ధి' బాకాపై కారాలు మిరియాలు నూరుతున్నారు. "శ్మశానాల్లో కాపురంలా ఉంది జగనన్న అభివృద్ధి' అంటూ వైసీపీ గ్రామ స్థాయి నేత రాజన్న 'ఐ ప్యాక్' సభ్యుడితో కుండ బద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. మచ్చుకు కొన్ని గ్రామాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా జగన్ పాలనలో ఊళ్లు ఎంత దయనీయంగా ఉన్నాయో తేలిపోయింది. 11

ఊరు మారలేదు!

ప్రకటనల్లో ఉన్నంత విషయం పల్లెల్లో ఎక్కడబ్బా!

ఆంధ్రజ్యోతి విజిట్

జగన్ రోత పత్రిక ప్రకటనపై ఇప్పుడు ఇదే చర్చ
ఐదేళ్ల క్రితం వేసిన రోడ్లే ఇప్పటికీ పల్లెల్లో దిక్కు
పంచాయతీలకు నిధులివ్వకుండా ఎండబెట్టిన వైనం
పొంగిపొర్లుతున్న డ్రైనేజీ.. అడుగడుగునా మురుగు
సచివాలయాలు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీల కోసం చేపట్టిన భవనాలు చాలావరకు శ్లాబు దశలోనే..
అయినా 'పల్లెకు పండగ' అంటూ కోట్లు వెచ్చించి ప్రకటన
'ఊరు మారిందోచ్..' అంటూ ఊరూవాడా బాకా

దయనీయంగా పల్లెలు
'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూసిన వాస్తవాలు


జగన్ రోత పత్రికలో 'ఊరు మారింది' అంటూ ప్రజల సొమ్ముతో ఇచ్చిన ప్రకటన


కృష్ణాజిల్లా నాగాయలంక మండలం భావదేవరపల్లిలో నిధుల కొరతతో పునాదుల్లోనే ఆగిన సచివాలయ భవనం దుస్థితి..


శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం అరకపద్ర గ్రామం వద్ద బహుదా నదిపై అసంపూర్ణంగా మిగిలిన వంతెన నిర్మాణం..


చాపలమడుగు-సి.కొత్తపల్లి రోడ్డు దుస్థితి

ఊరంతా వైసీపీయే, కానీ...

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం చాపలమడుగు పంచాయతీ సి.కొత్తపల్లి గ్రామం వైసీపీకి కంచుకోట. 90శాతం మంది వైసీపీ మద్దతుదారులే. వీరికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సురేశ్ ఒక్కసారి కూడా అటు వైపు చూడలేదు. ఆరు నెలల క్రితం మంచినీటి కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి భారీసంఖ్యలో ధర్నా చేశారు. చాపలమడుగు-సి.కొత్తపల్లి మధ్య రెండు కిలోమీటర్ల రహదారిని టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. ఆ పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్

మిగతా 11వ పేజీలో...


అన్నమయ్య కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు?



దొంగ ఓట్ల వ్యవహారంలో ఈసీ సీరియస్.. 3 రోజులు సెలవులో ఉన్న గిరీషా
నేడు విధుల్లో చేరనున్న కలెక్టర్.. ఈలోగా ఎన్నికల కమిషన్ షాక్
సీఈవోకు మాత్రమే సమాచారం.. సీఎస్‌కు తెలియజేయని వైనం! 10

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో..
భీకర యుద్ధం!

పామేడ్‌లో సీఆర్‌పీఎఫ్ క్యాంపులను చుట్టుముట్టిన నక్సల్స్
సుమారు 3 వేల మంది నక్సల్స్ పాల్గొన్నట్లు అంచనా
మంగళవారం రాత్రంతా రాకెట్ లాంచర్లు, తుపాకుల మోత
చెట్ల పైనుంచి గెరిల్లా దాడులు.. 9 మంది పోలీసులకు తీవ్ర గాయాలు!
త్రుటిలో తప్పించుకున్న 40 మంది ఏపీ కూలీలు.. తొలుత రాణా బ్లాక్
చెట్లను నరికి, మందుపాతరలను పేల్చి దిల్సాపురం రోడ్డు దిగ్బంధం
బ్యాకప్ ఫోర్స్ చేరుకోలేని విధంగా బ్లాక్.. హిడ్మా వ్యూహంగా అనుమానాలు 11



ఒక సెక్షన్.. అనేక ప్రశ్నలు!

'17ఏ'పై సుప్రీం న్యాయమూర్తుల్లో భిన్నాభిప్రాయాలు

అన్వయం, నిర్వచనంపై వేర్వేరు లెక్కలు
'దర్యాప్తు' నిర్వచనంపైనా సందిగ్ధత
దర్యాప్తు ప్రారంభమైన తేదీ కీలకమా?
నేరం జరిగిందంటున్న సమయం ముఖ్యమా?
చంద్రబాబుకు 17ఏ వర్తిస్తుందన్న జస్టిస్ బోస్
పాత 'నేరానికి' వర్తించదన్న జస్టిస్ త్రివేదీ

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒకే కేసు.. ఒకటే చట్టం.. ఒకే కోర్టు.. ఇద్దరు న్యాయమూర్తులు! వారిద్దరి అభిప్రాయాలు, తీర్పులు వేర్వేరు! స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు '17ఏ' వర్తిస్తుందా, లేదా అనే అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేదీ భిన్నమైన తీర్పులు వెలువరించిన సంగతి తెలిసిందే. 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం 'కంపీటెంట్ అథారిటీ' నుంచి అనుమతి తీసుకోనందున చంద్రబాబుపై కేసు అక్రమమే అని జస్టిస్ బోస్ అభిప్రాయపడగా... సవరణకంటే ముందుగానే జరిగిందంటున్న నేరానికి ఈ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా త్రివేదీ పేర్కొన్నారు. వీరి తీర్పులు బుధవారం అందుబాటులోకి వచ్చాయి. ఇందులో అనేక ఆసక్తికరమైన అంశాలు కనిపించాయి. దీనిపై న్యాయ నిపుణుల్లో జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది.

ఇద్దరు జస్టిస్‌లు ఇలా..

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 2021కి ముందు దర్యాప్తే ప్రారంభం కాలేదని, ఆ తర్వాతే దర్యాప్తు చేపట్టినందున సెక్షన్ 17ఏ వర్తిస్తుందని జస్టిస్ అనిరుద్ధ బోస్ పేర్కొన్నారు. 2021కంటే ముందు దర్యాప్తు జరిగినట్లు దాఖలాలు లేనందు వల్ల స్టేట్ ఆఫ్ తెలంగాణ వర్సెస్ మంగిపేట కేసు, స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ తేజ్‌మల్ చౌదరి తదితర కేసులను ప్రస్తావిస్తూ ఇవి చంద్రబాబు కేసుకు వర్తించవని పేర్కొన్నారు. ఇవే కేసులను జస్టిస్ బేలా త్రివేదీ కూడా ఉటంకిస్తూ...

మిగతా 8వ పేజీలో...


బుధవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్‌ను కలిసి తన కుమారుడి పెళ్లి పత్రికను అందజేసిన పీసీసీ చీఫ్ షర్మిల

21న ఇడుపులపాయలో..

పీసీసీ సారథిగా షర్మిల బాధ్యతల స్వీకరణ
తండ్రి సమాధి వద్ద.. ఆయన వారసురాలిగా!
హాజరు కానున్న రాష్ట్ర ఇన్‌చార్జి ఠాగూర్ 12
అదే రోజు పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరిక
నేడు కుమారుడి నిశ్చితార్థం.. రేపు సీనియర్లతో భేటీ

మాగుంట ఊసే వద్దు!

ఎంత మొనగాడో చూస్తా!.. ఆయనకే కాదు, కొడుక్కీ టికెట్ ఇవ్వను
బాలినేనికి జగన్ స్పష్టీకరణ.. సీఎంవోకు పిలిపించి మంతనాలు
ఒంగోలు, గిద్దలూరుల్లో ఎక్కడ పోటీచేస్తావని ప్రశ్న
ఇళ్ల స్థలాలిస్తేనే బరిలోకి దిగుతానన్న మాజీ మంత్రి
ఎంత ఖర్చవుతుందో తెలుసుకుని చెబుతానన్న ముఖ్యమంత్రి
మాగుంటకు చెక్ పెట్టినట్లే!.. టీడీపీ వైపు ఒంగోలు ఎంపీ చూపులు?

అమరావతి/ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'మాగుంట శ్రీనివాసులురెడ్డి మాటే ఎత్తొద్దు. ఆయన రెండు నియోజకవర్గాలను ప్రభావితం చేయగల మొనగాడట కదా? ఎంతటి మొనగాడో చూస్తా! ఎన్నికల్లో ఆయనకే కాదు.. ఆయన కొడుక్కి కూడా టికెట్ ఇవ్వను' అని సీఎం జగన్మోహన్‌రెడ్డి తేల్చిచెప్పారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. 'నువ్వు ఎక్కడ నుంచి పోటీ చేస్తావ్.. ఒంగోలు నుంచా, గిద్దలూరు నుంచా' అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా 'మాగుంట' అని బాలినేని అనేలోపే.. ఆయన ఊసే ఎత్తవద్దని

మిగతా 11వ పేజీలో...

ప్రాజెక్టుల అప్పగింతకు నెల రోజులే గడువు

8

అన్నిటినీ కృష్ణా బోర్డు పరిధిలోకి తేవాలి.. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
ఢిల్లీలో జలశక్తి శాఖ సమావేశం.. ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు హాజరు
అవుట్‌లెట్ల లెక్కలు 15 రోజుల్లో తేల్చాలి.. వారంలోగా త్రిసభ్య కమిటీ భేటీ
అప్పగింత విధివిధానాలు రూపొందించాలి.. 15 రోజుల్లో మళ్లీ సమీక్ష: కేంద్రం

దోపిడీకి ద్వారం

ఉమ్మడి తూర్పులో ఆయన 'ట్వంటీ పర్సంటేజ్ ఎమ్మెల్యే'
ముఖ్యనేత అడ్డగోలు అండతో విచ్చలవిడిగా అవినీతి
అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాల్లో 450 కోట్ల మేత
నాలుగేళ్లుగా ఐదు వందల ఎకరాల్లో కొండలు ఉఫ్
10 నియోజకవర్గాలకు ఈయనే గ్రావెల్ సరఫరాదారు
రేషన్ బియ్యంపైనే రూ.250 కోట్లకుపైగా ఆర్జన
వాటిని పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు
సరిగ్గా డబ్బులివ్వడం లేదని అక్కడే గోదాములు
పేదల స్థలాలు, మెరక పనుల్లో వంద కోట్లు చదును
రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కబ్జా
టీడీఆర్ బాండ్లలోను భారీగా బొక్కుడు
రూ.40 కోట్లకుపైగా 2 వేల నోట్ల మార్పిడి
ప్రభుత్వం కొన్న కొవిడ్ మంచాలు, పరుపులు, బకెట్లు గుట్టుగా చోరీ చేసిన కక్కుర్తి 12
సొంత రొయ్యల ఫ్యాక్టరీకి ప్రభుత్వ ఖర్చుతో బ్రిడ్జి
మూసేసిన ఓ హోటల్ నుంచి బోర్డు తిప్పేసిన చిట్‌ఫండ్ కంపెనీ వరకు వాటాలు పిండేయడమే

అమ్మో ఎమ్మెల్యే

ఆ ఎమ్మెల్యే అక్రమ సంపాదన రూ.900 కోట్లపైనే..

నియోజకవర్గంలో ఆయనను 'ట్వంటీ పర్సంటేజ్ ఎమ్మెల్యే' అని పిలుస్తారు. ఎందుకంటే.. కార్పొరేషన్, స్మార్ట్‌సిటీలో పనులకు కాంట్రాక్టర్ల నుంచి 20శాతం మామూళ్లు ఫిక్స్ చేసి నాలుగున్నరేళ్ల నుంచి పిండుతూనే ఉన్నారు. ఈ ఆదాయం ఒక్కటే రూ.8కోట్లకుపైగా ఉంటుంది. తెలియక ఓ కాంట్రాక్టర్ పదిశాతం ఇస్తానని పట్టుబడితే, ఆయనను పక్కకు తప్పించారు.

ఎమ్మెల్యేకు సొంతంగా రొయ్యల ఫ్యాక్టరీ ఉంది. దీనికి వచ్చిపోయే భారీ వాహనాలకు రహదారి సౌకర్యం లేదు. ఇదేదారిలో 20 గ్రామాలకు రోడ్డులేక ఎన్నో ఏళ్లుగా జనం ఇబ్బంది పడుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఈయనగారి రొయ్యల ఫ్యాక్టరీ రావడంతో ప్రభుత్వం స్పందించింది. రూ.2.70కోట్లతో ఏకంగా కొత్త రహదారి, బ్రిడ్జి నిర్మించింది.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాలకు గ్రావెల్ కాంట్రాక్టు ఆయనదే. ఆ ఎమ్మెల్యే పొరుగు నియోజకవర్గంలో సీఎం జగన్ పేదల ఇళ్ల పథకం ప్రారంభించారు. 322 ఎకరాలకుపైగా ఉన్న ఈ లేఅవుట్‌లో అడ్డగోలు ధరకు భూమి కొనుగోలు, లేఅవుట్ చదును కాంట్రాక్టులో ఏకంగా రూ.50కోట్లకుపైగా సంపాదించారు. తక్కువ ధరకు భూములు కొని పేదలఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి రెట్టింపు రేటుకు అంటగట్టడం ఈయన స్టైల్.

నాలుగేళ్లలోనే 500 ఎకరాల్లో విస్తరించిన కొండలను, గుట్టలను, ఫారెస్టు భూములను ఆ నేత ఉఫ్‌మని ఊదేశారు. వేల సంఖ్యలో టేకు, వేప, మామిడి చెట్లు ఇప్పుడక్కడ ఎండిపడి ఉండటం కనిపిస్తోంది. తవ్వకాల ధాటికి కొన్ని పెద్దపెద్ద కొండలు పూర్తిగా కరిగిపోయాయి. గ్రావెల్ అక్రమ తవ్వకాలతో భూ ఉపరితలం నుంచి 40నుంచి 50 అడుగుల కిందకు వందల ఎకరాలు లోయలుగా దర్శనమిస్తున్నాయి. ఇంత జరిగినా ప్రభుత్వశాఖలు ఒక్కటంటే ఒక్కటి స్పందిస్తే ఒట్టు!

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అయోవా హెచ్చరిక

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా నిలవాలనుకున్న వివేక్ రామస్వామి పోటీనుంచి తప్పుకొన్నారు. అయోవా ప్రైమరీలో వివేక్‌కు పెద్ద ఎదురుదెబ్బతగలడంతో ఆయన యుద్ధరంగంనుంచి నిష్క్రమించి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భారత సంతతికి చెందిన ఈ బయోటెక్ వ్యాపారి మూడునెలలకాలంలో రెండువందల మిలియన్ డాలర్లు వ్యాపారంలో నష్టపోయి, చివరకు రాజకీయంలోనూ నిలబడలేకపోయారని, ఇలా మెరిసి అలా మాయమైపోయారని అమెరికా పత్రిక ఒకటి ఓ వెటకారపు వ్యాఖ్యచేసింది. కానీ, న్యూహ్యాంప్‌షైర్ ప్రచారంలో తనతో వేదిక పంచుకున్న వివేక్‌ను ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు విన్న చాలామందికి వివేక్ రాజకీయభవిష్యత్తు ముగిసిపోలేదని అనిపించింది. వివేక్‌ను ట్రంప్ ప్రశంసలతో ముంచెత్తుతూ వేదికమీదకు ఆహ్వానించినప్పుడు కార్యకర్తలు వీపీ (వైస్‌ప్రెసిడెంట్) అంటూ నినాదాలు చేశారు. వివేక్ మాతోనే ఉంటారు, భవిష్యత్తులో సుదీర్ఘకాలం మాతో కలిసిసాగుతారు అన్న ట్రంప్ మాటల్లో తాను దేశాధ్యక్షుడు, వివేక్ ఉపాధ్యక్షుడు అన్న అర్థం రాజకీయ విశ్లేషకులకు కూడా గోచరించింది.

వివేక్ తన ప్రచారంలో ట్రంప్‌మీద పెద్దగా నోరుపారేసుకోలేదు. 21వ శతాబ్దపు గొప్ప అధ్యక్షుడుగా ఆయనను అభివర్ణించడంతో పాటు, ప్రచారంలో దాదాపుగా ఆయననే అనుకరించారు. ట్రంప్ నినాదాన్ని మరింత విస్తరించి అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టడం తనతోనే సాధ్యమని చెప్పుకున్నారు. తనది రాజకీయప్రచారం కాదని, భావితరాల కలలను సాకారం చేయడానికి ఉద్దేశించిన సాంస్కృతిక ఉద్యమం అన్నారాయన. చైనా, వలసల నియంత్రణ, స్థానిక ఉపాధి, అడ్డుగోడలు కట్టడం ఇత్యాది అనేకానేక అంశాల్లో ట్రంప్‌ను ఆవాహన చేసుకొని, ఆయననే అనుకరిస్తూ, మిగతా పోటీదారులను అవమానిస్తూ వివేక్ ప్రచారం సాగింది. రిపబ్లికన్ పార్టీలో ముందువరుసలో నిలవాలంటే అనుకరణ కంటే, ఇతరత్రా అంశాలు చాలా పనిచేస్తాయి. పుట్టుపూర్వోత్తరాలను దాటి మరింత నికార్సయిన అమెరికన్‌గా నిరూపించుకోవడానికి వివేక్ చేసిన ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. భారత సంతతికి చెందిన నిక్కీహాలీ విషయంలో ప్రదర్శించిన కాఠిన్యం కూడా తగినంత గుర్తింపు తెచ్చినట్టు లేదు. వివేక్ అంత దూకుడుగా, వేగంగా ఎదిగిపోవడం తోటి రిపబ్లికన్ నేతలకే రుచించలేదనడానికి పాస్టర్లు చేసిన ప్రకటనలే నిదర్శనం. ఆ తరువాత ఎవ్వరు ఎన్ని ఖండనమండనలు చేసినా పార్టీలోని అత్యధికుల మనోభిప్రాయానికి అనుగుణంగానే వివేక్ మూలాలకూ, మతానికీ సంబంధించిన ప్రస్తావనలు ముందుకు వచ్చాయన్నది వాస్తవం. అయోవా ప్రైమరీకి రెండురోజుల ముందే వివేక్‌ను అవినీతిపరుడనీ, ఆర్థిక నేరగాడని, 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' లక్ష్యానికి ప్రమాదకారి అనీ ట్రంప్ అభివర్ణించారు. ఆ నినాదం లక్ష్యాలు, ఉద్దేశాలు ఏమిటో, అది ఎవరిని శత్రువులుగా చూపుతున్నదో అందరికీ తెలిసిందే కనుక, ట్రంప్ వ్యాఖ్యలో అంతర్లీనంగా ఉన్న సందేశాన్నే అయోవా ప్రైమరీ ప్రతిఫలించింది. ట్రంప్‌కూ తనకు మధ్య పోలికకంటే తేడాలే ఎక్కువన్న విషయం రామస్వామికి అర్థమై ఉంటుంది. ఇటీవలే, 'సేవ్ ట్రంప్, ఓట్ వివేక్' ప్రచారంతో ట్రంప్ ఆగ్రహానికి గురై, ఉపాధ్యక్షుడిగా వివేక్ పేరు ఆలోచనలోనే లేదని ట్రంప్ ప్రతినిధులు వెన్వెంటనే ప్రకటించిన తరువాత కూడా వివేక్ రేపు దేశ ఉపాధ్యక్షుడవుతారా?

అయోవాలో ట్రంప్ విజయం అమెరికాకు, ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతంగా చాలామంది భయపడుతున్నారు. 88శాతం శ్వేతజాతీయులున్న అయోవా ఫలితాలు దేశమంతా ప్రతిఫలించవని మరికొందరు సర్దిచెప్పుకుంటున్నారు. ట్రంప్‌ను ఇక్కడ అడ్డుకుంటే తన భవిష్యత్తు బాగుంటుందన్న డిశాంటిస్ అంచనాలు కూడా తారుమారైనాయి. ట్రంప్ మీద ఉన్న కేసులు, నీలిచిత్రాల నటికి ఇచ్చిన ముడుపులు, తన మద్దతుదారులను రెచ్చగొట్టి కేపిటల్‌పై జరిపిన దాడులు, చట్టసభలో ఎదుర్కొన్న అభిశంసనలు ఇత్యాదివి రిపబ్లికన్ పార్టీ ఓటర్లను ప్రభావితం చేయలేదని ఈ ఎన్నిక చెబుతోంది. ప్రైమరీల్లో పోటీ చేయకుండా రెండు రాష్ట్రాల న్యాయస్థానాలు ట్రంప్‌ను అనర్హుడుగా ప్రకటించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఏమి చెబుతుందన్నది అటుంచితే, ఆయన మీద పెట్టిన కేసులన్నీ బోగస్‌వేనని పార్టీ ఓటర్లు నమ్ముతున్నట్టుంది. రేపు మిగతా రాష్ట్రాల్లోనూ ఇదే ధోరణి కొనసాగుతుందా అన్నది అటుంచితే, ట్రంప్ ఆదరణ తగ్గలేదని చెబుతున్న అయోవా నిజంగానే ఒక ప్రమాద హెచ్చరిక.

వల విసురుతున్న కృత్రిమమేధ

ఒక కొత్త యంత్రమో పరికరమో రంగ ప్రవేశం చేసినపుడు దాని మంచీ చెడుల గురించి సమాజంలో చర్చ జరగడం సహజం. ఇటీవల ప్రాచుర్యంలోనికి వచ్చిన కృత్రిమ మేధ – ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మీద అలాంటి చర్చ ఒకటి ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. తాము సేకరించి ప్రచురించిన సమాచార భాండాగారాన్ని 'చాట్ జీపీటీ' తదితర ఏఐ వేదికల ప్రమోటర్లయిన ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్ సంస్థలు తమ అనుమతి లేకుండా వినియోగించుకుంటున్నాయని విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' ఆరోపించింది. నష్టపరిహారంగా ఆ సంస్థలు తమకు భారీ మూల్యం చెల్లించాలని ఆ పత్రిక కోర్టులో దావా వేసింది. 'న్యూయార్క్ టైమ్స్' కేసు సాంకేతిక అభివృద్ధికి సంబంధించి అనేక పాత అంశాలతోపాటు కొన్ని కొత్త అంశాలనూ చర్చా వేదిక మీదికి తెచ్చింది.



ఏది మేధో సంపత్తి హక్కు అవుతుంది, ఏది కాదు? అనేవి చట్టానికీ, ఆర్థిక రంగానికీ సంబంధించిన అంశాలు. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ఏర్పడినప్పుడు వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల మీద (ట్రిప్స్) సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ చట్టాలే ఇప్పుడు అమల్లో వున్నాయి. అవే కృత్రిమ మేధకు కూడ వర్తిస్తాయి.

కృత్రిమ మేధ చాలా పనులు చేస్తుంది. మనం రోజుల కొద్దీ కసరత్తు చేసే పనుల్ని సెకన్లలో చేసి పడేస్తుంది. అదీ ఇదని కాదు ఏదైనా చేసేస్తుంది. మన గర్ల్ ఫ్రెండ్ పెయింటింగ్‌ని లియోనార్డో డావిన్సీ 'మోనాలిసా' పెయింటింగ్‌లా వేయమంటే వేసేస్తుంది. కాన్సెప్ట్, పాత్రలు, సన్నివేశాలూ ఇచ్చి ఒక స్క్రిప్టు రాయమంటే రాసేస్తుంది. ఎస్.ఎస్. రాజమౌళి, స్పీల్‌బర్గ్ పాటించే చట్రంలో రాయమన్నా రాసేస్తుంది. బాయ్‌ఫ్రెండ్‌గా, గర్ల్‌ఫ్రెండ్‌గా ఎలా ఉండమన్నా అలా ఉంటుంది. కావాలంటే సెక్స్ కూడ చేస్తుంది. నమ్మకం కుదరకపోతే 2013 నాటి స్పైక్ జోన్జ్ సినిమా 'హర్' చూడండి.

అయితే, కృత్రిమ మేధ కొన్ని పనులు చేయదు. లియోనార్డో డావిన్సీ 'మోనాలిసా' పెయింటింగ్‌ను యథాతథంగా నకలు చేసేయమంటే చేయదు. 1963 నవంబరు 22న అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ హత్యకు గురైన సందర్భంలో న్యూయార్క్ టైమ్స్ రిపోర్టును చూపించు అని అడిగితే చాట్ జీపీటీ చూపదు. అలా చేయడం చట్ట విరుద్ధం అని కూడా యూజర్‌ను హెచ్చరిస్తుంది. అంతగా మీకు కావాలంటే ఆ రిపోర్టు సారాంశాన్ని చెపుతానంటుంది. ఏ నవల గురించి అడిగినా వెంటనే సారాంశాన్ని చెప్పేస్తుంది. అంతేగానీ, ఆ నవల కాపీ కావాలంటే ఇవ్వదు. అంచేత ఏఐని చట్టపరంగా తప్పు పట్టాల్సింది ఇక్కడ కాదు. దాన్ని ఎక్కడ తప్పు పట్టాలో ఇప్పుడు చూద్దాం. దానికన్నా ముందు మనిషికీ యంత్రాలకూ ఉన్న అనుబంధాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకుందాం.

> మనిషి మెదడు పని విధానంలో అతని సామాజిక ఉనికి ప్రాత గురించి తెలిసిపోయాక మనుషుల ఆలోచనల్ని నియంత్రించడం సాధ్యం కావచ్చు. కృత్రిమ మేధ 'చైతన్యం'లో కార్పొరేట్ల ప్రయోజనాల్ని ఇమిడ్చే ప్రమాదం వుంది. అంటే కృత్రిమ మేధ తనను సృష్టించిన వారికి అనుగుణంగా యూజర్స్‌ను వశీకరణం చేసే అవకాశం ఉంది.

సృష్టిలో ప్రతి జీవి తన సంతతిని సృష్టిస్తుంది. తన సంతతి మనుగడ కోసం ఆహారాన్ని సేకరించి పెడుతుంది. మనిషి అంతటితో ఊరుకోడు; సహజసిద్ధంగా ఆహారం దొరక్కపోతే తన సంతతి జీవికను కాపాడడానికి తనే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాడు. దాని కోసం అనేక పనిముట్లను పరికరాల్ని సృష్టిస్తాడు. 'మన అవసరమే నిసలైన సృష్టికర్త' అన్నాడు గ్రీకు తత్వవేత్త ప్లేటో క్రీస్తు పూర్వం నాలుగవ శతాబ్దంలో. 'అవసరమే ఆవిష్కరణలకు తల్లి'గా ఈ మాట స్థిరపడిపోయింది. 18వ శతాబ్దపు స్కాటిష్ ఆర్థిక శాస్త్రవేత్త ఆడమ్ స్మిత్ ఇంకో అడుగు ముందుకేసి 'పనిముట్లు తయారు చేసే జీవి మనిషి' అన్నాడు.

కొత్త యంత్రాలు ప్రవేశించినపుడు ఆయా వృత్తుల్లో సాంప్రదాయికంగా ఉంటున్నవారికి తప్పక ఇబ్బంది కలుగుతుంది. గ్రామాల్లోనికి ట్రాక్టర్లతోపాటు దున్నడానికీ, ఊడ్పులు – పంటకోతలకు మెషీన్లు ప్రవేశించినపుడు రైతు కూలీలు ఉపాధిని కోల్పోతారు. ఆ సమయంలో వారికి భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తుంది. దానికి పరిష్కారం ట్రాక్టర్లను, ఆధునిక వ్యవసాయ యంత్రాలను అడ్డుకోవడం కాదు. పాత ఉపాధిని కోల్పోతున్నవారికి కొత్త ఉపాధుల్లో ఉచిత శిక్షణ ఇవ్వాలి. లేకుంటే, పునరావాసం కల్పించాలి. అయితే, ఇదంతా తాత్కాలికమే. క్రమంగా కొత్త టెక్నాలజీలో కొత్త ఉపాధి కలుగుతుంది. కంప్యూటర్లను ప్రవేశపెడుతున్న కొత్తలో 'ఆఫీసుల యాంత్రీకరణ నశించాలి' అంటూ ఉద్యోగులు నినాదాలు చేసేవారు. ఇప్పుడు ఆఫీసుల్లోనే కాదు ఇంట్లోనూ కంప్యూటర్లు వచ్చేశాయి. పిల్లల్ని బుజ్జగించడానికి చేతిలో ట్యాబ్‌లు పెడుతున్నారు. ఇటీవలి కాలంలో ఐటీ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా పెరిగాయి. ఐటీ అంటే సాఫ్ట్‌వేర్ విభాగం ఒక్కటే కాదు సెల్‌ఫోన్ రిపేరు కూడ అందులో భాగమే. ఈ పరిణామాల్ని మనం 1980ల ఆరంభంలో ఊహించలేదు. మళ్ళీ ఇప్పుడు కృత్రిమ మేధను చూసి అదే రకం భయం! ఏఐతో మానజాతి అంతరించిపోతుందనే వరకు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. అంతగా భయపడాల్సిన అవసరంలేదు. కొంతకాలం కొన్ని నిర్మాణపరమైన సర్దుబాట్లు వుంటాయి. అంతే.

కార్పొరేట్లు నిరంతరం తమ యంత్రాలను ఆధునీకరించుకుంటూ, ఉత్పత్తిని పెంచుకుంటూ, మార్కెట్‌ను విస్తరించుకుంటూ, ఫ్యాక్టరీలో తయారైన సరుకును ఎప్పటికప్పుడు అమ్ముకుంటూ వుండాలి. అమ్మలేకపోతే, కార్పొరేట్లకు లాభాలు రాకపోగా పెట్టిన పెట్టుబడి కూడ తిరిగిరాదు. ఉత్పత్తిని అమ్మితీరాలనే నియమం వుంది కనుక పెద్ద సంఖ్యలో కొనుగోలుదారుల్నీ, విస్తారమైన మార్కెట్‌ను కూడ కార్పొరేట్లే సృష్టించుకుంటూ వుంటారు. అప్పటి వరకు మానవ మనుగడకు ముప్పు వుండదు.

మనకున్న జ్ఞానం మొత్తంగా మనది కాదని మనకు చాలా స్పష్టంగా తెలుసు. అనేక మూలాల నుంచి మన మెదడులోనికి ముడి సమాచారం కుప్పలు తెప్పలుగా వచ్చి చేరుతుంటుంది. దాన్ని మన మెదడు రసాయన ప్రక్రియ ద్వారా వడగట్టి ఒక అవగాహనగా మార్చుతుంటుంది. అప్పటి నుంచి అది మన జ్ఞానంగా చెలామణీ అయిపోతుంటుంది. ఇది శరీరధర్మం. సరిగ్గా ఈ ప్రక్రియకు నకలుగానే ఆధునిక కంప్యూటర్లు ఆవిర్భవించాయి.

కంప్యూటర్లు ముడి సమాచారాన్ని ప్రాసెస్ చేసి సంస్కరించి సమాచారంగా మారుస్తాయి. ఇక్కడ సమాచారం అంటే సంస్కరింపబడిన, సూక్ష్మీకరింపబడిన ముడి సమాచారంగా భావించాలి. సమాచారమే దాని అంతిమ ఉత్పత్తి కనుక దాన్ని సమాచార సాంకేతికత అంటాం. చాలామంది టెకీలకు కూడ కంప్యూటర్ టెక్నాలజీని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అని ఎందుకు అంటారో తెలీదు.

అయితే ఇక్కడో కీలకమైన ప్రక్రియ ఒకటి జరుగుతుంటుంది. బయటి నుండి వచ్చిన ముడి సమాచారాన్ని మెదడు ఒక అవగాహనగా మార్చే సమయంలో ఆ మనిషి సామాజిక ఉనికి కీలక పాత్ర పోషిస్తుంది. 'మనుషుల ఉనికిని నిర్ణయించేది వారి చైతన్యం కాదు; తద్విరుద్ధంగా, మనుషుల సామాజిక ఉనికి వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అన్నాడు కార్ల్ మార్క్స్. ("It is not the consciousness of men that determines their being, but, on the contrary, their social being that determines their consciousness"). సామాజిక ఉనికి చైతన్యాన్ని మార్చడానికి కృత్రిమ మేధను ఉపయోగిస్తారనేది ఒక అనుమానం. అలా చేయడం ఆచరణ సాధ్యమేనా అనేది అసలు ప్రశ్న.

గోరింటాకులో చర్మానికి ఎరుపు రంగును పూసే నిర్దిష్ట రసాయనాన్ని కనుక్కోగలిగితే దాన్ని ప్రయోగశాలల్లో కృత్రిమంగా సృష్టించవచ్చు. అప్పుడు గోరింటాకు పెట్టుకోకుండానే చర్మానికి ఎరుపు రంగు పూయవచ్చు. సృష్టికి ప్రతి సృష్టి అలాగే జరుగుతుంది. మనిషి మెదడు పని విధానంలో అతని సామాజిక ఉనికి పాత్ర గురించి తెలిసిపోయాక మనుషుల ఆలోచనల్ని నియంత్రించడం సాధ్యం కావచ్చు. కృత్రిమ మేధ 'చైతన్యం'లో కార్పొరేట్ల ప్రయోజనాల్ని ఇమిడ్చే ప్రమాదం వుంది. అంటే కృత్రిమ మేధ తనను సృష్టించిన వారికి అనుగుణంగా యూజర్స్‌ను వశీకరణం చేసే అవకాశం ఉంది.

పాలస్తీనా–ఇజ్రాయిల్ యుద్ధంలో రెండు పరస్పర విరుద్ధ అభిప్రాయాలు ఉనికిలో వున్నట్టు మనకు తెలుసు. మొదటిది, పాలస్తీనా పక్షం. రెండోది, ఇజ్రాయిల్ పక్షం. కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తిదారులు ఇజ్రాయిల్ అభిమానులయితే అది ఆ అభిప్రాయాలనే యూజర్స్ మెదడుల్లో జొప్పిస్తుంది. అప్పుడు కృత్రిమ మేధ అభిప్రాయాల్ని కూడా శంకించక తప్పదు. ఒక ప్రాయోజిత కార్యక్రమంగా లక్ష్య వ్యక్తి (Target Person) ఉపచేతనలోనికి చొరబడి మూలవ్యక్తి (Sponsor) ఆలోచనల్ని జొప్పించే ప్రక్రియను క్రిష్టోఫర్ నోలాన్ 2010 నాటి సైన్స్ ఫిక్షన్ సినిమా 'ఇన్సెప్షన్'లో మనం చూస్తాము. ఇప్పుడు నిజజీవితంలోనూ కృత్రిమ మేధ అలా చేస్తుంది. అంటే మనుషుల్ని హిప్నటైజ్ చేస్తుంది. అదీ అసలు ప్రమాదం.

• డానీ
సమాజ విశ్లేషకులు

జన హృదయ విజేత

కోట్లాదిమంది జనహృదయాల్లో ఈనాటికీ జీవిస్తున్నారు ఎన్టీఆర్. ఆయన శతజయంతి ఉత్సవాలు అమెరికా, ఐరోపా, ఆ[illegible]యా, ఆసియా తదితర ఖండాల్లో ఏడాది పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమెరికాలోని అనేక నగరాల్లో మేయర్లు ఎన్టీఆర్ జయంతి రోజును తెలుగు వారసత్వ దినంగా ప్రకటించి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. 1996 జనవరి 18న ఎన్టీఆర్ మరణించారు. రాజకీయాల్లో మహానాయకుడిగా, వెండితెరపై రారాజుగా వెలుగొంది తెలుగుదనానికి చిరునామాగా నిలిచారు.

సామాజిక వ్యవస్థ కోసం రాజకీయ వ్యవస్థ ఉండాలే కానీ.. రాజకీయ వ్యవస్థ కోసం సామాజిక వ్యవస్థ ఉండకూడదన్నది ఆయన ప్రగాఢ విశ్వాసం. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి రాజకీయ వ్యవస్థ మార్గదర్శకంగా ఉండాలనేవారు. అభివృద్ధి, సంక్షేమం, సేవా రంగాలను సమదృష్టితో చూసేవారు. రాయలసీమ దుర్భిక్షం, చైనా దురాక్రమణ జరిగిన సమయంలో అమరజీవుల కుటుంబాలను ఆదుకోవడం కోసం, దివిసీమ ఉప్పెన సందర్భంలోనూ జోలె పట్టి, ఊరూరా తిరిగి నిధులు సేకరించి బాధితులను ఆదుకున్నారు. తన సతీమణి బసవతారకం పేరుతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించి లక్షలాది మంది క్యాన్సర్ రోగులకు సేవలందించారు. ఇప్పటికీ ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సినీవినీలాకాశంలో ధృవతారగా వెలుగొందారు. అందమైన రాముడు, కృష్ణుడు పాత్రలనే కాక భీష్ముడు, బృహన్నల వంటి భిన్నమైన పాత్రలు, దుర్యోధనుడు, రావణాసురుడు లాంటి ప్రతినాయక పాత్రలు పోషించి వాటిలో పరకాయప్రవేశం చేసి వాటికి జీవం పోశారు. సాంఘిక, పౌరాణిక, జానపద, చారిత్రక చిత్రాల్లో ఈ తరహాలో నటించిన నటులు మరొకరు కనిపించరు. పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసి, భగవంతుని రూపాలను సజీవంగా తెలుగు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయేలా చేశారు.



> ఎన్టీఆర్ జీవితం అసాధారణమైనది, వైవిధ్యభరితమైనది. విలక్షణమైన వ్యక్తిత్వం ఆయన సొంతం. పార్టీని విలక్షణమైన రాజకీయ పక్షంగా నిలబెట్టేందుకు అహర్నిశలు, అహోర్రాత్రులు కృషిచేశారు. సినీ, రాజకీయ విశ్వరూపంగా తెలుగు ప్రజల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయారు. తెలుగుజాతి ఔన్నత్యానికి, ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక.

ప్రజల గుండెల్లో నుంచి పుట్టినవాడే నిజమైన నాయకుడు. అలా ఉద్భవించినవాడే ఎన్టీఆర్. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్‌ను ఆరాధించారు. ప్రత్యర్థి పార్టీలు సైతం ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను పోటీపడి నిర్వహిస్తుంటాయి. ప్రజాశ్రేయస్సును శిరస్సున దాల్చి జాతిహితం కోరి ఆయన రాజకీయరంగ ప్రవేశం చేశారు. నాలుగు దశాబ్దాల పాటు తనను ఆరాధించిన ప్రజలకు ఏదైనా చేయాలని నిత్యం తపించేవారు. నూరు సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో తొమ్మిది నెలల్లో కూకటివేళ్లతో పెకలించి దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో, వారికి ఏం కావాలో ఆ దిశగా ఆలోచించి వాటిని అమలుచేశారు. రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో వేలాదిమంది యువతకు, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కట్టబెట్టిన సామాజిక ఉద్యమ నిర్మాత.

ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశం చేసే నాటికి రాష్ట్ర రాజకీయాలలో శూన్యత, స్తబ్ధత, అస్థిరత్వం నెలకొని ఉన్నాయి. తెలుగు భాషకు, జాతికి గుర్తింపు లేకుండా పోయింది. ఏ క్షణంలో ఎవరు ముఖ్యమంత్రి అవుతారో, ఎవరు ఎంతకాలం ఉంటారో తెలియని అయోమయ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజానీకం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులను ఎన్నుకోవాలనే సాంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చి ఢిల్లీ నుంచి సీల్డ్ కవర్లలో అభ్యర్థుల పేర్లు వచ్చేవి. అన్నిటికీ ఢిల్లీ పెద్దలపై ఆధారపడుతూ.. పరాన్నజీవుల్లా తయారయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు ఆపద్బాంధవుడిలా కనిపించారు. తెలుగు వారి ఆత్మగౌరవ కీర్తిపతాకాన్ని ఎగురవేసి ప్రభంజనం సృష్టించారు. ఎన్టీఆర్ వల్లే ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చింది. ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీ నాయకులను తయారుచేసే కర్మాగారం. రాజకీయాలు కొంతమందికి వృత్తి, వ్యాపారం అయిన నేపథ్యంలో.. బతకడానికి రాజకీయాల్లోకి రావొద్దు, బతుకులు మార్చడానికి రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఒకతాటిపైకి తెచ్చి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటుచేశారు. దానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. పార్లమెంట్‌లో ఒక ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరించింది. గవర్నర్ల వ్యవస్థపై, రాష్ట్రాల హక్కులపై రాజీలేని పోరాటం చేసి దేశ రాజకీయాలను మలుపుతిప్పారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూలగొట్టే కుటిల రాజనీతికి కేంద్రంలోని ఆనాటి కాంగ్రెస్ పార్టీ అలవాటు పడింది. అప్రజాస్వామికంగా ఎన్టీఆర్‌ను సైతం గద్దె దించింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజల నిరసనల హోరులో ఢిల్లీ పీఠం దద్దరిల్లింది. ఒక ముఖ్యమంత్రి కోసం యావత్ దేశం స్పందించడంతో ఎన్టీఆర్ తిరిగి నెలరోజుల్లో ముఖ్యమంత్రి అయ్యారు.

సంక్షేమానికి ఎన్టీఆరే ఆద్యుడు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించడంతో పాటు సామాజిక న్యాయం చేయాలనేదే ఆయన ప్రధానమైన ఆశయం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లని నినదించారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు, జనతా వస్త్రాల పథకం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 9 శాతం, బీసీలకు 20శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుంది. రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, వృద్ధాప్య పెన్షన్, తెలుగు గంగ వంటి అనేక పథకాలకు శ్రీకారం చుట్టారు. అధికార వికేంద్రీకరణ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడానికి మాండలిక వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారు.

ఎన్టీఆర్ జీవితం అసాధారణమైంది, వైవిధ్యభరితమైనది. విలక్షణమైన వ్యక్తిత్వం ఆయన సొంతం. పార్టీని విలక్షణమైన రాజకీయ పక్షంగా నిలబెట్టేందుకు అహర్నిశలు, అహోరాత్రులు కృషిచేశారు. సినీ, రాజకీయ విశ్వరూపంగా తెలుగు ప్రజల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయారు. తెలుగుజాతి ఔన్నత్యానికి, ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక. ప్రజాభిమానమే ఊపిరిగా శ్వాసించి, ధ్యానించి అమరుడైన ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పిద్దాం.

○ మన్నవ సుబ్బారావు

రాజకీయం చేస్తున్నదెవరు?

'రామో విగ్రహవాన్ ధర్మః', ధర్మం మానవ రూపం దాల్చితే ఎలా ఉంటుందో రాముడలా ఉంటాడని నమ్ముతాం. రాముడిని కేవలం భారతీయులు కాకుండా దక్షిణ ఆసియా దేశాలన్నీ కొలుస్తాయి. బౌద్ధ, ఇస్లామిక్ దేశాలు కూడా నమ్మటం విశేషం. మలేసియా, ఇండోనేసియా లాంటి ముస్లిం దేశాలలో రాముణ్ణి కొలుస్తారు.

మన దేశంలో శ్రీరాముడిని కొలవని వారు ఉండరు. రాముడి జన్మస్థలం మీద కొన్ని వందల సంవత్సరాలుగా వివాదం నడుస్తున్నది. 1985లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మసీదు తాళాలు తెరిపించి, ప్రజలకు దర్శనం కల్పించారు. 1989లో చెన్నై[illegible] జరిగిన విలేఖరుల సమావేశంలో రామాలయం నిర్మిస్తామని, అది అయోధ్యలోనేనని స్పష్టంగా చెప్పారు. ఈ విషయం పరాశరన్‌కి, సుబ్రహ్మణ్యస్వామికి తెలుసు. దురదృష్టవశాత్తు ఆ రాత్రి రాజీవ్ గాంధీ మరణించడం, తరువాత అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత వల్ల సామరస్యంగా పరిష్కారం కావలసిన వివాదానికి ఇన్ని రోజులు పట్టింది. ఇప్పుడు అయోధ్యలో ఆలయ నిర్మాణం జరుగుతుండడం, రామ్‌లల్లా ప్రతిష్ఠ జరగబోవటం అందరికీ ఎంతో సంతోషం కలిగించింది. శంకర భగవత్పాదులు ప్రతిపాదించిన రామ పంచాయతనం పద్ధతిలో సూర్య, శివ, గణపతి, అమ్మవార్ల దేవాలయాలతో నిర్మించడం ఇంకా ఆనందం కలుగుతున్నది. ఇంతటి ఆనందకర సన్నివేశంలో జరుగుతున్న కొన్ని పరిణామాలు మాత్రం బాధ కలిగిస్తున్నాయి.

పూరీ పీఠాధిపతి వారు చెప్పిన విషయాన్ని అర్థం చేసుకోకుండా బీజేపీ సోషల్ మీడియా వారు చేసే కామెంట్లు వింటుంటే వారిని ఆరాధించే వారికి ఎంతో దుఃఖం కలుగుతున్నది. మాకు రాముడెంత ఇష్టమో శంకర పీఠాధిపతులన్నా అంతే గౌరవం. ఏ రాజకీయ నాయకుడూ కూడా తిట్టే వారిని ఆపే ప్రయత్నం చేయకపోవడం ఇంకా విషాదం. కాంగ్రెస్ పార్టీ నాయకులెవరూ రావటం లేదంటూ పేరు పేరునా తిడుతూ, వారు హిందూ వ్యతిరేకమంటూ ప్రచారం చేస్తున్నారు. అయోధ్య అక్షింతల రూపంలో రాజకీయం చేస్తున్నదెవరు? అయోధ్యలో ఇంకా గుడి నిర్మాణం పూర్తి కాలేదు, రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ ఇంకా జరుగలేదు. పూజలు మొదలు కాని అయోధ్య గుడి నుంచి పూజ అక్షింతలు ఎలా వచ్చాయి? దేశమంతా పంచాలంటే ఎన్ని లారీలు కావాలి? ప్రజల అమాయకపు భక్తిని ఇలా అయోధ్య అక్షింతల పేరుతో మోసం చేయడం రాజకీయం కాదా? ఈ రాజకీయ ఎత్తుగడలను చూసిన పార్టీలు మేము ప్రతిష్ఠకు రాము అంటే హిందూ వ్యతిరేక ముద్ర వేస్తారా?

రామజన్మభూమి ట్రస్ట్ వారు పిలిచారు, కొన్ని రాజకీయ పార్టీలు రాము అని చెప్పాయి. అది వారి మధ్య విషయం. దీని మీద స్పందించటానికి నడ్డా ఎవరు? ఇది రాజకీయం కాదా? కేవలం అయోధ్య అక్షింతల పేరుతో ఎన్నికలలో గెలుద్దామని అనుకుంటే ప్రజలు అమాయకులు కారు. 91 ఏళ్ళ దేవెగౌడ ఇప్పుడు రావచ్చుట కానీ అద్వానీని, మురళీ మనోహర్ జోషీని తరువాత రమ్మనడం, ప్రజల కోపాన్ని చూసి ఇదేమీ లేదనటం ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఇది రాజకీయం కాదా? బీజేపీ ఇప్పటికైనా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి, వారిని ఓటర్లుగా చూడటం మానుకోవాలి. అయోధ్యలో రామమందిర నిర్మాణం, రామ్‌లల్లా ప్రతిష్ఠ మత రహితంగా భారతీయులందరకూ సంతోషకరం.

– జమలాపురపు శ్రీనివాస్

భారీ అంబేద్కర్ విగ్రహాల వెనక దాచేస్తే దాగని కుట్రలు!

ఇపుడంతా విగ్రహాల ట్రెండ్‌లా ఉంది. దేశమంతా విగ్రహాల చుట్టూ తిరుగుతుంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం రెండు ప్రముఖమైన విగ్రహ ప్రతిష్ఠల కోసం సిద్ధపడుతున్నాయి. ప్రధాని మోదీ నేతృత్వంలో, ప్రభుత్వమే అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన శ్రీరాముడి విగ్రహం ఇంకా పూర్తి కాకుండానే ప్రాణ ప్రతిష్ఠ చేసేందుకు ప్రధాని త్వరపడుతుంటే, ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో, ఎన్నికల హడావిడి ముంగిట, జగనన్న ప్రభుత్వం జనవరి 19న విజయవాడ నడిబొడ్డున, బాబాసాహెబ్ నూట పాతిక అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ కోసం శరవేగంగా సిద్ధమవుతోంది. నిజంగానే ఈ పాలకులకు రామరాజ్యంపై, అంబేద్కర్ కలలు కన్న సామాజిక న్యాయం పరిఢవిల్లే సమాజంపై శ్రద్ధ ఉందా?

శ్రీరాముడి విగ్రహ స్థాపన విషయాన్ని కాసేపు పక్కనబెడితే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం మూడు వందల కోట్లకు పైచిలుకు ఖర్చుతో నిర్మించిన అంబేద్కర్ స్మృతివనం ఆవిష్కరణ ఈ రాష్ట్రంలోని దళితులను ఓ కొత్త వేకువలోకి నడిపించనుందా?

కులం పేరుతో ఏర్పడ్డ వివక్షాయుత భారతీయ సమాజాన్ని రాజ్యాంగ హక్కుల ద్వారా, అనేక చట్టాల ద్వారా సంస్కరించిన సామాజిక న్యాయవేత్త డా. బి.ఆర్. అంబేద్కర్. ప్రభుత్వం ఆయన భారీ విగ్రహాన్ని నిలబెట్టి, ఆయన జీవిత విశేషాలతో నగరం నడిబొడ్డున స్మృతివనాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయం. ఐతే ప్రజలూ, పాలకులూ ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. షెడ్యూల్డ్ కులాల ప్రజలను, వారి అంటరానితనాన్ని రూపుమాపడానికి జీవితాంతం శ్రమించి, వారు ఇతర సమూహాలతో సమానంగా బ్రతకడానికి చట్టాలు చేసిన సామాజిక న్యాయవేత్త అంబేద్కర్ నూటపాతిక అడుగుల విగ్రహాన్ని స్థాపిస్తే ఇకపై వారిపై యథేచ్ఛగా జరుగుతున్న అత్యాచారాలు ఆగుతాయా? అసలు భారత ప్రభుత్వాలు ఎగబడి భారీ అంబేద్కర్ విగ్రహాలు పెట్టడం అనే చర్య ఆయనను అందరి నాయకుడిగా ప్రచారం చేయడానికా లేక, విగ్రహం చూపి దళితులను మభ్యపెట్టి దేశంలో మెజారిటీగా ఉన్న వారి ఓట్లను దండుకోడానికా? గాంధీ గారిని జాతిపిత అంటాం. దేశంతో పసిపిల్లలతో సహా ఆయన గురించి అందరికీ తెలుసు. కానీ దేశంలో ఎక్కడా ప్రభుత్వాలు ఆయన భారీ విగ్రహాల్ని ప్రతిష్ఠించగా చూడం. ఎందుకని? గాంధీ ఏ సామాజిక సమూహానికి చెందుతారో అది ఓటు బ్యాంకుగా ఉండేంత పెద్ద సమూహం కానందుకేనా?


ఎందుకు ఈ సందేహం కలుగుతున్నదంటే, ఈ మధ్య కాలం వరకూ అంబేద్కర్ విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నది దళితులు మాత్రమే. ఎస్సీ వాడల్లో మాత్రమే ఆయన విగ్రహం కనిపిస్తుంది తప్ప, మిగతా ఏ కులాల ఇలాకాల్లోనూ ఆయన విగ్రహం కనిపించదు. పైపెచ్చు ఊరి మధ్యలో ఎక్కడైనా ఆయన విగ్రహం నిలబెడితే, ఆ ఊరి ఆధిపత్య కులస్థులు ఆ విగ్రహాన్ని తీసేసే వరకూ నిద్రపోరు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎన్నో చోట్ల ఉదయమే లేచి ఆ విగ్రహాన్ని చూడాల్సి వస్తుందని ఆధిపత్య కులస్థులు రాత్రికి రాత్రి విగ్రహాన్ని పెకలించి పడేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గరగపర్రు ఉదంతం అందుకు ఒక ఋజువు. అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఆ ఊరి ఆధిపత్య కులస్థులు తీసిపారేసినపుడు ఉద్యమం చెలరేగిన సందర్భంలో ఈనాటి ముఖ్యమంత్రి, ఆనాటి ప్రతిపక్షనేత జగన్ రెడ్డి ఆ ఊరి దళితులను పరామర్శించారు కూడా. కానీ ఈనాటికీ రోడ్డుపక్క నిరాకరణలోనే నిలబడి ఉన్న ఆ విగ్రహాన్ని మళ్ళీ అదే చోట ప్రతిష్ఠించడానికి ఆయనెందుకు ప్రయత్నించలేదు?

> అంబేద్కర్ విగ్రహాలు కట్టడం ద్వారా ఆ సమూహాల ఉద్వేగాలను రెచ్చగొట్టి వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ప్రభుత్వాలు పక్కా ప్రణాళికతో ఎలా హైజాక్ చేస్తున్నాయో ఈ విగ్రహ రాజకీయాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఏ ప్రభుత్వం నెగ్గినా దళితులను ఓటు బ్యాంకుగా వాడుకోవడమే పరమావధిగా 'అంబేద్కర్ విగ్రహాలు పెడతాం' అన్న ప్రకటనలు చేస్తున్నాయి అనేది ఈ రోజు అందరికీ తెలిసిన సత్యమే!

భారత రాజ్యాంగం స్త్రీకి పురుషుడితో సమాన హక్కులూ కల్పించింది. ఆమెకు ఓటు హక్కు కల్పించడం ద్వారా, దేశ పాలనలో ఆమె భాగస్వామ్యాన్ని సుస్థిరం చేసింది. వైవాహిక జీవితం హింసాత్మకంగా ఉంటే విడాకులు తీసుకునే హక్కును కూడా అంబేద్కర్ రాజ్యాంగమే స్త్రీలకు కల్పించింది. ఆస్తి హక్కు, దత్తత హక్కు ఇలా ఎన్నో మహిళా సాధికారతను పెంచే హక్కులను రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ స్త్రీలకు కల్పించారు. మరి ఆ స్త్రీలందరికీ చేరేలా అంబేద్కర్ వారికి చేసిన గొప్ప మేళ్లను ఈ ప్రభుత్వాలు ఎప్పుడైనా ప్రచారం చేసాయా?

అంబేద్కర్ రాసిన థీసిస్ 'ది ప్రాబ్లెమ్ ఆఫ్ ద రూపీ'పై ఆధారపడే ఈ దేశ ఆర్థిక పరిపుష్టికి దోహదం చేసిన రిజర్వ్ బ్యాంకు రూపకల్పన జరిగింది. ఆయన హిల్టన్ యంగ్ కమిషన్‌కు సమర్పించిన సిద్ధాంతం వల్లనే సెంట్రల్ బ్యాంక్ సైతం ఏర్పడింది. ఈ దేశ సనాతన స్త్రీలు ఆ మతం విధించిన అంక్షల సంకెళ్ళ నుంచి బైటపడి, ఆస్తి హక్కు, వేతన ప్రసూతి సెలవు వంటి అనేక ప్రత్యేక హక్కులతో, సమాన వేతనాలతో, జీవిస్తున్నారంటే అందుకు అంబేద్కర్ రూపొందించిన హిందూకోడ్ బిల్లే కారణం. మరెందుకు ఈ దేశంలోని ప్రతీ కులమూ, ప్రతీ తెగా, ప్రతీ మతమూ ఆయన అసమాన కృషివల్లే ఈ స్థితిలో ఉన్నాయన్న సంగతిని ఈ విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రభుత్వాలు ప్రచారం చేయవు?

అంబేద్కర్ ఆలోచనలను నిజంగా ఈ పాలకులు అభిమానించినట్టయితే ఎందుకు ఆయన కోరిన 'కుల నిర్మూలన' సైతం ఈనాటికీ ఒక పాఠంగా పాఠ్యపుస్తకాల్లో చోటు సంపాదించుకోలేకపోయింది? సామాజిక మాధ్యమాల్లో ఆయన రాజ్యాంగ రచనను ఇతరులకు ఆపాదిస్తూ మతోన్మాదులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వం ఎందుకు నియంత్రించే ప్రయత్నం చేయదు?



ఆంధ్రప్రదేశ్‌లో దళితులు వైసీపీని భారీ మెజారిటీతో గెలిపించారన్నది నిర్వివాదాంశం. మొత్తం జనాభాలో పదహారు నుంచి పద్దెనిమిది శాతంగా ఉన్న ఎస్సీలు అంతకుముందున్న టీడీపీని ఓడించి జగన్ రెడ్డికి అధికారం కట్టబెట్టారు. ఆయన ప్రమాణ స్వీకారానికి గంట ముందు రాజమండ్రి సమీపంలో సింగంపల్లి గ్రామంలో, రెండు మామిడికాయలు కోసుకున్నందుకు బిక్కి శ్రీను అనే దళితుడిని ఆ పొలం సొంతదార్లు పంచాయతీ ఆఫీసులో ఉరేసి చంపారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసారు కానీ దళితులపై అత్యాచారాలు చేస్తే సహించం అని ఒక్క మాటా చెప్పలేదు. ఆపై దళితులపై దమనకాండ మరింత పెచ్చుమీరిపోయింది.

మాస్క్ కోసం గట్టిగా అడిగాడన్న నెపంతో దళిత డాక్టర్ సుధాకర్‌ని అధికార పక్షం వేటాడింది. ఆయన తాగుబోతని, మరో పార్టీ అభిమాని అనీ వ్యక్తిత్వ హననం చేసి, నడిరోడ్డుపై అర్ధనగ్నంగా పెడరెక్కలు విరిచి కట్టి, మోకాళ్లపై కూర్చోబెట్టి సభ్యసమాజం నివ్వెరపోయేలా అమానుషంగా ప్రవర్తించింది. చివరికి అతడు మానసిక వ్యథతో చనిపోయాడు. ఇక దళిత స్త్రీలపై అత్యాచారాలు, గ్యాంగ్ రేపులు ఎన్నో. దళిత యువకుల నోళ్లలో మూత్రం పోయడాలు, దళిత అధికారుల హత్యలు కొనసాగుతూనే వచ్చాయి. ఏకంగా అధికార పక్ష ఎమ్మెల్సీ సైతం దళితుడైన తన డ్రైవర్ని చంపి ఇంటికి డోర్ డెలివరీ చేసేంత నిర్లజ్జగా దళితులపై మారణకాండ కొనసాగింది. ఆ హంతక ఎమ్మెల్సీని తగిన రీతిన శిక్షించకుండా గౌరవ ముఖ్యమంత్రి వెంటపెట్టుకుని తిరుగుతున్నారు. జైల్లో ఉండాల్సిన హంతకుడు ఏ మాత్రం భయం, గిల్ట్ లేకుండా ప్రజల్లో నవ్వుతూ తిరుగుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల వల్ల దళితులపై అత్యాచారాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంత తేలిగ్గా తీసుకుంటుందో దళితులు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చారు. వారికోసం ఉద్దేశించిన దళిత సాధికారతా పథకాలను సైతం రద్దు చేసి వారి వెన్ను విరిచిన ఈ సమయంలో అంబేద్కర్ నూట పాతిక అడుగుల విగ్రహ స్థాపన ఎవరిని మభ్యపెట్టడం కోసం?

అంబేద్కర్ విగ్రహాలు కట్టడం ద్వారా ఆ సమూహాల ఉద్వేగాలను రెచ్చగొట్టి వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ప్రభుత్వాలు పక్కా ప్రణాళికతో ఎలా హైజాక్ చేస్తున్నాయో ఈ విగ్రహ రాజకీయాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఏ ప్రభుత్వం నెగ్గినా దళితులను ఓటు బ్యాంకుగా వాడుకోవడమే పరమావధిగా 'అంబేద్కర్ విగ్రహాలు పెడతాం' అన్న ప్రకటనలు చేస్తున్నాయి అనేది ఈ రోజు అందరికీ తెలిసిన సత్యమే!

ఈ ప్రభుత్వాలు దళితేతరుల మనసుల్లో దళితులంటే 'తక్కువవాళ్ళు' అనే భావన దూరం చేయడానికి ఎలాంటి ప్రయత్నాలూ చేయనంతవరకూ, ఈ రోజు దేశానికి ప్రధానులుగానూ ముఖ్యమంత్రులుగానూ వెలుగుతున్న శూద్ర కులస్థులు రాజకీయ అధికారం వరకూ రావడానికి కారణం అంబేద్కర్ అన్న సత్యాన్ని ఒప్పుకోనంతరకూ, ఈ దేశ దశా దిశా మార్చడంలో అంబేద్కర్ కృషిని నిజాయితీగా ప్రచారంలోకి తీసుకురానంత వరకూ– వారు ప్రతిష్ఠించే భారీ అంబేద్కర్ విగ్రహాల వెనుక ఆయన మహా కృషిని కుదించే భారీ కుట్ర దాగి ఉంటుందని ప్రజలు గ్రహించాలి. "దేశంలోని మైనారిటీలు, అణచివేయబడ్డ వారి పట్ల ఆధిపత్య వర్గాల వారు అమానుషాలకు తెగబడ్డ పక్షంలో, 'మెజారిటీలు తమ పట్ల అన్యాయం చేయవచ్చు' అని బలహీన సమూహాలు భయపడే పరిస్థితి వచ్చిన పక్షంలో, తాను రాసిన రాజ్యాంగాన్ని తగలబెట్టడానికి కూడా వెనుకాడను" అని అంబేద్కర్ ఆనాడే ఘంటాపథంగా చెప్పారు. ప్రభుత్వాలు ఈ వాక్యాలు జ్ఞాపకం చేసుకొని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడం ఈనాటి అత్యవసరం.

■ అరుణ గోగులమండ






నరకదారి

● ప్రాణసంకటంగా గుడివాడ-విజయవాడ వయా కంకిపాడు రోడ్డు





గుడివాడ నుంచి విజయవాడ వెళ్లేందుకు కీలకమైన రహదారి.. పైగా దగ్గరి దారి.. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధానమైన దారి.. ముఖ్యమైన ఈ రోడ్డుపైకి ఎక్కాలంటేనే వాహనదారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. అడుగడుగునా భారీ గోతులు.. అడ్డదిడ్డమైన గతుకులు.. కంకర లేచిన ప్రాంతాలు.. కనీసం ప్యాచ్ వర్కులకు కూడా గతి లేని దారితో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఇక బస్సులు, కార్లు, ఆటోల్లో ప్రయాణిస్తే సర్కస్ ఫీట్లే. బైకులైతే ఎక్కడ పంచర్లు పడతాయోనని భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి. గుడివాడ నుంచి విజయవాడ వెళ్లేందుకు వయా పెదపారుపూడి, కలవపాముల, కంకిపాడు వరకు ఈ రోడ్డు 23 కిలోమీటర్ల వరకూ ఉంటుంది. ఇక కీలకమైన గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఈ రోడ్డు కలుపుతుంది. ఈ దారిలో వెళ్తే టోల్‌గేట్ ఖర్చు కూడా తప్పుతుంది. ఇంత ముఖ్యమైన రహదారిని పాలకులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు గుడివాడ ఆర్టీసీ డిపోకు చెందిన విజయవాడ వెళ్లే నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను ఈ రూట్‌లో కుదించి, పామర్రు మీదుగా మరల్చారంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకోవడంతో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఇటువైపు రావడమే మానేశారు. అటు పాలకుల నిర్లక్ష్యం... ఇటు స్థానిక ప్రజాప్రతినిధుల అలక్ష్యం.. అధికారుల చేతకానితనం.. వెరసి ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారుతున్నాయి. - గుడివాడ













తహసీల్దార్లకు స్థానచలనం

- ఈనెల 22 నుంచి బదిలీలకు అవకాశం కల్పించిన సీసీఎల్‌ఏ
- ఓటర్ల తుది జాబితా వెలువడిన వెంటనే కేటాయింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి జిల్లా తహసీల్దార్ల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ జాబితాలను రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్‌ఏ) ఇప్పటికే సిద్ధం చేయగా, ఈ నెల 22 నుంచి బదిలీలు జరిగే అవకాశముంది. జోన్ 1, 2, 3, 4గా జాబితాలు సిద్ధమయ్యాయి. జోన్ 2 పరిధిలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు ఉన్నాయి. ఈ నెల 22వ తేదీన తుది ఎన్నికల జాబితా వెలువడనుంది. ఆ తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభించేందుకు సీసీఎల్‌ఏ సిద్ధంగా ఉంది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన బదిలీలు కావటంతో సీసీఎల్‌ఏనే తహసీల్దార్లను జిల్లాలకు కేటాయించనుంది. దీని ప్రకారమే కలెక్టర్ ఉత్తర్వులు ఇస్తారు.

మూడేళ్లు పూర్తిచేసుకున్నవారు

మూడేళ్లు పూర్తి చేసుకున్న వారందరినీ బదిలీ చేయాల్సిందిగా ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత స్థానిక జిల్లాకు చెందిన వారిని కూడా బదిలీ చేయాలని పేర్కొంది. నిబంధనల ప్రకారం మూడేళ్లు అని చెబుతున్నప్పటికీ దాదాపు తహసీల్దార్లు అందరినీ బదిలీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే, ఉద్యోగ సంఘాల్లో ఆఫీసు బేరర్లు కూడా బదిలీ కాక తప్పదు. కిందటి ఎన్నికల సందర్భంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని తహసీల్దార్లను ఉభయ గోదావరి జిల్లాలకు బదిలీ చేశారు. ఆయా జిల్లాలకు చెందిన తహసీల్దార్లను ఉమ్మడి కృష్ణాజిల్లాకు బదిలీ చేశారు.

ఈ నెలలోనే..

కాగా, ఈనెల 2వ తేదీన ఎన్నికల తుది జాబితా వెలువరిస్తామని చెప్పారు. ఆ తర్వాత 17వ తేదీన ప్రచురిస్తామన్నారు. ఇప్పుడేమో 22వ తేదీ అంటున్నారు. ఈ తేదీన కూడా ఓటర్ల తుది జాబితా విడుదల చేసేది అనుమానంగానే ఉంది. ఎందుకంటే.. 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం కాబట్టి, ఆ రోజున ప్రకటించే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే 26 రిపబ్లిక్ డే సెలవు కాబట్టి, 27వ తేదీన కలెక్టర్ల నుంచి ప్రతిపాదన వెళ్లాల్సి ఉంటుంది. 28న జిల్లాలకు అలాట్‌మెంట్ ఇస్తుంది. 29వ తేదీన బదిలీల ఆర్డర్లు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. 30, 31 తేదీల్లో తహసీల్దార్లు బదిలీ అయిన స్థానాలకు వెళ్లాలి.

సెక్షనల్ ఆఫీసర్లుగా పనిచేసే తహసీల్దార్ల బదిలీలు

రెవెన్యూ శాఖలో పనిచేస్తూ ఎన్నికల విధులతో సంబంధం లేని సెక్షనల్ ఆఫీసర్లను బుధవారం సీసీఎల్‌ఏ అధికారులు నాలుగు జోన్ల పరిధిలో బదిలీలు చేశారు. కలెక్టరేట్, జాయింట్ కలెక్టరేట్, సబ్ కలెక్టరేట్లలో సెక్షనల్ ఆఫీసర్లుగా పనిచేసే తహసీల్దార్లను బదిలీ చేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఎమ్మార్వో) స్థానాలు ఏ జిల్లాల్లో అయితే ఖాళీగా ఉన్నాయో ఆయా జిల్లాలకు సెక్షనల్ ఆఫీసర్లను బదిలీ చేయటం జరిగింది. దీంతో ఏఆర్వోల కొరతను తీర్చారు. ఈ బదిలీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన వారెవరూ లేరు. ఈ జిల్లాల్లో ఏఆర్వోల కొరత లేకపోవటంతో ఆయా స్థానాలకు బదిలీలు నిర్వహించలేదు.

గుడివాడపైనే గురి

'రా.. కదలిరా' బహిరంగ సభ విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

- కార్యకర్తల నుంచి జిల్లా నాయకుల దాకా అవిశ్రాంత కృషి
- నేడు కృష్ణాజిల్లాలో చంద్రబాబు పర్యటన
- ఫ్లెక్సీలు.. జెండాలతో గుడివాడ పసుపుమయం
- సభ ఏర్పాట్లలో ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు

గుడివాడ పసుపుమయమైంది. ఎటుచూసినా టీడీపీ, జనసేన సంయుక్త జెండాలు రెపరెపలాడుతున్నాయి. గుడివాడ రూరల్ మండలం మల్లాయపాలెంలో గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే 'రా.. కదలిరా' బహిరంగ సభ విజయవంతానికి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు సర్వశక్తులూ ఒడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిఒక్కరూ గెలుపు కసితో నాలుగు రోజులపాటు అలుపెరగకుండా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడలో గెలిచి తీరాలనే చైతన్యంతో ఐక్యంగా ముందుకు కదిలారు. టీడీపీ, జనసేన కలిసి ఈసారి ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో కార్యకర్తల్లో కొత్త జోష్ కనిపించింది. ఇలాంటి కీలక సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు 'రా.. కదలిరా' కార్యక్రమం గుడివాడలో ఏర్పాటు చేయడంతో ఈ కార్యక్రమం రాజకీయంగా వేడిని పుట్టిస్తోంది.



గుడివాడలో సభాస్థలి వద్ద టీడీపీ నాయకుల పర్యవేక్షణ

నేడు నిమ్మకూరులో ఎన్టీఆర్ 28వ వర్ధంతి

- అదే గ్రామంలో పూర్ టు రిచ్ కార్యక్రమం ప్రారంభం

ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్వగ్రామమైన నిమ్మకూరులో గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని నిర్వహించనున్నారు. గతేడాది మేలో ఎన్టీఆర్ శతజయంతిలో చంద్రబాబు పాల్గొన్నారు. రెండు రోజులపాటు నిమ్మకూరులోనే ఉన్న ఆయన పేదలను లక్షాధికారులుగా చేసే ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమం అమలులో భాగంగా గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని పామర్రు మండలం నిమ్మకూరులో పూర్ టు రిచ్ కార్యక్రమాన్ని లాంఛనంగా ఆయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వివరాలను చంద్రబాబు వెల్లడించనున్నారు. తొలుత నిమ్మకూరులోని ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు చంద్రబాబు దంపతులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం నిమ్మకూరు గ్రామస్తులతో కొద్దిసేపు ముచ్చటిస్తారు.

● విస్తృత ఏర్పాట్లు

చంద్రబాబు పర్యటన సందర్భంగా సభావేదిక వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల భారీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. వేదిక వద్ద ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. లక్ష మందికిపైగా ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరుకానుండటంతో ఎవరికీ ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ప్రజలను ఈ సభకు తరలించేందుకు గుడివాడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టీడీపీ 'రా కదలిరా' కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, లోకేశ్‌కు స్వాగతం పలుకుతూ టీడీపీ నాయకులు పెద్దఎత్తున గుడివాడలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రులు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, పత్తిపాటి పుల్లారావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, మండలి బుద్ధప్రసాద్, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్, వర్ల కుమార్‌రాజా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నాలుగైదు రోజులుగా ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేశారు.

● చంద్రబాబు పర్యటన ఇలా

గురువారం మధ్యాహ్నం 2.40 గంటలకు ఉండవల్లిలో హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు నిమ్మకూరుకు వస్తారు. 3.10 గంటలకు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు చంద్రబాబు దంపతులు.. ఎన్టీఆర్ కుటుంబసభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం సాయంత్రం 4.10 గంటలకు నిమ్మకూరు నుంచి హెలీకాప్టర్‌లో గుడివాడ మండలం మల్లాయపాలేనికి బయలుదేరుతారు. 4.25కు మల్లాయపాలెంలో హెలికాప్టర్ దిగి 4.30 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన 'రా కదలిరా' సభావేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల వరకు బహిరంగం సభలో పాల్గొంటారు. అనంతరం 6.15 గంటలకు మల్లాయపాలెం నుంచి బయలుదేరి ఉండవల్లికి రహదారి మార్గం ద్వారా బయలుదేరి వెళతారు.



● ట్రాఫిక్ మళ్లింపు

టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను పురస్కరించుకుని గుడివాడలో గురువారం ట్రాఫిక్ మళ్లించినట్టు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి గుడివాడలోకి భారీ వాహనాలను అనుమతించబోమని ఆయన బుధవారం తెలిపారు. వీఐపీ వాహనాలను సభావేదిక వరకు అనుమతిస్తామన్నారు. విజయవాడ, హనుమాన్‌జంక్షన్, పామర్రు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను మల్లాయపాలెం పంచాయతీ పరిధిలో ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రాంతంలో నిలిపివేయాలన్నారు. గుడ్లవల్లేరు, ముదినేపల్లి నుంచి వచ్చే వాహనాలు ముదినేపల్లి రహదారి వెంబడి పార్కింగ్ ప్రాంతంలో నిలపాలని ఆయన సూచించారు.



సీఎం వస్తున్నారు బాబోయ్

- స్వరాజ్యమైదానంలో అంబేడ్కర్ స్మృతివనం రేపు ప్రారంభం.. ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఎంజీ రోడ్డు మధ్యలో బారికేడ్లు
- వనం చుట్టూ రక్షణ వలయం

- 4లో..

రేపు ట్రాఫిక్ ఆంక్షలు

- హైవేలపై కూడా మళ్లింపు
- ఎంజీ రోడ్డులో రాకపోకలు బంద్

- 4లో..



● ఆరని జ్వాలలు

అంగన్వాడీల ఉద్యమం నానాటికీ ఉధృతమవుతోంది. బుధవారం కూడా ధర్నాచౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు ప్రసంగిస్తుండగా, అంగన్వాడీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సంతకాల సేకరణ జరిగింది.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా రత్నకుమారి?

- 4లో..

21న ముహూర్తం

వైసీపీని వీడనున్న పలువురు నేతలు

- జనసేనలోకి మచిలీపట్నం ఎంపీ బాలశౌరి
- టీడీపీలోకి పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి
- విజయవాడ నగర అధ్యక్షుడు భవకుమార్ కూడా..
- టీడీపీలోకి కాంగ్రెస్ ఎస్సీ నేత రాజీవ్ రతన్
- లోకేశ్‌ను కలిసిన భవకుమార్, రాజీవ్ రతన్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలు టీడీపీ, జనసేనలో చేరికకు ముహూర్తం నిర్ణయమైంది. 21న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి జనసేనలో చేరనుండగా, అదేరోజు పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, విజయవాడ నగర అధ్యక్షుడు భవకుమార్ టీడీపీలో చేరనున్నారు. ఈ మేరకు నాయకులు భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి 21 ఉదయం మోపిదేవి వచ్చి సుబ్రహ్మణ్యస్వామి ఆశీస్సులు తీసుకున్న అనంతరం జనసేన రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఈ మేరకు పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించేందుకు ఆయన అనుచరులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెనమలూరు ఎమ్మెల్యే సారథి సైతం టీడీపీలో చేరికకు

మిగతా 4వ పేజీలో...



గద్దె, చిన్నితో కలిసి లోకేశ్‌తో భేటీ అయిన బొప్పన భవకుమార్



చంద్రబాబు సభ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న వర్ల రామయ్య, టీడీపీ నేతలు

గుడివాడ సభకు తరలిరండి

» పార్టీ శ్రేణులకు నేతల పిలుపు

గుడివాడ జనవరి 17 : ఈ నెల 18వ తేదీన గుడివాడలో నిర్వహించనున్న 'రా.. కదిలారా' చంద్రబాబు భారీ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పిలుపునిచ్చారు. బుధవారం మల్లాయిపాలెం గ్రామపరిధిలో అలంకృత ఫంక్షన్ హాల్ ఎదురుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, షర్మిలకు పీసీసీ పదవితో జగన్‌రెడ్డికి వెన్నులో వణుకు ప్రారంభమైందన్నారు. చెల్లెలి చేతిలో వైసీపీ బలి అవ్వడం ఖాయమని, 2029కి పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. జగన్ వదిలిన బాణం రివర్స్‌లో జగన్‌కే తగులుతోందని, కాళ్లా వేళ్లా పడినా జగన్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని, చంద్రబాబు రాకకు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. గుడివాడలో టీడీపీ జెండాను తిరిగి రెపరెపలాడిస్తామన్నారు. దీనికి ఈ సభ వేదికగా నిలుస్తుందని, స్పష్టమైన సంకేతాలను నానికి ప్రజలు చూపిస్తారన్నారు. 18వ తేదీన జిల్లాలోని అన్ని రహదారులు గుడివాడ వైపే వస్తాయన్నారు. అంచనాలకు మించి ప్రజలు హాజరవుతారని, గుడివాడ పసుపుమయవుతుందన్నారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రులు పిన్నమనేని వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త ఎన్టీఆర్

» బూదవాడ విగ్రహావిష్కరణలో నెట్టెం, తాతయ్య



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో నెట్టెం, తాతయ్య

జగ్గయ్యపేటరూరల్ : దేశంలో పేద, బడుగు, బలహీన అట్టడుగు వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను రూపొందించిన తొలి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే, జాతీయ తెలుగుదేశం కోశాధికారి శ్రీరాం తాతయ్యలు చెప్పారు. బుధవారం సాయంత్రం బూదవాడ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. కొద్ది రోజుల్లో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని, స్వర్ణాంధ్రప్రదేశ్ రూపకర్త చంద్రన్న సారధ్యంలో రామరాజ్యం తిరిగి ప్రతిష్ఠ జరుగనుందని చెప్పారు. చీకటి జీవోలతో ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న జగన్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పనున్నారని తెలిపారు. వైసీపీని బంగాళాఖాతంలో కలపబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గద్దం ఏసుబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా రత్నకుమారి?



ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కృత్తివెన్ను మండల జెడ్పీటీసీ సభ్యురాలు షైలా రత్నకుమారిని నియమిస్తారనే ప్రచారం బుధవారం విస్తృతంగా జరిగింది. ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉప్పాల హారిక కొనసాగుతున్నారు. ఆమె భర్త రామును పెడన నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా మంత్రి జోగి రమేష్ స్థానంలో అధిష్ఠానం నియమించింది. దీంతో ఉప్పాల హారికను జెడ్పీ చైర్‌పర్సన్‌గా తొలగిస్తారనే ప్రచారం ఇటీవల కాలంలో అధికంగా జరుగుతూ వస్తోంది. ఉప్పాల హారిక గౌడ సామాజికవర్గానికి చెందినవారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా నియమిస్తారని ప్రచారం జరుగుతున్న షైలా రత్నకుమారి అగ్నికుల క్షత్రియ (పల్లెకారులు) సామాజికవర్గానికి చెందిన వారు. జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఓపెన్ కేటగిరీలో కేటాయించగాచ రాజకీయ లబ్ధి కోసం బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉప్పాల హారికను కూర్చోబెట్టారు. ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రతో పాటు, రెండేళ్లుగా ఈ అంశంపై వైసీపీ నాయకత్వం విస్తృత ప్రచారం చేస్తూ వస్తున్నారు. జిల్లాలో తీరప్రాంతంలో ఉన్న మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో మత్స్యకారుల ఓట్లు అధికం. జెడ్పీ చైర్‌పర్సన్‌గా షైలా రత్నకుమారిని నియమిస్తే మత్స్యకారుల ఓట్లను వైసీపీ వైపునకు తిప్పుకొనే వ్యూహంలో భాగంగా ఈ ప్రక్రియకు వైసీపీ నాయకత్వం ప్రయత్నిస్తోందనే ప్రచారం జరుగుతోంది. రత్నకుమారి 2009లో కాంగ్రెస్ పరిపాలనా కాలంలో కృత్తివెన్ను ఎంపీపీగా పనిచేశారు. 2021లో కృత్తివెన్ను మండలం నుంచి వైసీపీ తరఫున జెడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రత్నకుమారి ఇద్దరూ పెడన నియోజకవర్గానికి చెందినవారే.

వైసీపీ సెంట్రల్ ఆఫీస్ నుంచి మాట్లాడారు

వైసీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి పార్టీ ప్రతినిధులు బుధవారం తనతో మాట్లాడారని షైలా రత్నకుమారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తన సామాజికవర్గం, ఎన్నేళ్లుగా పార్టీలో కొనసాగుతు న్నారు.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారని ఆమె చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఇచ్చే అంశంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదని తెలిపారు.

రూ.90.50 లక్షల విలువైన మద్యం
రూ.2.80 కోట్ల నగదు, బంగారం స్వాధీనం

విజయవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిపిన తనిఖీలో రూ.90.50 లక్షల విలువైన మద్యం, రూ.2.80 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు కమిషనర్ టీ.కాంతిరాణా, డీసీపీ విశాల్ గున్నీ బుధవారం తెలిపారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. జనవరి నెలలో ఇప్పటి వరకు జరిపిన సోదాల్లో బాపట్ల జిల్లా జంపాని గ్రామానికి చెందిన కోగంటి విజయసాయి నుంచి రూ.25 లక్షల విలువైన విదేశీ మద్యం, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ద్వారకుంట గ్రామానికి చెందిన సిమ్మపర్తి గోపయ్య వద్ద రూ.52,100 విలువైన మద్యం, హైదరాబాద్‌కు చెందిన బొప్పి సురేష్‌ను అదుపులోకి తీసుకుని రూ.32,445 విలువైన తెలంగాణ మద్యం, కృష్ణలంకకు చెందిన మల్లెల చెన్నారెడ్డి వద్ద అక్రమంగా నిల్వ చేసిన రూ.27, 594 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. గరికపాడు చెక్‌పోస్టు వద్ద బూదవాడ చెందిన గుగులోతు చెన్నయ్యను అరెస్టు చేసి, రూ.26,380 మద్యం, కీసర టోల్‌ప్లాజా వద్ద హనుమాన్‌పేటకు చెందిన సమ్మిడి శశిధరరెడ్డి వద్ద రూ.23,310 విలువైన మద్యం, గూడవల్లిలో చాట్ల అజయ్‌కుమార్ వద్ద రూ.21 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.46,27,800 విలువైన నాటుసారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. వివిధ చెక్‌పోస్టుల వద్ద సోదాల్లో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వన్‌టౌన్ వినాయకుడి గుడి వద్ద కోయంబత్తూరులోని సేల్వపురం గ్రామానికి చెందిన దండపాణి సంతోష్ నుంచి రూ.79.51 లక్షల విలువ చేసే 838 గ్రాముల ఆభరణాలు, రూ.26.30 లక్షల నగదు, నరసరావుపేట మండలం బరంపేటకు చెందిన కొండబోయిన హనుమంతరావు వద్ద రూ.15.56 లక్షల విలువైన 237.5 గ్రాముల బంగారం, రూ.47,900 నగదు, కీసర టోల్‌ప్లాజా వద్ద గుడ్లవల్లేరుకు చెందిన యార్లగడ్డ మహేష్‌బాబు గౌడ్ నుంచి ఆధారాలు లేని రూ.69.98 లక్షల నగదు, వన్‌టౌన్‌లోని అమ్మ హోటల్ వద్ద రాజస్థాన్‌కు చెందిన సునీల్ భట్, శివలాల్ భట్ నుంచి రూ.20.60 లక్షల విలువైన 28.6 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎనికేపాడు వద్ద శాంతినగర్‌కు చెందిన తాడేల సాయి ప్రకాష్ నుంచి ఆధారాలు లేని రూ.12.20 లక్షల నగదు, హయత్‌నగర్‌కు చెందిన వీరమల్ల శంకర్‌గౌడ్ నుంచి రూ.10 లక్షలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గరికపాడు చెక్ పోస్టు వద్ద గాజువాకకు చెందిన కానుమూరి హరినాథ్ నుంచి రూ.10 లక్షలు సీజ్ చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించామన్నారు.

పత్రాలు లేని రూ.24 లక్షలు స్వాధీనం

జగ్గయ్యపేటరూరల్, జనవరి 17: సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం పోలీసులు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని రూ.24లక్షలు స్వాధీనం చేసుకున్నారు. చిల్లకల్లు ఎస్సై కృష్ణబాబు మాట్లాడుతూ, గరికపాడు చెక్‌పోస్టు వద్ద శివపురం సర్పంచ్ తాళ్ల లక్ష్మణరావు నుంచి రూ.10లక్షలు, జగ్గయ్యపేటకు చెందిన సంగిశెట్టి మస్తాన్‌బాబు నుంచి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సీఎం వస్తున్నారు బాబోయ్!

» విజయవాడలో రేపు ట్రాఫిక్ ఆంక్షలు
» ఎంజీ రోడ్డు మధ్యలో బారికేడ్లు
» స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం
» వనం చుట్టూ రక్షణ వలయం



బందరు రోడ్డులో డివైడర్ పొడవునా ఏర్పాటు చేసిన ఇనుప కంచె

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) సీఎం జగన్ పర్యటన సందర్భంగా విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డును శుక్రవారం పూర్తిగా మూసివేయనున్నారు. ఎంజీ రోడ్డులో ఉన్న స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తారు. దీని కోసం ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే ఆంక్షలు అమలు చేస్తామని పోలీసులు ప్రకటించారు. ప్రధాన రహదారిని పూర్తిగా మూసివేయడంతో పరిస్థితి ఎలా ఉంటుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, సీఎం పర్యటన నేపథ్యంలో రహదారిని పూర్తిగా మూసివేస్తే ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని భయపడుతున్నారు.

రహదారి పొడవునా బారికేడ్లు

సీఎం పర్యటన నేపథ్యంలో ఎంజీ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్వరాజ్య మైదానం ఎంజీ రోడ్డుకు మధ్యలో ఉంటుంది. దీనికి కొంతదూరంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఉంటుంది. పక్కపక్కన సాగే సీఎం కార్యక్రమాల కోసం ఏకంగా ఎంజీ రోడ్డులో సగభాగం వరకు డివైడర్‌కు చెంతనే ఇనుప కంచెను ఏర్పాటు చేశారు.

సీఎం కార్యక్రమాలు ఉన్న ప్రదేశంతోపాటు దానికి సంబంధం లేని ప్రదేశాల్లోను బారికేడ్లు ఏర్పాటు చేసి, ఇనుప కంచెను అమర్చారు. రహదారికి ఒక వైపున బెంజ్‌సర్కిల్ నుంచి పోలీసు కంట్రోల్ రూం వైపు వాహనాలు వెళ్తాయి. మరో వైపున పోలీసు కంట్రోల్ రూం నుంచి బెంజ్‌సర్కిల్ వైపు వాహనాలు వెళ్తాయి. సీఎం కాన్వాయ్ తాడేపల్లి నుంచి ముందుగానే అంబేద్కర్ స్మృతివనం వరకు చేరుకుంది. అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారు. ఎంజీ రోడ్డులోని పశువుల ఆసుపత్రి జంక్షన్ నుంచి సివిల్ సప్లయిస్ పెట్రోలు బంకు వరకు రోడ్డు డివైడర్‌కు మధ్యన ఇనుప కంచెలతో ఫెన్సింగ్ వేశారు. ఒకవైపున ఉన్న జనం మరో వైపునకు రాకుండా ఈవిధంగా ఏర్పాట్లు చేశామని పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి అంబేద్కర్ స్మృతివనం ప్రారంభించి, సభావేదిక వద్దకు వెళ్లే వరకు ట్రాఫిక్‌ను నిలుపుదల చేసుకోవచ్చు. ఆ తర్వాత ట్రాఫిక్‌ను అనుమతించుకునే అవకాశం ఉంది. తిరిగి సభ పూర్తయిన తర్వాత ట్రాఫిక్‌ను మళ్లించుకోవచ్చు. పోలీసులు మాత్రం ఉదయం 11 గంటల నుంచే ట్రాఫిక్‌ను మళ్లించడం మొదలుపెడుతున్నారు. నగరంలో సగానికి పైగా ట్రాఫిక్ ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డులో ఉంటుంది. ఎంజీ రోడ్డును రాత్రి పది గంటల వరకు మూసివేయడంతో వాహనదారులకు ఇబ్బందులు ఖాయమని ప్రజానీకం చెబుతున్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

» షోకాజు నోటీసులకు బెదరం
» 37వ రోజుకు అంగన్వాడీల ధర్నా



సంజాయిషీ పత్రాలతో సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

మచిలీపట్నం టౌన్, జనవరి 17 : ఎస్మా ప్రయోగించి షోకాజు నోటీసులు ఇచ్చినా భయపడేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. విధుల్లో చేరాలంటూ అధికారులు ఇచ్చిన షోకాజు నోటీసులకు జవాబుపత్రాలు రాసి సమర్పించేందుకు సీడీపీవో కార్యాలయానికి బుధవారం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అయితే సీడీపీవో లేకపోవడంతో నోటీసులను కార్యాలయంలో ఇచ్చారు. అనంతరం సంఘ నాయకురాలు రమాదేవి, రజనిల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ, ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి విధుల నుంచి తొలగిస్తామనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సంజాయిషీ ఇవ్వాలని నోటీసులిచ్చారని, నోటీసులకు జవాబుపత్రాలిచ్చేందుకు వస్తే అధికారులెవరూ లేకపోవడం వల్ల కార్యాలయంలో ఉంచి వెళ్లిపోతున్నామన్నారు. ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తోందని, షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని, సమ్మెను ఉధృతం చేస్తామని నాయకులు అన్నారు. ప్రభుత్వం ఎన్ని ఒత్తిడులు చేసినా ఉద్యమాన్ని విరమించేదిలేదన్నారు. అంగన్వాడీల ఆందోళనలో సీఐటీయూ నాయకులు బి.సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టికి అంగన్వాడీల సమస్యలు : బుచ్చి రాంప్రసాద్

అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి సీఎం జగన్మోహనరెడ్డి తాత్సారం చేయడం దురదృష్టకరమని టీడీపీ బ్రాహ్మణ సాధికారికత రాష్ట్ర కన్వీనర్ కె.బుచ్చిరాంప్రసాద్ ధ్వజమెత్తారు. మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీల సమ్మె బుధవారం నాటికి 37వరోజుకు చేరింది. శిబిరాన్ని బుచ్చిరాంప్రసాద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల సమ్మె వల్ల కేంద్రాల్లో బాలింతలు, గర్భవతులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు

» ఆత్మ తృప్తి కావాలంటే వారే టీడీపీలోకి రావాలి : వంగవీటి రాధా



విజయవాడ, జనవరి 17 : 'టీడీపీని వీడే ప్రసక్తే లేదు' అంటూ పార్టీ మారుతున్నారనే ప్రచారంపై టీడీపీ నేత వంగవీటి రాధా స్పందించారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను టీడీపీలోనే ఉంటానని, గాలి పార్టీ గాలి వార్తలను నమ్మవద్దని కోరారు. కొద్దిరోజులుగా పార్టీ మారుతున్నారనే ప్రచారానికి రాధా వ్యాఖ్యలతో తెరపడింది. తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదని, వైసీపీ నాయకులకు కనీసం ఆత్మ తృప్తి కావాలంటే వారే టీడీపీలోకి రావాలని రాధా ఆహ్వానించారు.

న్యాయం కోరితే నేరమా!

» బాధితులపైనే కేసుల నమోదు
» విమర్శలకు తావిస్తోన్న నందిగామ పోలీసుల తీరు

నందిగామ, జనవరి 17 : న్యాయం కోరితే నేరంగా భావించిన నందిగామ పోలీసులు బాధితులపైనే కేసు నమోదు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిహసించారు. నేరం చేసిన అధికార పార్టీ నేతపై కేసు నమోదు చేయని పోలీసులు సదరు నేత వల్ల అపహాస్యానికి గురైన మహిళపై కేసు పెట్టడం విస్మయానికి గురిచేసింది. పట్టణానికి చెందిన వైసీపీ నేత షేక్ కరీముల్లా(దుబాయ్) ఇటీవల మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యపై అభ్యంతరకరమైన మీమ్స్ రూపొందించి ప్రదర్శించారు. దీనిపై మనస్థాపానికి గురైన సౌమ్య నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంలో తాత్సారం చేయడంతో ఏసీపీని కలిసి వినతి పత్రం అందజేయాలని సౌమ్య మంగళవారం టీడీపీ నేతలతో కలిసి ర్యాలీగా బయలుదేరిన క్రమంలో స్టేషన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించి న్యాయం చేయాలని వారు ఆందోళన చేశారు. పోలీసులు బాధితులపైనే కేసు నమోదు చేసి విస్మయానికి గురిచేశారు. స్టేషన్ వద్ద ఆందోళన చేసి విధులకు ఆటంకం కలిగించారంటూ పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సౌమ్యతో పాటు నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏచూరి రామకృష్ణ, వీరంకి వీరాస్వామి, శాఖమూరి స్వర్ణలత, సబ్జా అజయ్, బాబూరావు, ఆచంట సునీత తదితరులపై కేసులు నమోదు చేశారు.

రాజారెడ్డి చట్టం అమలు చేస్తున్నారు..! : కనపర్తి

పోలీసుల తీరుపై కనపర్తి శ్రీనివాసరావు మండిపడ్డారు. దళిత మహిళ, మాజీ ఎమ్మెల్యే సౌమ్య పట్ల బహిరంగంగా అభ్యంతరకర మీమ్ ప్రదర్శిస్తే చర్యలు లేకపోవడం హేయమన్నారు. న్యాయం చేయాలని బాధితురాలు కోరితే ఆమెతో పాటు మాపై కేసు నమోదు చేయడం తగదన్నారు. పోలీసులు రాజారెడ్డి రాజ్యాంగం అనుసరిస్తున్నారన్నారు. మరో మూడు నెలల్లో ప్రభుత్వం మారడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి రాగానే నిందితులపైనా, వారికి సహకరిస్తున్న పోలీసులపైనా చర్యలు తప్పవన్నారు.

సమర్థ అధికారిపై చర్యలా!

» చర్చనీయాంశంగా ఏసీపీ వీఆర్



నందిగామ, జనవరి 17 : నందిగామ ఏసీపీ జనార్ధననాయుడును వీఆర్‌కు పంపడం చర్చనీయాంశమైంది. ఆయన్ను వీఆర్‌కు పంపుతూ, ఇన్‌చార్జి ఏసీపీగా వీవీ నాయుడుకి బాధ్యతలు అప్పగిస్తూ రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సమర్థత, సమయస్ఫూర్తి, పారదర్శకత ఉండటం వల్లనే ఆయన్ను వీఆర్‌లో పెట్టారా అంటూ.. స్థానిక ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. గత ఏడాది మేలో నందిగామ ఏసీపీగా జనార్ధననాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా పనిచేస్తూ వచ్చారు. పైరవీకారులు, పేకాట నిర్వాహకులు, అక్రమ ఇసుక మాఫియా, గుట్కా వ్యాపారులు, అసాంఘిక శక్తులు గతంలో ఏసీపీ కార్యాలయంలో చక్రం తిప్పేవి. నందిగామ డీఎస్పీగా ఎవరు బాధ్యతలు చేపట్టినా పట్టణంలోని కొందరు అక్రమ వ్యాపారులు వారిని ఆకట్టుకొని పెత్తనం చేసేవారు. వాటన్నింటికీ దూరంగా జనార్ధననాయుడు పని చేశారు. ఈదశలో ఆయన్ను వీఆర్‌కు పంపడం ప్రజలను, పోలీసులను విస్మయానికి గురి చేస్తున్నది. ట్రాఫిక్ నియంత్రణ, తెలంగాణా మద్యం అక్రమ రవాణా అరికట్టడంలో విఫలమైనందు వల్లనే వీఆర్‌కు పంపినట్టు పోలీసు వర్గాల సమాచారం.

అధికార పార్టీ ఒత్తిడితోనే..

ఏసీపీ వీఆర్ ఉదంతం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో డివిజన్ పరిధిలో పెద్దఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. ఆ ఉద్యమాలను అణచివేయాలని అధికార పార్టీ అధికారులపై ఒత్తిడి తెచ్చింది. డివిజన్‌లోని కొందరు సీఐలు అధికార పార్టీ కార్యకర్తల్లా పనిచేసి తెలుగుదేశం నాయకులపై దాడులు చేసిన ఘటనల్లో ఏసీపీ సిబ్బందిని మందలించినట్టు తెలిసింది. వీరులపాడు స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను నిర్బంధించిన సమయంలో టీడీపీ నాయకులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. దీనిపై కూడా ఏసీపీ సిబ్బందిని మందలించినట్టు తెలిసింది. ఈ ఘటనల నేపథ్యంలో అధికార పార్టీ ఆగ్రహానికి ఆయన బలై ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్షాలను కట్టడి చేసే సత్తా ఉన్న అధికారిని నియమించుకోవాలన్న ఆలోచనతోనే అధికార పార్టీ నేతలు ఇలా చేసి ఉంటారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

21న ముహూర్తం

(3వ పేజీ తరువాయి)

ఆయన అనుచరులు ఏర్పాట్లు చేస్తున్నారు. సారథితోపాటు భవకుమార్ సైతం టీడీపీలో చేరనున్నారు. వీరితోపాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పరసా రాజీవ్ రతన్ 21న టీడీపీలో చేరనున్నారు. బుధవారం రాజీవ్ రతన్ టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. తిరువూరు నియోజకవర్గం నుంచి 2014, 2019లో రెండు సార్లు కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజీవ్ పోటీ చేశారు.

అంతా ఓకే అయితే వారు కూడా..

టీడీపీ నుంచి టికెట్ హామీ లభిస్తే ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు, కృష్ణా జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. టికెట్ల విషయమై ప్రస్తుతం వీరు టీడీపీ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు. టీడీపీ నుంచి టికెట్ ఖాయమన్న హామీ లభించిన మరుక్షణం వీరు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. 21లోపు వీరి విషయంలోనూ టీడీపీ పెద్దలు ఓ నిర్ణయానికి రానున్నట్టు సమాచారం.

వైసీపీలో ఇమడలేరు : భవకుమార్

బొప్పన భవకుమార్ బుధవారం టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలిశారు. కేశినేని శివనాథ్(చిన్ని), గద్దె రామ్మోహన్‌తో కలిసి లోకేశ్ నివాసానికి వెళ్లిన ఆయన మర్యాదపూర్వకంగా యువనేతను కలిసి వచ్చారు. అనంతరం భవకుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎటువంటి షరతులు లేకుండా తాను టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి తనకు మంచి మిత్రుడని ఆయనతో కలిసి 21న టీడీపీలో చేరనున్నట్టు తెలిపారు. అమరావతి నుంచి రాజధాని తరలింపు నిర్ణయం తనను ఎంతో మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. తాను వైసీపీకి రాజీనామా చేయడానికి ప్రధాన కారణం అదేనన్నారు. అవకాశవాద రాజకీయాలు చేయడానికో, ఎమ్మెల్యే టికెట్ ఆశించో తాను టీడీపీలో చేరడం లేదన్నారు. విజయవాడ తెలుగుదేశం నేతలకు తాను సహాయకుడిగా ఉంటానన్నారు. వైసీపీ కోసం కష్టపడ్డ జలీల్ ఖాన్, పార్థసారథి, సామినేని ఉదయభాను, ఇంకా తనలాంటి వారికి ఆ పార్టీలో గౌరవం లేకుండాపోయిందన్నారు. ఈ విషయం ముందే గుర్తించి జలీల్‌ఖాన్ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారని, తాను పార్థసారథి పార్టీ వీడుతున్నామని, ఇక ఉదయభాను ఒక్కరే అక్కడ ఉన్నారన్నారు. వైసీపీలో ఎవ్వరూ ఇమడలేని పరిస్థితి నెలకొందన్నారు. విజయవాడ వైసీపీలో కూడా పెత్తనం మొత్తం ఒక్కరి చేతిలోకి పోయిందన్నారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో టీడీపీ అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు.

వైసీపీకి మూడో స్థానమే : కేశినేని చిన్ని

షర్మిల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కావడంతో వైసీపీ రాష్ట్రంలో మూడో స్థానానికి పరిమితమైనా ఆశ్చర్యం లేదని టీడీపీ నేత కేశినేని చిన్ని వ్యాఖ్యానించారు. భవకుమార్‌ను లోకేశ్ వద్దకు తీసుకెళ్లి బయటకు వచ్చిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ పార్లమెంటులో వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. టీడీపీ గేట్లు ఎత్తితే కృష్ణా నది వరదలా వైసీపీ నేతలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీట్ల సర్దుబాటుపై వారికి హామీ ఇవ్వలేకపోతున్నామని, అందుకే ఇంకా వైసీపీ ఖాళీ కాకుండా ఉందన్నారు.విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. మంచి మనస్తత్వం ఉన్న వారే తెలుగుదేశంలోకి వస్తున్నారన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

» హైవేలపైనా ట్రాఫిక్ మళ్లింపు
» ఎంజీ రోడ్డులో రాకపోకలు బంద్

విజయవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా విజయవాడలో శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అలాగే హైవేలపై ఆంక్షలు విధించారు. వివరాలను ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి, ఏసీపీ వెంకటనారాయణ వెల్లడించారు. ఎంజీ రోడ్డులో ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఆంక్షలు ఉంటాయి. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 12గంటల వరకు నగరంలో ఎలాంటి భారీ వాహనాలను అనుమతించరు. అంబులెన్స్‌లు మాత్రం ఏ మార్గంలో అయినా వెళ్లవచ్చని స్పష్టం చేశారు.

- హైదరాబాద్-విశాఖపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- విశాఖపట్నం-చెన్నై-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు హనుమాన్‌జంక్షన్ బైపాస్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా రాకపోకలు సాగించాలి.
- గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా మళ్లిస్తారు.
- చెన్నై-హైదరాబాద్-చెన్నై మార్గంలో భారీ వాహనాలను మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా మళ్లిస్తారు.
- విశాఖపట్నం-విజయవాడ మార్గంలో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులను రామవరప్పాడురింగ్, మహానాడు జంక్షన్, నోవాటెల్ హోటల్, బెంజ్‌సర్కిల్ తూర్పు ఫ్లైఓవర్, స్క్రూబ్రిడ్జి, వారధి జంక్షన్, పీఎన్‌బీఎస్‌కు మళ్లిస్తారు.
- మచిలీపట్నం-విజయవాడ మార్గంలో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు తాడిగడప 100 అడుగుల రోడ్డు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడురింగ్, మహానాడు జంక్షన్, నోవాటెల్ హోటల్, బెంజ్‌సర్కిల్ పాత ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్-విశాఖపట్నం వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, ప్రకాశం విగ్రహం జంక్షన్ కుడి వైపు నుంచి పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డు, ఏలూరు లాకు, జీఎస్ రాజు రోడ్డు, సీతన్నపేట సిగ్నల్ వద్ద నుంచి బీఆర్టీఎస్ రోడ్డు, శారదా కళాశాల జంక్షన్, ఫుడ్ జంక్షన్, పడవల రేవు, గుణదల మీదుగా రామవరప్పాడు రింగ్ నుంచి వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి మచిలీపట్నం, గుడివాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు పీసీఆర్ జంక్షన్, ఆర్టీసీ వై జంక్షన్, చల్లపల్లి బంగ్లా, హనుమాన్‌పేట, ఏలూరు లాకులు, సీతన్నపేట గేటు నుంచి బీఆర్టీఎస్ రోడ్డు, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్, ఎనికేపాడు జంక్షన్, తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా వెళ్లాలి.
- బెంజ్‌సర్కిల్-పీసీఆర్ వెళ్లే సిటీబస్సులు ఫకీర్‌గూడెం జంక్షన్, స్క్రూబ్రిడ్జి, వారధి, పీఎన్‌బీఎస్‌కు చేరుకోవాలి.
- సిటీబస్ టెర్మినల్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు పీఎన్‌బీఎస్ మధ్య గేటు నుంచి రాజీవ్‌గాంధీ పార్కు, కనకదుర్గ ఫ్లైఓవర్, స్వాతి జంక్షన్ మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లాలి.
- ఏలూరు రోడ్డు, సీతారామపురం జంక్షన్, దీప్తి జంక్షన్, రెడ్‌సర్కిల్ వరకు ఎలాంటి ట్రాఫిక్‌ను అనుమతించరు.
- శిఖామణి సెంటర్ నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు వైపు ఎలాంటి వాహనాలను అనుమతించరు.

వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు

- అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి హాజరయ్యే మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు వారి వాహనాలను సిటీ ఏఆర్ గ్రౌండ్స్‌లో నిలుపుకోవాలి.
- శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే బస్సులను ఆంధ్రా లయోల కళాశాలలో పార్కింగ్ చేసుకోవాలి.
- పార్వతీపురం, ఏఎస్ఆర్ జిల్లా, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు బీఆర్టీఎస్ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.
- గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల జిల్లాల నుంచి వచ్చే బస్సులు సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలి.
- కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి వచ్చే బస్సులను సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్‌కళాశాల ప్రాంగణంలో నిలుపుకోవాలి.
- కృష్ణా జిల్లా నుంచి వచ్చే బస్సులను మధురానగర్ జంక్షన్ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలో నిలుపుకోవాలి.
- ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే బస్సులను జింఖానా గ్రౌండ్, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో నిలుపుదల చేసుకోవాలి.

వత్సవాయి తహసీల్దార్ కార్యాలయంలో
ఏసీబీ అధికారుల విచారణ



రైతును విచారిస్తున్న అధికారి

వత్సవాయి, జనవరి 17 : వత్సవాయి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆళ్లూరుపాడు గ్రామ రైతులను బుధవారం రాత్రి విచారించారు. గ్రామానికి చెందిన ఇనామ్ భూముల సాగుదార్లను పిలిపించి వాంగ్మూలం తీసుకున్నారు. ఏసీబీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో ఇనామ్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు గ్రామ సర్పంచ్ యలవర్తి నరేంద్ర ద్వారా తహసీల్దార్ లంచం తీసుకున్నాడని ఏసీబీ దాడి చేసిన విషయం తెలిసిందే. దాడిలో రూ.50400లను నరేంద్ర వసూలు చేసి తహసీల్దార్ వైకుంఠరావుకు ఇచ్చేందుకు వెళ్లగా పట్టుకున్నారు. కేసులో భాగంగానే పూర్తిస్థాయి విచారణకు రైతుల నుంచి వాంగ్మూలం స్వీకరించారు. ఇప్పటికే చాలా మంది రైతులు ఎకరానికి రూ.60 వేలు చొప్పున పాస్‌బుక్ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రైతులను విచారిస్తున్నట్టు తెలిసింది. ఏసీబీ కేసు నేపథ్యంలో వైకుంఠరావును జిల్లా అధికారులు సస్పెండ్ చేసి, ఇన్‌చార్జ్‌గా డీటీ రవికుమార్‌ను నియమించింది.

వృద్ధ మహిళలపై అత్యాచారం కేసులో
నిందితుడికి జైలు, జరిమాన

ఉయ్యూరు, జనవరి 17 : కలవపాములలో ఇద్దరు వృద్ధ మహిళలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు కొడాలి సతీశ్‌కు విజయవాడ మహిళా కోర్టు పదేళ్ల జైలు, రూ. 4వేల జరిమానా విధించినట్టు ఉయ్యూరు రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కలవపాములకు చెందిన కొడాలి సతీశ్ 2018,19 సంవత్సరాలలో అదేగ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలపై అత్యాచారానికి పాల్పడినట్టు కేసులు నమోదు చేయగా కోర్టు విచారణలో సతీశ్ నేరానికి పాల్పడినట్టు తేలడంతో బుధవారం న్యాయాధికారి ఐశైలజాదేవి ముద్దాయికి పదేళ్ల జైలు, రూ. 4వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం, జనవరి 17 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఇనపనూరి దేవయ్య(45) నున్న వికాస్ కాలేజీ రోడ్డులోని ఓ మామిడితోటకు కాపలదారుడిగా ఉంటున్నాడు. ఈనెల 15న కోటగట్టు సెంటర్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా కళ్లు తిరిగి పడిపోయాడు. ఈ ఘటనలో గాయపడ్డ దేవయ్యను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుకిరువైపులా బస్సుల నిలిపివేత



రోడ్డుపైనే లోడింగ్

హనుమాన్‌పేటలో అడ్డగోలు పార్కింగ్

● రోడ్డుకిరువైపులా ప్రైవేట్ బస్సులు, ట్రాన్స్‌పోర్టు లారీలు నిలిపివేత

● రోడ్డుమీదే లోడింగ్, అన్‌లోడింగ్‌తో స్తంభించిన ట్రాఫిక్

వన్‌టౌన్, జనవరి 17: హనుమాన్‌పేటలో రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ బస్సులు అడ్డగోలుగా నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పాత ప్రభుత్వాసుపత్రి నుంచి గారపాటి పెట్రోల్ బంక్, సాంబమూర్తి రోడ్డు వరకు పలు ప్రైవేట్ బస్సు ట్రావెల్స్ ట్రాన్స్‌పోర్టులు అధికంగా ఉన్నాయి. ప్రైవేట్ బస్సులు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసి నిబంధనలకు విరుద్ధంగా సరుకులు ఎగుమతి చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు లారీలు కూడా రోడ్డుకు అడ్డంగా పెట్టి సరుకులు ఎగుమతి, దిగుమతి చేస్తున్నారు. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ప్రతిరోజు ఉదయం తెల్లవారుజాము నుంచే ఈ రోడ్లలో ప్రైవేట్ బస్సులను నిలిపివేసి శుభ్రం చేస్తుంటారు. మధ్యాహ్నం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన సరుకును లోడింగ్ చేస్తుంటారు. రాత్రి 10 గంటల వరకు రోడ్డుకు ఇరువైపులా బస్సులు నిలిపి వేస్తున్నారు. ఏలూరు లాకుల వైపు నుంచి బస్టాండ్ వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌లో 30 నిముషాలకు పైగానే నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానానికి వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ట్రాఫిక్ సమస్యపై పలువురు స్థానికులు పోలీసు, కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సాంబమూర్తి రోడ్డుతో పాటు సబ్‌జైల్ రోడ్డు, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్డులో కూడా ప్రైవేట్ బస్సులు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి ప్రైవేట్ బస్సు జోన్‌గా ఏర్పడుతుంది. కాగా ప్రైవేట్ బస్సులలో ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకోవాలనే నిబంధన ఉన్నప్పటికీ సరుకులు లోడ్ చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖల అధికారులు స్పందించి హనుమాన్‌పేటలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న ప్రైవేట్ బస్సులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

29 నుంచి త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు

విజయవాడ కల్చరల్, జనవరి 17 : సంగీత సన్మండలి అధ్వర్యంలో ఈనెల 29 నుంచి త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు మోదుమూడి సుధాకర్ తెలిపారు. ఈనెల 29సాయంత్రం 5 గంటలకు టి.ప్రకాష్, టి.బాలమురళీకృష్ణ నాదస్వర యుగళంతో ప్రారంభమై నాలుగు బృందాలు గాత్రకచేరీ చేస్తాయి. 30న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు 18 బృందాలు, 31న 19 బృందాలు, ఫిబ్రవరి 1న 19 బృందాలు, 2న 18 బృందాలు, 3న 18 బృందాలు, 4న 16 బృందాలు జంత్ర, గాత్ర కచేరీలు చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. 30న ఉదయం కచేరీల ప్రారంభానికి ముందు సంగీత కళాకారులందరూ హనుమంతుని త్యాగరాజ స్వామి ఉత్సవ మూర్తులతో పాటు నగర సంకీర్తన చేయనున్నట్లు తెలిపారు. 4వ ఉదయం 9 గంటలకు 300 మంది కళాకారులతో త్యాగరాజస్వామి పంచరత్న కృతి మహాబృందగానం జరగనుందని మోదుమూడి సుధాకర్ పేర్కొన్నారు.

ఇద్దరు మద్యం విక్రేతలపై కేసు

● 54 సీసాలు స్వాధీనం

చిట్టినగర్, జనవరి 17: మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న 54 మద్యం సీసాలు (180ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పాతరాజరాజేశ్వరిపేట, జక్కంపూడి కాలనీ ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందింది. దీంతో ఎస్సైలు ప్రసన్న ధనలక్ష్మి, జాన్‌లు సిబ్బందితో నిఘా పెట్టి రాజరాజేశ్వరిపేటలో మద్యం విక్రయిస్తున్న దార్ల అప్పలరాజును పట్టుకొని అతని వద్ద 34 సీసాలు(180 ఎంఎల్), జక్కంపూడి కాలనీలో గుర్రం శివకుమారిని పట్టుకొని ఆమె వద్ద నుంచి 20 సీసాలు (180ఎంఎల్) స్వాధీనం చేసుకొని వారి ఇరువురిపై కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

విద్యాధరపురం, జనవరి 17: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గాంధీబొమ్మ రోడ్డులో చెరువు లక్ష్మీనారాయణశాస్త్రి (75), భార్య సుజాతతో కలిసి ఉంటున్నారు. వీరికి సంతానం లేదు. బైపాస్ సర్జరీ కావడంతో చికిత్స పొందుతున్నారు. లక్ష్మీనారాయణశాస్త్రి మంగళవారం సుధాకర్ మెడికల్ షాపులో సూదులు కొనుక్కుని వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన వద్ద ఉన్న ఫోన్‌లో సమీప బంధువు వెంకటపద్మనాభశర్మకు విషయం తెలిపారు. ఆయన, ఇతర బంధువులతో వెళ్లి చూడగా లక్ష్మీనారాయణశాస్త్రి అపస్మారకంలో ఉండడంతో తొలుత ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, ఆ తరువాత రమేష్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కామకోటినగర్‌కు చెందిన బుర్రా వెంకట పద్మనాభశర్మ ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి టీడీపీ రా.. కదలిరా బహిరంగ సభకు భారీగా తరలిరండి

వన్‌టౌన్, జనవరి 17: కృష్ణా జిల్లా గుడివాడలో గురువారం జరగనున్న టీడీపీ రా.. కదలిరా బహిరంగ సభకు భారీగా తరలి రావాలని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ అక్రమ, అరాచక పాలనను తరిమి కొట్టేందుకు పార్టీ అధినేత చంద్రబాబు రా ..కదలిరా నినాదంతో సభలు ఏర్పాటు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ రా కదలి రా నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

ప్రతి వార్డులో ఎన్టీఆర్ వర్ధంతి

ఇదే సమయంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం పశ్చిమలోని ప్రతి డివిజన్‌లో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని బేగ్ పిలుపునిచ్చారు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు

విద్యాధరపురం: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 28వ వర్ధంతిని పురస్కరించుకుని 40వ డివిజన్ భవానీపురంలో గురువారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి సుబ్బయ్య చెప్పారు. బుధవారం డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో బ్యాంక్ సెంటర్ వద్ద పేదలకు అన్నవితరణ, వస్త్ర వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టేనర్‌పేట కొండ ప్రాంతంలో మంచినీటి సమస్య

సీపీఐ మాజీ కార్పొరేటర్ రమణబాబు

చిట్టినగర్, జనవరి 17: వేసవి ముందే కొండప్రాంతాల్లో ప్రజలకు మంచినీటి నీటి కష్టాలు తప్పడం లేదని సీపీఐ మాజీ కార్పొరేటర్ డి.వి.రమణబాబు అన్నారు. 47వ డివిజన్ టేనర్‌పేట కొండప్రాంతంలోమంచినీటి సమస్యను తెలుసుకొని రమణబాబు పలువురు సభ్యులతో కలసి ఆయా ప్రాంతాల్లో బుధవారం పర్యటించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ సప్లయ్ అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌లతో మంచినీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేనర్‌పేటలో ఐదు నెలలుగా ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి సరఫరాకు సమయపాలన లేదని, ఎప్పుడు పడితే అప్పుడు ఓ అరగంట వదిలి సరిపెడుతున్నారన్నారు. దీంతో కొంతమంది ప్రజలు తాగునీరు పట్టుకోలేకపోతున్నారన్నారు. టేనర్‌పేట అడ్డరోడ్డులో పైపులైన్‌ల కోసం తవ్వి వదిలేయటం వల్ల నీటి కష్టాలని, అధికారులు స్పందనలేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ముఖ్యంగా టేనర్‌పేట గండమాల అచ్చయమ్మ వీధి, యలపర్తి భిక్షాలు వీధి, ఐజాక్‌వీధి, జొన్నలగడ్డ మస్తాన్‌వీధి, పెద్ద మస్తాన్ వీధుల్లో మంచినీట సమస్య ఎక్కువగా ఉందని అధికారులు వెంటనే స్పందించాలన్నారు. సీపీఐ నాయకులు ఆర్ మైకేల్, టీడీపీ నాయకులు నమ్మి భానుప్రకాష్, మరుపిళ్ల దుర్గారావు, కట్టా శౌరి తదితరులు ఉన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ మాజీ కార్పొరేటర్ డి.వి.రమణబాబు, నమ్మి భాను

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం



మహిళా వలంటీర్లతో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రాజేష్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ రాణి, ఎన్ఎస్ఎస్ పీవో ఆశాలత తదితరులు

వన్‌టౌన్, జనవరి 17: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునని ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కే. రాజేష్ అన్నారు.కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని నర్సింగ్ కాలేజీలో విజయవాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నిర్వహించిన రహదారి భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను అర్థం చేసుకుని, వాటిని అమలు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్టు పెట్టుకోకపోవడం, మొబైల్ మాట్లాడుతూ బండి నడపడం, మద్యం తాగి బండి నడపడం ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వాటిని గుర్తించి అమలు చేయడం, ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించడం బాధ్యతగల పౌరుల కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు ఎంపికైన వలంటీర్లకు మై భారత్ టీ షర్టు, టోపీ, బ్యాడ్జ్ అందచేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ బి. పద్మ, వైస్ ప్రిన్సిపాల్ పి.రాణి, ఎన్ఎస్ఎస్ పీవో ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందించిన డి శోభన్‌బాబు, కుటుంబ సభ్యులు, కేవీ ప్రసాదరెడ్డి, మాడుగుల నాగఫణిశర్మకు ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

దుర్గగుడిలో అన్న వితరణకు విరాళం

వన్‌టౌన్, జనవరి 17: దుర్గగుడిలో అన్న వితరణకు భవానీపురానికి చెందిన డి శోభన్‌బాబు, కుటుంబసభ్యులు బుధవారం రూ. 1,01,116 విరాళం అందచేశారు. ఆలయ ఏఈవో రమేష్ ద్వారా విరాళం అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందచేశారు.

● తెలుగులో ద్విసహస్ర అవధాని మాడుగుల ఫణిశర్మ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డి.వెంకటరమణలు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలను అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

● దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నవితరణకు చెన్నైకు చెందిన కేవీ ప్రసాదరెడ్డి లక్ష రూపాయలు విరాళం అందచేశారు.

బుధవారం ఆలయానికి విచ్చేసిన ఆయన ఏఈవో రమేష్ ద్వారా అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు ప్రసాదం. శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

అనుసరణీయం.. చిరస్మరణీయం



'కళ కళ కోసం కాదు ప్రజా శ్రేయస్సు కోసం' అని త్రికరణ శుద్ధిగా విశ్వసించి తదనుగుణంగా నడుచుకున్న ఏకైక కథానాయకుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు అంటే అతిశయోక్తి కాదు. అనేక చిత్రాల్లో బడుగు, బలహీన వర్గాల పక్షం నిలచి వారి కోసం న్యాయపోరాటం చేసే పాత్రల్లో నటించిన యన్టీఆర్, ఆయా వర్గాల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. తనను అంతగా అభిమానించే వారికి ఏదైనా చేయాలన్న తలంపుతోనే యన్టీఆర్ రాజకీయప్రవేశం చేసిన సంగతి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కోట్ల రూపాయలు సంపాదించి, ఆ రోజుల్లోనే కోట్ల ఆదాయం చూస్తూ రాజభోగాలు అనుభవించిన యన్టీఆర్ పేదవాడే దేవుడు అని నమ్మి వారి కోసం 'తెలుగుదేశం' పార్టీ నెలకొల్పి, జనంలోకి వచ్చారు. ఆ రోజుల్లో యన్టీఆర్‌కు జనం పట్టిన బ్రహ్మరథం తరాలు మారినా అనితరసాధ్యంగానే నిలిచింది. కేవలం తొమ్మిది మాసాల్లోనే రాజకీయ రంగంలోనూ అధికారాన్ని చేజిక్కించుకొని, అప్పటికీ ఇప్పటికీ అనితర సాధ్యమైన చరిత్రను సృష్టించారు రామారావు. ఆయన రాజకీయ ప్రవేశాన్ని ఎద్దేవా చేసినవారు, అనుభవరాహిత్యం అని విమర్శించిన వారు సైతం ముక్కున వేలేసుకొనేలా పాలన సాగించి, పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి పాటు పడ్డారు యన్టీఆర్. ఆయన ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు పేర్లు మార్చుకొని, రంగులు వేసుకొని చెలామణీ అవుతున్నాయి. 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని చాటడమే కాదు, వారి పురోభివృద్ధికి అహర్నిశలూ పాటుపడ్డారు రామారావు. అందుకే తెలుగుదేశం పార్టీ ఈ నాటికీ వెలుగుతూనే ఉంది. జయాపజయాలు ఎలా ఉన్నా, తెలుగుదేశం పార్టీ మనుగడ సాగుతూనే ఉంది. భావితరాలను సైతం ప్రభావితం చేసే దిశగా పార్టీ నడక సాగిస్తోంది. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ విజయదుందుభి మోగించడానికి సిద్ధమవుతోంది. సినిమా రంగంలోనూ, రాజకీయరంగంలోనూ.. వెరసి ప్రజా జీవితంలో తాను ఉన్నప్పుడే కాదు.. తన తదనంతరం కూడా తన ప్రభావం కొనసాగేలా చేయగలగడం ఒక్క యన్టీఆర్‌కే చెల్లింది. అందుకే ఆయన యుగపురుషుడని, శకపురుషుడని చరిత్ర ఆయనకు నీరాజనాలు పలుకుతోంది. యన్టీఆర్ ఆశయసాధన కోసం పాటుపడేవారందరూ మళ్ళీ 'తెలుగుదేశం' పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారు. యన్టీఆర్ ఉండగా, తెలుగుదేశం సాధించిన ఘనవిజయాల కోవకు చెందే రీతిన విజయం సాధించాలని అన్నగారి అభిమానులు ఆశిస్తున్నారు. వారి సంకల్పం ఫలించాలని, యన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుకుందాం.

● కొమ్మినేని వేంకటేశ్వరరావు

'బిట్స్' ఇంజనీరింగ్

అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌ఎట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి.

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: bitsadmission.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bu2ITR8లో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో

అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ: బీఏ, బీకాం, బీఎస్సీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఇవి కాకుండా పీజీ డిప్లొమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in

వాఘాలో వందేమాతరం



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా భారత వైమానిక దళం నేపథ్యంలో రూపొందుతున్న దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ విశ్వసుందరి మానుషి చిల్లర్ కథానాయిక. ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న విడుదలవుతోంది. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని యూనిట్ బుధవారం పంజాబ్‌లోని వాఘా సరిహద్దుల్లో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ చిత్రబృందంతో పాల్గొన్నారు. వైమానిక దళం యుద్ధానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే గీతమిది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మిక్కీ జే మేయర్ స్వరపరచగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

మిల్లర్ కిల్లర్



ధనుష్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. సంక్రాంతికి తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ విడుదలైంది. ఈ నెల 25న తెలుగు వెర్షన్ విడుదలవుతోంది. ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగు హక్కులు సొంతం చేసుకున్నాయి. వెంకటేశ్, నాగార్జున సోషల్ మీడియా వేదికగా బుధవారం 'కెప్టెన్ మిల్లర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. బ్రిటిషర్లను తుదముట్టించే ఆవేశపరుడైన దేశభక్తుడిగా ధనుష్ సరికొత్త గెటప్పుల్లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, డాక్టర్ శివరాజ్‌కుమార్ కీలకపాత్రల్లో నటించారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. సంగీతం: జీవీప్రకాశ్ కుమార్. సాయి సిద్ధార్థ్

ఫియర్‌కు వేదికగా



హీరోయిన్ వేదిక లీడ్‌రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు దర్శకుడు కరుణాకర్ క్లాప్ ఇచ్చారు. నటుడు మురళీమోహన్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కు అందించారు. ఈ సందర్భంగా వేదిక మాట్లాడుతూ 'సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా మా దర్శకురాలు కథను తయారుచేశారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంద'న్నారు. దర్శకురాలు మాట్లాడుతూ 'ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలని ఏడాది పాటు కష్టపడి కథ తయారుచేసుకున్నాను. వేదిక పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'హరిత నా వైఫ్. తన సినీరంగం పట్ల ఇష్టం, వివిధ విభాగాలపై అవగాహన ఉన్నాయి. తను 'ఫియర్'తో దర్శకురాలిగా అరంగేట్రం చేయడం ఆనందంగా ఉంది. వేదిక ఛాలెంజింగ్ రోల్ చేస్తున్నారు' అని తెలిపారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసే అంశాలు చాలా ఉన్నాయని అరవింద్ కృష్ణ అన్నారు. పవిత్రా లోకేశ్, షాయాజీ షిండే, అనీష్ కురువిల్ల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, సినిమాటోగ్రఫీ: ఐ ఆండ్రూ

ఎక్కువగా తింటే జీడిపప్పు ప్రమాదమే!

కోవిడ్ తర్వాత బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో అనేక మంది జీడిపప్పులను తినటం ప్రారంభించారు. అయితే ఈ జీడిపప్పు వల్ల కూడా అనేక రకాల దుష్పరిణామాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అలర్జీలు

కొందరికి జీడిపప్పు తింటే పడదు. చర్మంపై దద్దుర్లు వస్తాయి. కొందరికైతే కళ్లు తిరిగినట్లు అవుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ఆధారంగా చూస్తే- మొత్తం జనాభాలో 0.5 నుంచి ఒక శాతం మందికి జీడిపప్పు అలర్జీ ఉంది.

అజీర్తి

జీడిపప్పులో కొవ్వు, ఫైబర్‌లు ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల అరుగుదల చాలా కష్టమవుతుంది. జీడిపప్పును ఎక్కువగా తింటే గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. అజీర్తి చేస్తుంది.

బరువు పెరుగుతారు

ఒక గుప్పెడు జీడిపప్పులో 160 కేలరీలు ఉంటాయి. ప్రతి రోజు వీటిని ఎక్కువగా తింటే బరువు పెరుగుతారు. బరువు తగ్గాలనుకొనే వారు జీడిపప్పును తినటం పూర్తిగా మానేస్తే మంచిది.

బ్లడ్ సుగర్ పెరుగుతుంది



జీడిపప్పు గ్లైసిమిక్ ఇండెక్స్ విలువలు తక్కువే! దీని ప్రకారం చూస్తే- వీటిని తిన్న వెంటనే బ్లడ్ సుగర్ పెరగకూడదు. అయితే తాజాగా చేసిన అధ్యయనాలలో జీడిపప్పును తిన్న వెంటనే బ్లడ్‌సుగర్ పెరుగుతుందని తేలింది. అందువల్ల మధుమేహం ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తినకూడదు.

ప్రమాదకరమైన తొక్క

తొక్క తీయని జీడిపప్పులో ఉరిషియోల్ అనే ఒక విష పదార్థం ఉంటుంది. అందువల్ల జీడిపప్పు తొక్క తగిలితే చర్మం ఎర్రబడుతుంది. దురద పెడుతుంది. అందువల్ల జీడిపప్పు తొక్కను వలిచేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి.

పచ్చివి తినవద్దు..

పచ్చి జీడిపప్పులో ఫైటిక్ యాసిడ్ అనే పదార్థం ఉంటుంది. ఈ పదార్థం కాల్షియం, ఐరన్, జింక్ మొదలైనవి శరీరంలోకి చేరకుండా అడ్డుపడుతూ ఉంటుంది. అందువల్ల పచ్చి జీడిపప్పు తినటం మంచిది కాదు. నానబెట్టిన లేదా వేయించిన జీడిపప్పులో ఇది తక్కువగా ఉంటుంది. అందువల్ల వేయించిన లేదా నానబెట్టిన జీడిపప్పు తినటం మంచిది.

కిడ్నీ స్టోన్స్

జీడిపప్పులో ఆక్సోలేట్స్ అనే కాంపౌండ్స్ ఉంటాయి. ఇవి శరీరంలో ఎక్కువగా చేరితే కిడ్నీలలో రాళ్లు ఏర్పడతాయి.

మృదువైన చర్మానికి కాకరకాయ!

నిగనిగలాడే మృదువైన చర్మం కావాలని అందరూ కోరుకుంటారు. ఇలాంటి చర్మం కోసం రకరకాలైన క్రీములు కూడా రాస్తూ ఉంటారు. ఈ క్రీములతో పాటుగా ఈ కింది ఆహారపదార్థాలు తినటం వల్ల ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ఆహార పదార్థాలేమిటో చూద్దాం.

పుదీనా

పుదీనాను ఎక్కువగా తినటం వల్ల చర్మం నిగనిగలాడుతుంది. దీనిలో ఉండే రోజ్‌మేరినిక్ యాసిడ్ వల్ల శరీరంలోని రక్తప్రసారం బాగా పెరుగుతుంది. దీని వల్ల చర్మం మృదువుగా అవుతుంది. పుదీనా ఆకులు చర్మ సంబంధ వ్యాధుల నివారణకు కూడా ఉపకరిస్తాయి.

కాకరకాయ

కాకరకాయను తినటం కష్టమే! అయితే కాకరలో మనకు ఉపకరించే విటమిన్‌ఈ, విటమిన్ సీ, కేరోటిన్ వంటి అనేక పదార్థాలు ఉన్నాయి. మన శరీరంలోని చర్మకణాలపై ఫ్రీరాడికల్స్ దాడి చేయకుండా ఇవి కాపాడుతూ ఉంటాయి.

నేరేడు పండు



చర్మాన్ని కాపాడే క్విర్‌సిటిన్, ఎలాజిక్ అనే రెండు యాసిడ్‌లు దీనిలో ఉన్నాయి. ఇవి మన చర్మాన్ని- యూవీ కిరణాల నుంచి కాపాడుతూ ఉంటాయి. నేరేడు పండు చర్మంపై ఉండే ఎర్రమచ్చలను కూడా పోగొడుతుంది.

ఉసిరి

చర్మం ఎండిపోకుండా.. నిగనిగలాడుతూ ఉండటానికి కొలేజిన్ అనే పదార్థం చాలా ముఖ్యం. దీని తయారీలో ఫైబ్రోబ్లాస్ట్ అనే పదార్థాలు ఉపకరిస్తాయి. ఇవి మన శరీరానికి తగినంత అందటంలో ఉసిరి కీలకమైన పాత్ర పోషిస్తుంది.

సెలబ్ ఫిట్



'బాసూ వేరీజ్ ద పార్టీ...' అంటూ మెగాస్టార్‌తో కలిసి ఇచ్చిన డ్యాన్స్ పార్టీతో తొలిసారి తెలుగు తెరపై మెరిసింది ఊర్వశీ రౌతెలా. ఆ 'ప్రత్యేక పాట'తో టాలీవుడ్‌లో మరికొన్ని అవకాశాలూ దక్కించుకుంది. మోడల్‌గా మొదలుపెట్టి... అందాల రాణి సింహాసనం అధిష్టించి... నటిగా అడుగులు వేస్తున్న ఊర్వశి... పేరుకు తగ్గట్టుగానే నవయవ్వనంతో యువతరాన్ని సమ్మోహితులను చేస్తోంది. వెండితెర వెలుగులకే పరిమితం కాకుండా... అభిమానులకు ఫిట్‌నెస్ లక్ష్యాలు నిర్దేశించి... వారిని ఆరోగ్యకర జీవన విధానం వైపు నడిపిస్తోంది.

ఊర్వశివో..!

పదిహేనేళ్లప్పుడు 'విల్స్ ఫ్యాషన్ వీక్'లో క్యాట్‌వాక్‌తో అలరించిన ఊర్వశీ రౌతెలా మొట్టమొదటి లక్ష్యం... మోడల్‌గా ఎదగడం. అనుకున్నట్టుగానే ఆ ఫ్యాషన్ షో.. ఆమెను తిరుగులేని మోడల్‌ను చేసింది. 2009లో 'మిస్ టీన్ ఇండియా' టైటిల్ నెగ్గింది. ప్రతిష్ఠాత్మక 'లాక్మే ఫ్యాషన్ వీక్'లో షో స్టాపర్‌గా మురిపించింది. తరువాత జరిగిన అమెజాన్, బాంబే, దుబాయ్ ఫ్యాషన్ వీక్స్‌లోనూ ఆ జోరు కొనసాగింది. 2011లో 'ఇండియన్ ప్రిన్సెస్', 'మిస్ ఏషియన్ సూపర్‌మోడల్'గా నిలిచింది. అదే ఏడాది చైనాలో జరిగిన 'మిస్ టూరిజమ్ క్వీన్ ఆఫ్ ద ఇయర్' కిరీటం దక్కించుకుని, ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. ఇవన్నీ చూసి బాలీవుడ్ పిలిచినా... 'మిస్ యూనివర్స్' పోటీల కోసం అవకాశాలను పక్కన పెట్టింది. 2012లో 'ఐయామ్ షి- మిస్ యూనివర్స్ ఇండియా' టైటిల్‌తో పాటు 'మిస్ ఫొటోజెనిక్' అవార్డు కూడా ఊర్వశి గెలుచుకుంది. అయితే అందుకు తగిన వయసు లేకపోవడంవల్ల ఆ కిరీటాన్ని వదులుకోవాల్సి వచ్చింది.


అయితే ఊర్వశి పట్టు విడవలేదు. 2015లో పోటీపడి విజేతగా నిలిచింది. అదే సంవత్సరం భారత్ తరుపున 'మిస్ యూనివర్స్'కు పోటీ పడింది. దీనికి ముందే... అంటే 2013లో మరోసారి బాలీవుడ్ ఊర్వశి తలుపు తట్టింది. సన్నీడియోల్ పక్కన ప్రాధాన్యం ఉన్న పాత్ర కావడంతో ఓకే చెప్పింది. అలా 'సింగ్ సాబ్ ద గ్రేట్' ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె... ఇక అప్పటి నుంచి ఖాళీగా ఉన్నది లేదు. వెంటనే 'యోయో హనీసింగ్' ఇంటర్నేషనల్ ఆల్బమ్ 'లవ్ డోస్'లో ఆడి పాడింది. ఒక్క హిందీ చిత్రాలకే పరిమితం కాకుండా... దక్షిణాది నుంచి వచ్చిన ఆఫర్లకూ ఓకే చెప్పింది. ఇప్పటికి అన్నీ కలిపి ఓ ఇరవై చిత్రాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఇవి కాకుండా ఎన్నో ప్రముఖ బ్రాండ్ల యాడ్ షూటింగ్‌లతో ఎంతో బిజీ అయిపోయింది.

ఇదీ మెనూ...

ప్రొటీన్స్, కార్బొహైడ్రేట్స్, హెల్దీ ఫ్యాట్స్‌తో కూడిన సమతుల ఆహారం తీసుకొంటుంది ఊర్వశి. క్రమం తప్పని వ్యాయామంతో పాటు ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తుంది. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్స్, షుగర్ ముట్టుకోదు. ఆమె మెనూలో అధికశాతం గుడ్లు, చికెన్, ఫిష్, తాజా కూరగాయలు, పండ్లు, నట్స్ ఉంటాయి. సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా... ఆమెకు ఆయుర్వేదంలో సూచించిన ఆహారం అందిస్తారు. ఎంతోమంది బాలీవుడ్ స్టార్లు, క్రికెటర్లకు న్యూట్రిషనిస్టుగా వ్యవహరిస్తున్నారు శ్వేతా. 'మూడేళ్ల కిందట మొదటిసారి ఊర్వశిని కలిశాను. తన చర్మం, శిరోజాల ఆరోగ్యం గురించి అప్పట్లో తను ఆందోళన పడుతుండేది. నిజానికి తనది చక్కని చర్మం. అంతకంటే ఆరోగ్యకరమైన జుట్టు. అధిక సమయం ఎండలో తిరగడం, కెమికల్ ట్రీట్‌మెంట్ల వల్ల అవి సహజత్వం కోల్పోయాయి. యాంటీఆక్సిడెంట్స్, సరైన హైడ్రేషన్, డీటాక్సిఫయింగ్ జ్యూస్‌లతో కూడిన ఆయుర్వేద ఆధారిత డైట్ ప్లాన్ సూచించాను' అని ఓ ఇంటర్వ్యూలో శ్వేత వెల్లడించారు. ఊర్వశి మెనూలో ప్రధానంగా మిల్లెట్స్, నెయ్యి, పండ్ల రసాలు ఉంటాయి.

- వర్కవుట్ తరువాత తీసుకొనే బ్రేక్‌ఫాస్ట్‌లో అత్యధిక పోషకాలు, శక్తినిచ్చే ఆహారం ఉండేలా డిజైన్ చేశారు శ్వేత. గుడ్లు, ప్రొటీన్ షేక్ లేదంటే మొలకెత్తిన విత్తనాలతో పోహా. ఏదైనా సరే... ఇంటి నుంచి వచ్చిన ఆహారమే తీసుకొంటుంది ఊర్వశి.
- భోజనానికి ముందు కొద్దిగా పండ్లు. ద్రాక్ష, స్ట్రాబెర్రీ ఊర్వశికి ఇష్టమైన పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో ఇంటి నుంచి వచ్చిన రోటీ, సబ్జీ, గ్రీన్ సలాడ్.
- రాత్రి భోజనం మాంసకృత్తులతో నిండి ఉంటుంది. దూది ముథియాస్ (గుజరాతీ వంటకం) లేదా పనీర్‌తో గ్రిల్‌డ్ చికెన్ లేదా ఫిష్.
- ఊర్వశికి పరాటా ఎంతో ఇష్టం. అయితే మైదా, గోధుమ పిండి కాకుండా మిల్లెట్స్‌తో చేసిన పరాటాలను ఊర్వశికి పరిచయం చేసింది శ్వేత. అలాగే అన్నానికి బదులు కాలీఫ్లవర్ రైస్‌ను ఉపయోగిస్తుంది. ఇవి కాకుండా కొరియాండర్ జ్యూస్ వారానికి ఒకసారి. ఇది డీటాక్సిఫై చేస్తుంది.

ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో పుట్టిన ఊర్వశి సొంత పట్టణం కోట్‌ద్వార్. అక్కడి 'జోసెఫ్స్ కాన్వెంట్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. ఢిల్లీ 'గార్గీ కాలేజీ' నుంచి డిగ్రీ పట్టా పొందింది. 'హేట్ స్టోరీ-4'లో విభిన్నమైన పాత్ర పోషించి ప్రశంసలు అందుకున్న ఈ భామ... 'వాల్తేరు వీరయ్య'తో ప్రత్యేక పాటల తారగా తెలుగులో అవకాశాలు పట్టేస్తోంది. మోడల్‌గా గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టి... నటిగా వరుస అవకాశాలు దక్కించుకొంటున్న ఊర్వశిని చూడగానే పాలరాతి శిల్పం గుర్తుకువస్తుంది. ఇది ఆమె అభిమానుల మాట. గమ్మత్తయిన చూపు... మైమరిపించే రూపు... మేని మెరుపు... పదిహేనేళ్ల కిందట కెరీర్ ఆరంభంలో ఎంతలా ఆకర్షణీయంగా కనిపించిందో... ఇప్పుడూ అంతే అందంగా... సౌందర్య రాశిలా అలరిస్తోంది. 'ఏవిటి మీ రహస్యం' అని అడిగితే... 'ఆహార నియమాలే నన్ను ఇంత ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుతున్నాయి' అంటుంది ఊర్వశి. ఆమె పాటించే ఆహార నియమాలు, చేసే వ్యాయామాలు ఏంటో ఓ లుక్కేద్దాం రండి.



వర్కవుట్ ఇలా...

ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టిన ప్రతిసారీ విభిన్నమైన లుక్స్‌తో ఆశ్చర్యపరుస్తుంది ఊర్వశి. ఆమె శరీరాకృతికి తగిన డ్రెస్సింగ్‌తో... ఎప్పటికప్పుడు ట్రెండీ ఫ్యాషన్ దుస్తుల్లో ఆహా అనిపిస్తుంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా.. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ వర్కవుట్ వీడియోలు అప్‌లోడ్ చేస్తూనే ఉంటుంది. దానిద్వారా వ్యాయామాన్ని తమ జీవనశైలిలో భాగం చేసుకొనే దిశగా అభిమానుల్లో ప్రేరణ కలిగిస్తుంది. ఊర్వశికి ఇన్‌స్టాలో డెబ్బై లక్షల మందికి పైగా ఫాలోవర్స్. ఏ పోస్టు పెట్టినా క్షణాల్లో లక్షల్లో లైక్‌లు వచ్చి పడతాయి. వారానికి కనీసం మూడు రోజులు జిమ్‌కు వెళ్లే ఊర్వశి వ్యాయామాల్లో యోగా, నాట్యం కూడా మిళితమై ఉంటాయి.

- ఉదయం లేవగానే యోగా, ప్రాణాయామం. యోగావల్ల కండరాలు దృఢంగా మారతాయి. ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి. ఒత్తిడి మాయమవుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శరీరానికి కావల్సినంత ప్రాణవాయువు అందుతుంది.
- 20 నిమిషాలపాటు ట్రెడ్‌మిల్ తదితర కార్డియో వ్యాయామాలు
- స్ట్రెంత్ ట్రైనింగ్‌లో బెంచ్ ప్రెస్, డంబెల్ ప్రెస్, వెయిట్‌లిఫ్టింగ్, పిలెట్స్, క్రంచెస్, ప్లాంక్స్, పుషప్స్, స్క్వాట్స్, లంగెస్
- అదనపు కేలరీలు కరగడానికి డ్యాన్స్

మంచి చేసే మెగ్నీషియం!

మన శరీరానికి అవసరమైన ఏడు ముఖ్యమైన లవణాలలో మెగ్నీషియం కూడా ఒకటి. మన శరీరంలో జరిగే బయోకెమికల్ చర్యలను నియంత్రించటానికి అవసరమయ్యే సుమారు 300 ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయటంలో మెగ్నీషియం కీలకమైన పాత్ర వహిస్తుంది. ఇలాంటి మెగ్నీషియం మన శరీరంలో ఉత్పత్తి కాదు. కేవలం మనం తినే ఆహారం నుంచే లభ్యమవుతుంది. మెగ్నీషియం మన శరీరంలో ఏ చర్యలకు ఉపకరిస్తుందో తెలుసుకుందాం.


ఎముకల పటుత్వానికి

మన శరీరంలోని 60 శాతం మెగ్నీషియం ఎముకలలోనే ఉంటుంది. మెగ్నీషియం విలువలు తక్కువ అయితే ఎముకలు గుల్లబారిపోతాయి. తరచు గాయాలవుతూ ఉంటాయి. రక్తంలో మెగ్నీషియం విలువలు తక్కువగా ఉంటే- రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

అజీర్తిని హరించటానికి

మెగ్నీషియం వల్ల అజీర్తి సమస్యలు తొలగిపోతాయి. మెగ్నీషియం మలాన్ని మృదువుగా చేసి బయటకు పంపటంలో కీలకమైన పాత్ర వహిస్తుంది. తీవ్రమైన అజీర్తి సమస్య ఉన్నవారు 28 రోజులు మెగ్నీషియం సప్లిమెంట్స్‌ను వాడితే - ఆ సమస్య తొలగిపోతుంది.

మానసిక ఆరోగ్యం కోసం..



రకరకాల మానసిక సమస్యలకు మెగ్నీషియం సరైన మోతాదులో లేకపోవటమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఆందోళన, అలజడి, ఒత్తిడికి లోనుకావటం వంటి సమస్యలకు మెగ్నీషియం కూడా ఒక కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

నిద్ర కోసం..

మెగ్నీషియం సరైన మోతాదులో లేకపోతే నిద్ర సరిగ్గా పట్టదు. అంతే కాకుండా నిద్రపోయే విధానంలో కూడా మార్పు వస్తుంది. అందువల్ల సరిగ్గా నిద్ర పట్టనివారు మెగ్నీషియం విలువలను పరీక్షించుకోవటం మంచిది.


మైగ్రేన్‌కు మంచి మందు..

మైగ్రేన్ తగ్గటానికి మెగ్నీషియం మంచి మందు. తాజా పరిశోధనల ప్రకారం- మెగ్నీషియం ఇంజెక్షన్లు 15 నుంచి 30 నిమిషాలలో మైగ్రేన్‌ను తగ్గిస్తాయి.

మధుమేహ నియంత్రణలో కూడా..

ఇన్సులిన్ నియంత్రణలో మెగ్నీషియం కీలకమైన పాత్ర పోషిస్తుంది. మెగ్నీషియం విలువలు సక్రమంగా లేకపోతే- మధుమేహ నియంత్రణ సాధ్యం కాదు. అంతే కాకుండా ఇన్సులిన్‌ను సమర్థంగా ఉపయోగించుకోవటంలో కూడా మెగ్నీషియందే ముఖ్యమైన పాత్ర!

కౌన్సెలింగ్



పెదవుల మీద పుండ్లు ఎందుకు?

డాక్టర్! గత కొన్ని రోజులుగా నా పెదవుల మీద పుండ్లు ఏర్పడి పైపూత మందులు వాడుతున్నా తగ్గడం లేదు. నాలుగు నెలల క్రితం సురక్షిత పద్ధతులు పాటించకుండా అపరిచిత వ్యక్తితో లైంగికంగా కలిశాను. ఈ పుండ్లు ఏదైనా సుఖ వ్యాధికి సూచనలా?

- ఓ సోదరి, మిర్యాలగూడ

పెదవులు మీద పుండ్లు హెర్పిస్ వ్యాధి లక్షణం. హెర్పిస్ సింప్లెక్స్ వైరస్ సోకితే పెదవులు, ముఖం, ఛాతీ, వేళ్ల మీద పుండ్లు ఏర్పడతాయి. అలాగే జననావయవాల చుట్టూ నీటి బొబ్బలు కూడా తలెత్తుతాయి. ఈ వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స అందించకపోతే కళ్లు, మెదడు ఇన్‌ఫెక్షన్లకు లోనవుతాయి. హెర్పిస్ సింప్లెక్స్ వైరస్‌లలో రకాలు కూడా ఉన్నాయి. హెర్పిస్ సింప్లెక్స్ 1 అనే వైరస్ సోకితే, లక్షణాలు నడుము పై భాగంలో కనిపిస్తాయి. ఈ వైరస్ లైంగికంగా కలవకపోయినా, ముద్దులు పెట్టుకోవడం, వస్తువులను షేర్ కోసుకోవడం వల్ల కూడా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. హెర్పిస్ సింప్లెక్స్ 2 అనే వైరస్ లక్షణాలు నడుము కింది భాగంలో బయల్పడతాయి. ఈ వైరస్ లైంగిక కలయిక ద్వారానే సంక్రమిస్తుంది. కాబట్టి హెర్పిస్ ఉన్న వ్యక్తితో ఏ రకంగా సన్నిహితంగా మెలిగినా ఏదో ఒక హెర్పిస్ రకం వైరస్ కచ్చితంగా సోకుతుంది. హెర్పిస్ వ్యాధిని యాంటీవైరస్ మందులతో తగ్గించవచ్చు. కానీ ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించడం సాధ్యం కాదు. కాబట్టి వీలైనంత త్వరగా వైద్యులను సంప్రతించి వ్యాధి మరింత ముదిరిపోకుండా నియంత్రించుకోండి.

డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్, హైదరాబాద్

బొద్దుగా ఉంటే ముద్దుగా ఉంటారేమోకానీ, అందాల పోటీలకు పనికి రారు అనుకోవడం పొరపాటని నిరూపించింది కర్మండుకు చెందిన జేన్ దీపిక గ్యారెట్. గత ఏడాది మిస్ నేపాల్‌గా గెలిచిన జేన్, 2023 మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొన్న మొట్టమొదటి ప్లస్ సైజ్ అభ్యర్థిగా గుర్తింపు పొందింది. ఆవిడ గురించిన మరిన్ని విశేషాలు.

ప్లస్ సైజ్ బ్యూటీ

"ఐదడుగుల ఏడంగుళాల ఎత్తు, 80 కిలోల బరువుతో అందం ప్రమాణాలను అందుకోలేని నేను ఈ పోటీలో పాల్గొనడం వెనకొక ప్రధాన ఉద్దేశం ఉంది. అధిక బరువు, హార్మోన్ సమస్యలతో బాధపడే మహిళలకు ప్రాతినిధ్యం వహించడం కోసమే నేనీ పోటీలో పాల్గొని గెలిచాను. లావుగా ఉన్నంత మాత్రాన అందవిహీనంగా ఉన్నామని భావించవలసిన అవసరం లేదు. అధిక బరువుతో కూడా అందంగా కనిపించే వీలుంది అనడానికి నా గెలుపే ఒక ఉదాహరణ" అంటూ గత ఏడాది మిస్ నేపాల్‌గా గెలుపొందిన సందర్భంగా జేన్ ఇలా తన అభిప్రాయాన్ని మీడియాతో పంచుకుంది. 23 ఏళ్ల జేన్ అమెరికాలో పుట్టిన నేపాలీ మోడల్. మిస్ యూనివర్స్ 2023 టాప్ 20 జాబితాలో చోటు దక్కించుకున్న జేన్, ఈ పోటీలో సెమి ఫైనల్స్‌కు చేరిన మొట్టమొదటి ప్లస్ సైజ్ యువతిగా పేరు తెచ్చుకుంది.

అభద్రతను వదిలించి....

వృత్తిపరంగా నర్సు అయిన జేన్, మహిళల్లోని హార్మోన్ల హెచ్చుతగ్గులు, అవి మహిళల మానసిక ఆరోగ్యంపై చూపించే ప్రభావాల గురించి ప్రపంచానికి చాటి చెప్పడం కోసం తాను మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొన్నానని అంటోంది. జేన్ తానెదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడింది. ఆవిడ పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ వల్ల విపరీతమైన డిప్రెషన్‌కు లోనైంది. అయినప్పటికీ ఓ పక్క కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటూ, తనకున్న ఫ్యాషన్‌కొద్దీ అందాల ప్రపంచంలో ఎదగడం మొదలుపెట్టింది. నటన, మోడలింగ్‌లో పట్టు సాధించింది. అందాల పోటీల్లో నాజూకుదనానికే పెద్ద పీట వేస్తారు. ప్రారంభంలో తాను అనుభవించిన ఆత్మన్యూనత గురించి ప్రస్తావిస్తూ... "నేనెంతో అభద్రతకు లోనయ్యాను. మిగతా అమ్మాయిలతో నన్ను నేను పోల్చుకుంటూ, నేను వాళ్లలా పొడవుగా, నాజూకుగా లేనని ఎంతో బాధపడేదాన్ని" అంటూ చెప్పుకొచ్చింది జేన్. అందాల పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టిన తొలిరోజుల్లో ఆవిడ శరీర బరువును చూసి ఎందరో హేళన చేయడం, బాడీ షేమింగ్‌తో విపరీతమైన ఒత్తిడికి లోనవడం లాంటివి కూడా జరిగాయి. అయినప్పటికీ నర్సు వృత్తి తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనీ, ఎన్నో అనుభవాలను పొందే అవకాశాన్ని కల్పించిందనీ జేన్ మీడియాతో చెప్పుకొచ్చింది.

స్విమ్‌సూట్‌లో...

అందాల పోటీల్లో పాల్గొనే అభ్యర్థులకు అసౌకర్యానికి గురి చేసే రౌండ్ ఇది. మరీ ముఖ్యంగా జేన్ లాంటి బొద్దుగా ఉండే అమ్మాయిలు ఈ రౌండ్‌లో మార్కులు సాధించడం కొద్దిగా కష్టమే! కానీ ఇందుకు పూర్తి భిన్నంగా జేన్, స్విమ్ సూట్ రౌండ్‌లో మెటాలిక్ గ్రీన్ స్విమ్‌సూట్, స్ట్రాప్ హీల్స్‌తో జడ్జిల దృష్టిని ఆకర్షించింది. బ్యూటీ వాక్‌తో మార్కులను కొట్టేసి, టాప్ 20లో స్థానాన్ని దక్కించుకుంది. అధిక బరువుతో ఆత్మన్యూనతకు లోనయ్యే మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ... "కర్వీగా ఉండి అందచందాల ప్రమాణాలను అందుకోలేని మహిళలకు నేను ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఒకే రకమైన బ్యూటీ స్టాండర్డ్స్ అంటూ ఉండవు. ప్రతి మహిళా అందగత్తే! మిస్ యూనివర్స్ నేపాల్‌గా ఈ వేదికను ఉపయోగించుకుంటూ నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రతి మహిళా తనను తాను అంగీకరించుకోవాలి. వాళ్ల శరీరాలను బట్టి ఆత్మవిశ్వాసంగా వ్యవహరించాలి. ఇలా నడుచుకోగలిగితే విజయాలన్నీ తల వంచుతాయి" అంటూ మిస్ నేపాల్‌గా గెలుపొందిన సందర్భంలో మాట్లాడింది జేన్.

స్ఫూర్తి



పండుగ ముగిసినా.. తగ్గని పందేల జోరు



ఆకివీడులో కోడి పందేల బరి వద్ద కార్ల పార్కింగ్

- నాలుగో రోజూ చేతులు మారిన రూ.లక్షలు
- కూడబెట్టిన సొమ్ములూ పోగొట్టుకున్న పేదలు

భీమవరం, ఏలూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం కూడా కోడి పందేలు జోరుగా సాగాయి. రూ.కోట్లు చేతులు మారాయి. పండుగ 3 రోజులూ చూసీచూడనట్టుగా వదిలేసే అధికారులు.. నాలుగో రోజు కూడా మౌనం దాల్చారు. బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో యథేచ్ఛగా పందాలు సాగాయి. ఉండి నియోజకవర్గంలోని 4 మండలాల్లోనూ పందేలు నిర్వహించారు. సీసలి, పెదమీరం బరుల్లో ఒక్కో పందెం రూ.25 లక్ష ల నుంచి రూ.50 లక్షల వరకు వెళ్లింది. బయట పందేలు కూ డా లక్షల్లోనే సాగాయి. యలమంచిలిలో మహిళలు సైతం గుండాటలో పాల్గొన్నారు. నాలుగో రోజు చిన్న బరులను కట్టడి చేసిన పోలీసులు.. పెద్ద బరులను వదిలేశారు. పండుగ రోజు ల్లో నిర్వహించిన జూద క్రీడలకు కష్టజీవులు లక్షలాది రూపాయలు సమర్పించుకున్నారు. భార్య నగలు తాకట్టు పెట్టి ఒకరు, కుమార్తె వివాహానికి దాచిన సొమ్ముతో ఇంకొకరు, ప్లాట్ ఫాం బండి నడుపుతూ సంపాదించిన నగదుతో మరొకరు.. ఇలా ఒకరా ఇద్దరా! ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వందలాది మంది పేదలు ఈ జూదాల్లో ఆస్తులు పోగొట్టుకున్నారు.

- దెందులూరుకు చెందిన ఓ రైతు తన సోదరుడితో కలిసి నివసిస్తున్నారు. ఆది నుంచి పేకాట పిచ్చితో ఎన్నో ఆస్తులు పోగొట్టుకున్న అతడు, ఈ సంక్రాంతి పండుగలో సైతం రూ.60 లక్షలకు పైగా పందేల పాలు చేశాడు. దీంతో వారి ఉమ్మడి కుటుంబం విడిపోయే పరిస్థితి వచ్చింది.
- బుట్టాయిగూడెంకు చెందిన ఓ యువకుడు సంక్రాంతి పండుగను సాకుగా పెట్టుకుని ఇంట్లో దాచిన రూ.1.40 లక్షలను నాశనం చేశాడు. పందెంలో ఒడ్డి ఓడిపోయాడు.
- కుమార్తె వివాహం కోసమని ఇటీవల అర ఎకరం పొలం అమ్మగా వచ్చిన రూ.లక్షా యాభై వేలను ఆ దంపతులు బ్యాంకులో దాచుకున్నారు. కుమార్తె వివాహానికి ముహూర్తాలు చూసుకునే క్రమంలో ఆ తండ్రి పందేల పిచ్చితో దాచిన ఆ సొమ్మును కోడి పందేల్లో పెట్టి పోగొట్టాడు. ఇప్పుడు కుమార్తె పెళ్లి ఎలా చేయాలో తెలీక దెందులూరు మండలానికి చెందిన ఆ దంపతులు విలపిస్తున్నారు.
- జంగారెడ్డిగూడెం సమీప గ్రామానికి చెందిన ఓ యువకుడు ఒక కోళ్ల ఫారంలో పనిచేస్తున్నాడు. తన భార్య మెడలో నగలు అమ్మి రూ.40 వేలు, యజమాని వద్ద మరో రూ.20 వేలు అప్పు చేసి మరీ లోనా-బయట జూదం ఆడాడు. చివరకు రూ.10 వేలకు పైగా విలువైన సెల్‌ఫోన్‌ను కూడా తాకట్టు పెట్టేశాడు.



కాళ్ళలో కోళ్ల పందేలు

ప్రాజెక్టుల అప్పగింతకు నెల రోజులే గడువు!

- అన్నింటినీ కృష్ణా బోర్డు పరిధిలోకి తేవాలి: కేంద్రం ఆదేశం

అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ నడుమ నదీ జలాల వివాదంపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించని తెలంగాణపై కన్నెర్రజేసింది. నెలరోజుల్లో కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులన్నింటి ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి అప్పగించాల్సిందేనని ఆదేశించింది. వారం రోజుల్లోగా బోర్డు చైర్మన్, రెండు రాష్ట్రాల ఇంజనీర్స్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) సమావేశమై.. ప్రాజెక్టులు, అవుట్‌లెట్ల సమాచారాన్ని క్రోడీకరించి.. 15 రోజుల్లోగా పంపాలని ఆదేశించింది. అప్పగింతపై విధివిధానాలను త్రి సభ్య కమిటీ తయారు చేయాలంది. 15 రోజుల్లో పరిస్థితిని సమీక్షిస్తామని వెల్లడించింది. ప్రాజెక్టుల అప్పగింత ప్రక్రియ మాత్రం నెల రోజుల్లో పూర్తికావాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరికొద్ది గంటల్లో మొదలుకానుండగా.. నవంబరు 29 అర్ధరాత్రి సమయంలో ఆంధ్ర పోలీసులు నాగార్జున సాగర్‌డ్యాంపైకి దండెత్తి కుడివైపు గేట్లను తమ అధీనంలోకి తీసుకోవడం.. బలగాలను మోహరించి గేట్లు తెరచి కుడికాలువకు నీరు విడుదల చేయడం.. దీనిపై కేంద్ర హోం, జలశక్తి కార్యదర్శులు అజయ్‌కుమార్ భల్లా, దేబర్షి ముఖర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడం.. తక్షణం బలగాలను ఉపసంహరించుకోవాలని సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డిని వీడియో కాన్ఫరెన్స్‌లో వేర్వేరుగా ఆదేశించడం తెలిసిందే. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం ఓడిపోవడం.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం చకచకా జరిగిపోయాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక నీటి వాటాలు, విడుదలపై ఆ రాష్ట్రం నుంచి ఎలాంటి కదలికా లేదు. ఈ నెల 5న జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రాష్ట్రానికి కేటాయించిన 45 టీఎంసీలకు లోబడి తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవచ్చని కేఆర్ఎంబీ తేల్చిచెప్పింది. అక్కడ ఎలాంటి లడాయీ జరగలేదు. కానీ గత ఏడాది నవంబరు 29న ఏపీ చేసిన యాగీని మాత్రం కేంద్రం విస్మరించలేదు. దీనిపై బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం, జలశక్తి కార్యదర్శులు భల్లా, ముఖర్జీ నేతృత్వంలో సమావేశం జరిగింది. సమావేశంలో తాజా పరిస్థితిని సమీక్షించిన కేంద్ర కార్యదర్శులు.. నెలరోజుల్లో కేఆర్ఎంబీకి కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను అవుట్‌లెట్లతోపాటు అప్పగించాలని అల్టిమేటం ఇచ్చారు. కాగా.. ప్రస్తుతం డ్యాంపై కేంద్ర బలగాలు మోహరించి ఉన్నాయి. అక్కడ నవంబరు 28 ముందునాటి పరిస్థితిని కొనసాగించాలని తెలంగాణ అధికారులు మరోసారి కోరారు. కాగా, దాదాపు పదేళ్లుగా సాధ్యంగాని ప్రాజెక్టుల అప్పగింతను.. ఇప్పు డు నెల రోజుల్లో చేసేయడం సాధ్యమేనా అనే సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం అథారిటీ భేటీ 29కి వాయిదా

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఈనెల 22వ తేదీన నిర్వహించతలపెట్టిన సమావేశం ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది. హైదరాబాద్‌లోని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కు చెందిన కృష్ణా-గోదావరి భవన్‌లో ఈ భేటీ జరుగనుంది. భూసేకరణతోపాటు ప్రాజెక్టు నిర్మాణం, పీపీఏ కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలింపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ఒక సెక్షన్.. అనేక ప్రశ్నలు!

(మొదటి పేజీ తరువాయి)

17ఏ సెక్షన్ కింద అనుమతి తీసుకోనంత మాత్రాన కేసు కొట్టేయలేమని తెలిపారు.

ఏది 'దర్యాప్తు'?

'దర్యాప్తు' అనే పదానికి నిర్వచనంలోనూ ఇరువురు న్యాయమూర్తులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఈ పదానికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో కానీ, అవినీతి నిరోధక చట్టంలో కానీ నిర్వచనం లేదని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. "భారత ప్రభుత్వ ప్రామాణిక ఆచరణీయ విధానం(ఎస్ఓపీ) ప్రకారం దర్యాప్తు అంటే ఒక నేరానికి సంబంధించిన సమాచారాన్ని తనిఖీ చేయడం. దర్యాప్తు ప్రారంభం తేదీ నేరానికి సంబంధించింది కానీ, దర్యాప్తు ఏజెన్సీ ఎప్పుడు విచారణ ప్రారంభించిందన్న దాంతో కానీ, ఎప్పుడు ఫిర్యాదు వచ్చిందన్న దాంతోకానీ దానికి సంబంధం లేదు" అని ఆమె పేర్కొన్నారు. సీఆర్పీసీలో 'దర్యాప్తు' అనే పదానికి నిర్వచనం లేదని జస్టిస్ అనిరుద్ధ బోస్ కూడా అంగీకరించారు. సీఆర్పీసీ 1973 కోడ్‌లో సెక్షన్ 2(జీ) ప్రకారం మేజిస్ట్రేట్ కోర్టు లేదా న్యాయస్థానం నిర్వహించేదే దర్యాప్తు అని తెలిపారు. అదే సమయంలో.. 'దర్యాప్తు' అన్న పదానికి ఆక్స్‌ఫర్డ్ లా డిక్షనరీలో సరైన నిర్వచ నం ఉందన్నారు. దీని ప్రకారం దర్యాప్తు అంటే.. 'సమాచారం కోసం అన్వేషణ' అని తెలిపారు. స్కిల్ కేసులో సమాచారం కోసం సోదాలు 2021లోనే ప్రారంభమయ్యాయని, అప్పటికి సెక్షన్17ఏ అమల్లోకివచ్చిందన్నారు.

'రిమాండ్' ఆర్డర్ పైనా...

రిమాండ్ ఆర్డర్ విషయంలో ఇద్దరు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని జస్టిస్ అనిరుద్ధ బోస్ చెప్పారు. "ఇప్పటికే చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారు. ఐపీసీ నేరాల క్రింద ప్రత్యేక జడ్జి జారీ చేసిన రిమాండ్ ఆర్డర్ చెల్లుతుందా లేదా అన్న దాని జోలికి నేను వెళ్లడంలేదు" అని తెలిపారు. అయితే.. 17ఏ కింద అనుమతి లేనప్పటికీ ప్రత్యేక జడ్జికి రిమాండ్ ఆర్డర్ జారీ చేసే న్యాయ పరిధి ఉంటుందని ఆయన అన్నారు. ఐపీసీ సెక్షన్ల కింద చేసిన ఆరోపణలను ప్రత్యేక న్యాయమూర్తి కోర్టులో చంద్రబాబు సవాలు చేసుకోవచ్చని తెలిపారు. ఇదే అంశంపై జస్టిస్ బేలా త్రివేదీ స్పందిస్తూ.. "రిమాండ్ ఆర్డర్ జారీ చేసే అధికారాలు ప్రత్యేక కోర్టుకు ఉన్నాయి. అందులో ఎలాంటి న్యాయపరమైన లోపం లేదు" అని తెలిపారు. ఆయా అంశాలపై తమ మధ్య భిన్నాభిప్రాయాలున్నాయని ఇరువురు న్యాయమూర్తులూ అంగీకరించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అన్వయం, నిర్వచనంపై వేర్వేరు అభిప్రాయాలు వచ్చినందున కేసును సీజేఐకి నివేదిస్తున్నట్లు ఒకే ఆర్డర్ జారీ చేశారు.

జస్టిస్ బోస్ ఇలా...



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దర్యాప్తు ఎప్పుడు ప్రారంభమైనదన్న విషయానికి జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రాధాన్యమివ్వగా.. జస్టిస్ బేలా త్రివేదీ దానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. 2021కు ముందు స్కిల్ కేసులో అసలు దర్యాప్తు ప్రారంభం కానే కాలేదని జస్టిస్ బోస్ స్పష్టం చేశారు. "2018 జూన్ 5న దర్యాప్తు జరిపించమని విజయవాడలోని ఏసీబీ ఒక అభ్యర్థన చేసింది. ఆ తర్వాత మూడేళ్ల వరకూ ఎలాంటి దర్యాప్తు ప్రారంభమైన సంకేతాలు లేవు. 2021 ఫిబ్రవరి, మార్చి, జూన్, ఆగస్టులో పలు లేఖలు రాసినప్పటికీ దర్యాప్తు జరిగినట్టు ఆధారాలు చూపలేదు. అందువల్ల 2018 జూన్ 5 లేఖతో దర్యాప్తు జరిగినట్లు భావించలేం. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏను నిరాకరించేందుకు ఈ లేఖను సాకుగా చూపలేం. 2018 మే 14న జీఎస్టీ అధికారులు రాసిన లేఖను కూడా దర్యాప్తుగా భావించలేం. 2021 సెప్టెంబరు 9న దాఖలైన ఎఫ్ఐఆర్‌లో కూడా 2018 జూన్ 5వ తేదీ నాటి లేఖ గురించి ప్రస్తావన లేదు" అని జస్టిస్ బోస్ తన తీర్పులో వివరించారు. ఇంకా.. విచారణ దశలోనే సెక్షన్ 17ఏ పోలీసు అధికారిపై ఆంక్షలు విధిస్తుందని, సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా ఆ అధికారి ముందుకు కదలడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు తన అధికార విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నారా, సిఫారసులు చేశారా అన్న విషయంలో సంబంధిత పోలీసు అధికారి ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన దాఖలాలు లభించలేదని ఆయన అన్నారు. "17ఏ అమలులోకి వచ్చిన 2018 జూలై 26కు ముందు జరిగిన నేరాలకూ, ఆ తర్వాత జరిగిన నేరాలకూ మధ్య ఈ సెక్షన్ తేడా చూడలేదు. పోలీసు అధికారి ప్రారంభించిన ఏ విచారణ, దర్యాప్తు, పరిశోధనకైనా అది వర్తిస్తుంది. స్కిల్ కేసులో 2021 డిసెంబరు 9న ఎఫ్ఐఆర్ నమోదైంది. 2023 సెప్టెంబరులో చంద్రబాబు పేరు చేర్చారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ అమలులోకి రాకమునుపు ఈ అంశంపై ఎలాంటి దర్యాప్తు కానీ, విచారణ కానీ, పరిశోధన కానీ జరిగిన దాఖలాలు లేవు. ప్రత్యేక జడ్జి ముందుకు కేసు తీసుకువచ్చిన సమయం కూడా ముఖ్యం" అని జస్టిస్ అనిరుద్ధ బోస్ స్పష్టం చేశారు. "చంద్రబాబు తన అధికార విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నందున... ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే సంబంధిత అథారిటీ అనుమతి అవసరం. అది లేకుంటే ఆయనపై తీసుకున్న చర్యలు చెల్లవు. కావాలంటే సంబంధిత అథారిటీ అనుమతి తీసుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది" అని జస్టిస్ బోస్ తెలిపారు.

జస్టిస్ త్రివేదీ అలా...



అవినీతి నిరోధక చట్టం ప్రధాన లక్ష్యం పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని నిరోధించడమే అని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. నిజాయితీపరులైన 'పబ్లిక్ సర్వెంట్స్' తాము అధికారంలో ఉన్నకాలంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి దర్యాప్తు పేరుతో వేధించకుండా ఉండేందుకే సెక్షన్ 17ఏ ప్రవేశపెట్టారని ఆమె కూడా అభిప్రాయపడ్డారు. సెక్షన్ 17ఏ కొత్తగా వచ్చిందని, దాన్ని ప్రవేశపెట్టిన నాటి నుంచే అది అమలులోకి వస్తుందికాని మొత్తంగా పాత నేరాలకు కూడా వర్తింపజేయరాదన్నది తన అభిప్రాయమని తీర్పులో చెప్పారు. సెక్షన్ 17ఏ 2018 చట్టం తర్వాత జరిగిన నేరాలకే వర్తిస్తుందని, అంతకు ముందు జరిగిన నేరాలకు కాదని ఆమె చెప్పారు. ముందస్తు అనుమతి లేనంత మాత్రాన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయలేమని ఆమె అన్నారు.

వివరణలోనూ కప్పదాటు!

- అక్రమ పదోన్నతులపై దేవదాయ శాఖ సమర్థన
- ఫైళ్లు మాయం కాలేదంటున్న ఉన్నతాధికారులు
- అక్రమం కానప్పుడు విచారణ కమిటీ ఎందుకు?
- ఈ అంశాలు ప్రస్తావించని దేవదాయ శాఖ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వలేదని, అంతా నిబంధనల ప్రకారమే చేశామని ఉన్నతాధికారులు వెల్లడించారు. 'మరో ఫైల్ మాయం' శీర్షికతో ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై శాఖ కమిషనర్ వివరణ ఇచ్చారు. అందులో కూడా పూర్తి అవాస్తవాలు పొందుపరిచారు. ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, కేడర్ స్ట్రెంత్‌కు మించి పదోన్నతులు కల్పిస్తున్నారని 2016 నుంచి అనేకమంది ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. నిబంధనల ప్రకారం ఉమ్మడి ఏపీలో 31 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. విభజన సమయంలో ఈ సంఖ్యను 51గా కమలనాథన్ కమిటీకి చూపించారు. దేవదాయ శాఖ అధికారులు కేడర్ స్ట్రెంత్ తప్పుగా చూపించడంతో ఏపీకి 31 పోస్టులు కేటాయించారు. వాస్తవంగా రాష్ట్రానికి 17 పోస్టులు మాత్రమే రావాలి. దీన్ని సరి చేసుకోవాల్సిన ఉన్నతాధికారులు ఆ తర్వాత తప్పుల మీద తప్పులు చేశారు. కేడర్ స్ట్రెంత్‌లో లేకపోయినా 31మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. దీనిపై 2016లో ప్రధాన కార్యాలయంలో 21మంది ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు. విచారణ కమిటీని నియమించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో ఉంది. మరోవైపు అక్రమ పదోన్నతులపై చాలామంది ఉద్యోగులు వ్యక్తిగతంగా ఇచ్చిన ఫిర్యాదుల ఫైల్ ఆకస్మికంగా మాయమైంది. ఈ విషయం బయటపడకుండా ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు దాచిపెట్టారు. పైగా వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేసినవారికి ఫోన్లు చేసి, అక్రమ పదోన్నతులపై మీరేమైనా ఫిర్యాదులు చేశారా అని ప్రశ్నించారు. అసలు సంగతి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారో, లేదో ఆ విభాగం అధికారులే చెప్పాలి. ఇవేమీ బయటకు రానివ్వకుండా 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు గతంలో కొంతమంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఇచ్చిన ఆర్డర్లలో కేడర్ స్ట్రెంత్‌లో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే రివర్షన్ ఇస్తామని పేర్కొన్నారు. పదోన్నతులు సక్రమంగా కల్పిస్తే ఈ విధంగా పేర్కొనాల్సిన అవసరం ఏమిటని ఉద్యోగులే ప్రశ్నిస్తున్నారు. అక్రమ పదోన్నతులు కాబట్టే అధికారులు అడ్డదారులు వెతుక్కుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి. దీనిపై దేవదాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

23, 24న నేషనల్ ఐపీ యాత్ర వర్క్‌షాప్

కృష్ణలంక: ఏపీ చాంబర్స్ సహకారంతో కేఎల్ వర్సిటీ ఈనెల 23, 24న నగరంలో నేషనల్ ఐపీ యాత్ర ఈవెంట్‌పై 2రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)పై అంటేపేటెంట్స్, ఇండస్ట్రియల్ డిజైన్స్, కాపీరైట్స్, ట్రేడ్‌మార్క్స్, ట్రేడ్ సీక్రెట్స్, జీఐ రిజిస్ట్రేషన్ వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఐపీ యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇందులో పాల్గొన్న వారికి సర్టిఫికేషన్ అందజేస్తారు. ఆసక్తి వున్నవారు ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి.

రేషన్ గడువు ఒక రోజు పెంపు: జేసీ

కృష్ణలంక: ప్రతినెల 17వరకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులను వినియోగదారులు సౌకర్యార్థం మరోరోజు అదనంగా గడువు పెంచినట్టు జేసీ డాక్ట ర్ పి.సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తె లిపారు. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు కార్డుదారులకు రేషన్ సరుకులు అందించాలని తెలిపారు.

కబ్జాదారుల కోసమే భూ 'భక్ష' చట్టం

- న్యాయవాదులకు ఎమ్మెల్యే రక్షణనిధి, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ సంఘీభావం

విజయవాడ లీగల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూహక్కు చట్టం-2022, పేదల ఆస్తులను కబ్జాదారులు 'భక్షించడం' కోసమేనని సీనియర్ న్యాయవా ది, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ అన్నారు. భూ హక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా బెజవాడ బార్ న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారం నాటికి 29వ రోజుకు చేరాయి. బుధవారం న్యాయవాదులు నిరసన దీక్ష వద్దకు గుంటూరు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ విచ్చేసి న్యాయవాదులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం మా ట్లాడుతూ నల్లచట్టమైన భూ 'భక్ష' చట్టం నిజస్వరూపం ఏమిటో సామాన్య ప్రజలకు తెలియట్లేదన్నా రు. అనంతరం తిరువూరు ఎమ్మెల్యే (వైసీపీ) రక్షణనిధి న్యాయవాదుల దీక్షా శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదులు పేదూరి సా యిబాబు, గంగిశెట్టి అయ్యప్ప, చిలువేరు మార్కండేయ, కె.మోహన్, యారం సువర్ణ పాల్గొన్నారు.

కంగారులో బ్యాగు మరచిన మహిళ

- తిరిగి అప్పగించిన పోలీసులు

వన్‌టౌన్: చెన్నై అన్ననగర్‌కు చెందిన ఉషాబాల చందర్ వన్‌టౌన్ పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి ఆమె పోగొట్టుకున్న బంగారు నగల బ్యాగ్‌ను తిరిగి అప్పగించిన వైనం బుధవారం జరిగింది. ఉషాబాలచందర్ 12 మందితో కలిసి దుర్గమ్మను దర్శించి బస చేసిన కన్యకాపరమేశ్వరి సత్రం నుంచి ఆటోలో రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. వన్‌టౌన్ తారాపేట ఎంట్రన్స్‌లోని 10వ ప్లాట్‌ఫారం వైపు ఆటోలో పెట్టిన సమానులు దించుకున్నారు. రైలు వస్తుందన్న కంగారులో బంగారు ఆభరణాల బ్యాగును మరచిపోయారు. తీరా ప్లాట్‌ఫారంపైకి వెళ్లగా బ్యాగ్ కనిపించలేదు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సీఐ రావి సురేష్‌రెడ్డి, ఉమెన్ ఎస్ఐ ప్రశాంతి, సీసీ కెమెరాల సహాయంతో బ్యాగ్‌ను గుర్తించి ఆమెకు అందించారు. అందులో రూ.10లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి.



పుట్టగుంట ఫాంహౌస్‌లో న్యాయమూర్తి ముమ్మినేని సుధీర్‌కుమార్‌కు సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్

పండుగలతో సత్సంబంధాలు

- మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి సుధీర్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, జనవరి 17: కుటుంబాల మధ్య సత్సంబంధాలు మరింత బలపడటానికి పండుగలు దోహదపడతాయని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ముమ్మినేని సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బైపాస్ రోడ్డులోని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఫాంహౌస్‌లో న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపారు. ఫాంహౌస్‌లోని శ్రీకృష్ణ మందిరాన్ని దర్శనం చేసుకున్నారు. గార్డెన్, స్విమ్మింగ్‌పూల్, అరుదైన పండ్ల మొక్కలను పరిశీలించారు. కపిల గోవులకు పూజలు చేశారు. అనంతరం విలేకరులతో ముచ్చటిస్తూ నానాటికీ మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్న నేపథ్యంలో సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో ఆత్మీయ అనురాగాలను పంచుకోవడం చూస్తుంటే ముచ్చటేస్తోందన్నారు. విలాసవంతంగా సుందరంగా ఫాంహౌస్‌ను తీర్చిదిద్దిన పుట్టగుంట సతీష్‌కుమార్ అభిరుచి, ఆసక్తిని కొనియాడారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ఫాంహౌస్ ఏర్పాటు అభినందనీయమన్నారు. న్యాయమూర్తిని పుట్టగుంట సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



మాజీ ఉపరాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తున్న వడ్డే రామకృష్ణ ప్రసాద్

మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా చాళుక్యాస్ రెస్టారెంట్ ప్రారంభం

భారతీనగర్, జనవరి 17: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నగర పర్యటనలో భాగంగా గురునానక్ కాలనీలోని చాళుక్యాస్ రెస్టారెంట్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన రెస్టారెంట్ అధిపతి వడ్డే రామకృష్ణ ప్రసాద్, ఆయన స్నేహితులతో సహపంక్తి భోజనం చేశారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వడ్డే రామకృష్ణ ప్రసాద్ తనకి మంచి స్నేహితుడని, భోజన హోటల్ పెట్టడంతో తాను పిలిస్తే వచ్చానని తృప్తిగా భోజనం చేశానన్నారు. మిత్రుడికి అభినందనలు తెలిపారు. మంచి భోజనమే మంచి ఆరోగ్యమని, భోజనంలో సుచి, శుభ్రత పాటించాలన్నారు. హోటల్ అభివృద్ధికి సిబ్బంది, యాజమాన్యం కష్టపడి సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం చాళుక్యాస్ రెస్టారెంట్ అధిపతి వడ్డే రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు, తాను 1972-75 నుంచి కలిసి చదువుకున్నామన్నారు. తన మిత్రుడితో తన హోటల్‌ని ప్రారంభించడం, కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రివిక్రమ్, మహేష్‌బాబు క్షమాపణలు చెప్పాలి

ధర్నాచౌక్, జనవరి 17: మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమాలో విలన్స్ పాత్రలకు మార్క్స్, లెనిన్ పెట్టడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అసభ్యకరంగా ఉన్న మడత కుర్చీ బూతు పాటను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక హనుమాన్‌పేటలోని కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్ విగ్రహం వద్ద ఈ చిత్రం దర్శకుడు తివిక్రమ్ శ్రీనివాస్ చిత్రపటాలను దగ్ధం చేశారు. వి.జాన్సన్, లంకా గోవిందరాజులు, శిరం రవికుమార్, గుంజ కాంత్రి కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్లోకి హ్యుండయ్ క్రెటా

గుణదల, జనవరి 17: వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపదిద్దుకున్న హ్యుండయ్ క్రెటా కారు నగరవాసులకు అందుబాటులోకి రావడం గర్వించదగిన విషయమని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వి.ఎస్.శర్మ అన్నారు. స్థానిక లబ్బీపేటలోని కుశలవ హ్యుండయ్ షోరూమ్‌లో హ్యుండయ్ క్రెటా కారు ఆవిష్కరణ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.ఎస్.శర్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా డిజైన్ చేయడం వల్ల క్రెటా కారుకు మార్కెట్లో డిమాండ్ ఉందన్నారు. 360 మెగాపిక్సల్ కెమెరాతో 70కి పైగా కనెక్టివిటీ ఫీచర్లతో రూపుదిద్దుకుందన్నారు. కుశలవ హ్యుండయ్ షోరూమ్ సర్వీస్ డైరెక్టర్ బి.వెంకట రెడ్డి, ఎండీ చుక్కపల్లి సిద్ధార్థ, ఏరియా సేల్స్ మేనేజర్ ముగ్గల నందకిషోర్, ఫైనాన్షియర్లు పాల్గొన్నారు.



కుశలవ హ్యుండయ్ షోరూమ్‌లో హ్యుండయ్ క్రెటా కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వి.ఎస్.శర్మ

కంచికచర్ల సీఐ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

విద్యాధరపురం, జనవరి 17: కంచికచర్ల సీఐ నాగేంద్రకుమార్ తనకు 24 గంటల్లోగా క్షమాపణలు చెప్పాలని, లేదంటే డీజీపీకి ఫిర్యాదు చేస్తానని రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా అన్నారు. మొగల్రాజపురంలోని కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మైనార్టీ మహిళనైన తనను సీఐ నోటికేది వస్తే అది మాట్లాడాడని, వేలు పెట్టి చూపించాడని ఆరోపించారు. సీఐని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ నేత షేక్ అన్సర్, మహమ్మద్ జాహీద్, సయ్యద్ గౌస్య, షేక్ గౌసియా పాల్గొన్నారు.

అంబేడ్కర్ భావజాలంతో సంక్షేమ ఫలాలు

- మంత్రి ఆదిమూలపు సురేష్

వన్‌టౌన్, జనవరి 17: బాబాసాహెబ్ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికి పుచ్చుకుని అన్ని వర్గాలకు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తోందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. నగరంలో శుక్రవారం జరగనున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, తదితర కార్యక్రమాలను పురస్కరించుకుని తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా పాలొన్నారు. అనంతరం మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థ ద్వారా డాక్టర్ అంబేడ్కర్ అందించిన హక్కుల గురించి వివరించారు. ఎమ్మెల్యే విష్ణు, సామాజిక న్యాయం సలహాదారు జూపూడి ప్రభాకరరావు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక అధికారి వై శ్రీలక్ష్మి, పంచాయతీ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జి.జయలక్ష్మి, చేనేత జౌళి శాఖ కార్యదర్శి కే సునీత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, పౌరసరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండియన్, కలెక్టర్ దిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు.

లెనిన్ శత వర్ధంతి సభలు జయప్రదం చేయండి

గవర్నర్‌పేట: శ్రామికవర్గ విప్లవ నేత వీఐ లెని న్ శత వర్ధంతి సభలు ఈనెల 21 నుంచి రాష్ట్ర వ్యా ప్తంగా నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 21న ప్రారంభమై ఏడాది పొడవునా, రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి సభలు జరపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని, కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రగతిశీలవాదులు పాల్గొని లెనిన్‌కు నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు.



అంగన్వాడీ సమ్మెకు మద్దతుగా బీసెంట్ రోడ్డులో సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ జిల్లా నేతలు

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

అంగన్వాడీలకు మద్దతుగా సీఐటీయూ సంతకాల సేకరణ

గవర్నర్‌పేట, జనవరి 17: పెరిగిన ధరలకనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు డీవీ కృష్ణ అన్నారు. అంగన్వాడీలకు జీతాలు పెంచాలని 34 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ బుధవారం బీసెంట్ రోడ్డులో జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాసు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ సుప్రజ, సీఐటీయూ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, నేతలు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, సీహెచ్ మురళీ, బి.వెంకటేశ్వరరావు, బాలబొమ్మ లక్షణ పాల్గొన్నారు.



స్కిల్, సెమీ స్కిల్డ్ జీతాల కమిటీ మెంబర్ కన్వీనర్ శివపార్వతికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియూ నేతలు

పని ఆధారంగా జీతాలు చెల్లించాలి

- స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కమిటీకి వినతిపత్రం

గవర్నర్‌పేట, జనవరి 17: మున్సిపల్ ఇంజనీరింగ్‌లోని అన్ని వి భాగాల కార్మికులకు జీవో 11 ప్రకారం జీతాలు చెల్లించేలా స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతన కమిటీ సిఫార్సు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఅండ్‌డీఎంఏ కార్యాలయంలో స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల కమిటీ మెంబర్ కన్వీనర్ కె.శివపార్వతికి 7 సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, కార్యదర్శి బి.ముత్యాలరావు, టి.చిన్నా, పి.శ్రీనివాసరావు, చైతన్య పాల్గొన్నారు.

ఆంధ్రలో ఒకసారి, కేంద్రంలో మరోసారి బీజేపీ

- రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

వన్‌టౌన్, జనవరి 17: ఆంధ్రలో ఒక్కసారి, కేంద్రంలో మరోసారి మోదీ-బీజేపీ ప్రభుత్వం అనే నినాదం గ్రామ గ్రామాన మారుమోగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీశ్రేణులకు పి లుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఆమె క్యాంప్ నివాసంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ గ్రామాన, అన్ని పట్టణాలు, నగరాల్లో వాల్‌పోస్టర్లను విస్తృతంగా అంటించాలని సూచించారు. అవినీతి సొమ్ముతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు జగన్మోహనరెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టాలన్నారు. ఏపీని దౌర్భాగ్యస్థితికి తెచ్చిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కోలపల్లి గణేష్, బోగవల్లి శ్రీధర్, నూతలపాటి బాల కోటేశ్వరరావు, పోతంశెట్టి నాగేశ్వరరావు, నామిశెట్టి వెంకట్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు అదానీ అడ్డు!

- బకాయిలు చెల్లిస్తేనే బొగ్గు సరఫరా చేస్తామని స్పష్టీకరణ
- కోర్టు అటాచ్‌మెంట్‌తో పేచీ.. ఉత్పత్తిపై ప్రభావం.. కేంద్రం మౌనం

విశాఖపట్నం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని అదానీకి చెందిన గంగవరం పోర్టు వేధింపులకు గురిచేస్తోంది. ఉక్కు తయారీకి అవసరమైన బొగ్గును విదేశాల నుంచి నౌకల ద్వారా పోర్టుకు రప్పించుకున్నప్పటికీ ప్లాంటుకు పంపకుండా అడ్డంకులు సృష్టిస్తోంది. బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లిస్తేనే బొగ్గు పంపుతామని పేచీ పెడుతోంది. అక్కడితో ఆగకుండా వరుస సెలవులు చూసుకొని కోర్టుకు వెళ్లి అటాచ్‌మెంట్ ఆర్డర్లు తెచ్చింది. దీంతో ఉక్కు అధికారులు అదానీ పోర్టు యాజమాన్యం చెప్పినట్టు చేయాల్సి వస్తోంది. ఈ వివాదాలన్నీ ఉక్కు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. ఉక్కు యాజమాన్యం మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి జిందాల్ సాయం తీసుకున్న సంగతి తెలిసిందే. మూడు బ్లాస్ట్ ఫర్నేసులు పూర్తిస్థాయిలో పనిచేస్తే రోజుకు 20 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి కావాలి. కానీ, ఇప్పుడు రోజుకు 12వేల నుంచి 14వేల టన్నులు మాత్రమే వస్తోంది. ముడి పదార్థాల కొరతతో పూర్తి ఉత్పత్తి జరగడం లేదు. జిందాల్ కంపెనీ రూ.225 కోట్ల వరకు రుణ సాయం చేసినట్టు సమాచారం. మరోవైపు, అదానీ పోర్టు యాజమాన్యం మాత్రం.. తమకు రూ.100 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, ఆ మొత్తం వెంటనే చెల్లించాలని పేర్కొంటూ కోర్టు అటాచ్‌మెంట్ తెచ్చింది. డబ్బులు ఇస్తే తప్ప బొగ్గు ఇవ్వబోమని మొండికేస్తోంది. జపాన్ నుంచి లైమ్‌స్టోన్ కూడా ఆలస్యంగా వస్తున్నట్టు సమాచారం. ఢిల్లీలోని ఉక్కు మంత్రిత్వ శాఖ పెద్దలు ప్లాంటు అంతర్గత విషయాలపై పెద్దగా దృష్టిసారించడం లేదు. అదానీ పోర్టు యాజమాన్యానికి పైనుంచి ఓ మాట చెబితే అన్నీ సజావుగా సాగిపోతాయని, కానీ ఆ మాట సాయం కూడా కేంద్రంలోని పెద్దలు చేయడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ సమస్య నుంచి బయటపడడానికి యాజమాన్యం అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

ఎంపీగానే పోటీచేస్తా: రఘురామరాజు

భీమవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగానే తాను పోటీ చేస్తానని ఎంపీ రఘురామకృష్ణరాజు తెలిపారు. తెలుగుదేశం-జనసేన కూటమిలో ఏపార్టీ తరపున పోటీ చేస్తాననే విషయంపై 10 రోజుల్లో స్పష్టత ఇస్తానని వివరించారు. సంక్రాంతికి భీమవరం విచ్చేసిన ఎంపీ బుధవారం భీమవరం, తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి జగన్మోహన్‌రెడ్డి వచ్చినా విజయం తమదే అవుతుందని స్పష్టం చేశారు.

ఏపీలో ఫ్యాక్షనిస్టు పాలన: టీఎమ్మెల్యే కూనంనేని

పొన్నూరుటౌన్, జనవరి 17: ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన చూస్తుంటే ఫ్యాక్షనిస్టు, ఫాసిస్ట్ తరహాలో సాగుతుందని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆయన స్వగ్రామమైన గుంటూరు జిల్లా పొన్నూరులో బుధవారం బంధుమిత్రులను కలుసుకొని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'మోదీ, జగన్మోహన్‌రెడ్డి న్యాయ వ్యవస్థను ప్రభావితం చేసేందుకు పయత్నిస్తున్నారు. అందుకే 17ఏ పై భిన్న తీర్పులు వచ్చాయి. రాష్ట్రంలో చంద్రబాబు భయపడుతూ రాజకీయాలు చేయడం మానుకోవాలి. జగన్ పాలనను వ్యతిరేకించడంలో పవన్ కల్యాణ్ స్థిరమైన నిర్ణయంలో ఉన్నప్పటికీ రాజకీయ విధానంలో స్థిరమైన ఆలోచన లేదన్నారు. జగనన్న వదిలిన బాణం, షర్మిల ఎందుకు బయటకు వెళ్లిందో చెప్పాలి' అని కూనమనేని డిమాండ్ చేశారు.

వంద మంది గోబెల్స్ కలిస్తే ఒక జగన్

- సుప్రీంకోర్టు తీర్పులకూ వక్రభాష్యం: బొండా ఉమ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): 'ఉన్నది లేనట్లు ప్రచారం చేయడంలో గోబెల్స్‌కు ప్రపంచంలో అగ్రస్థానం ఉంది. కాని సీఎం జగన్ గోబెల్స్‌ను తలదన్నుతున్నారు. వంద మంది గోబెల్స్ కలిస్తే ఒక జగన్ అన్నట్లుగా తయారయ్యారు. సుప్రీంకోర్టు తీర్పులను కూడా వక్రీకరించి తన అనుచర గణంతో ప్రచారం చేయిస్తున్నారు' అని టీడీపీ నేత బొండా ఉమా మహేశ్వరరావు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నవాటిని కూడా వక్రీకరించి వైసీపీ నేతలు, వారి బంట్రోతులు మాట్లాడుతున్నారు. అసిస్టెంట్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కుల, పార్టీ, జగన్ పిచ్చితో మాట్లాడుతున్నారు. తాను న్యాయ అధికారిని అని మర్చిపోయి పొన్నవోలు వైసీపీ నాయకుడి మాదిరిగా నోటికి వచ్చిన అబద్ధాలు మాట్లాడుతున్నారు. తన పోస్టు ఏమిటో మర్చిపోయి తానే సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం పదుల సంఖ్యలో న్యాయవాదులను కోర్టులో మొహరించి రూ.వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసింది. స్కామ్ జరిగిందని అంటున్నదాని కంటే పది రెట్లు కోర్టు ఖర్చులకు వ్యయం చేసింది' అని ఉమా విమర్శించారు.

కోర్టు తీర్పునకు రాజకీయ వక్రభాష్యమా..!: కనకమేడల

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), విజయవాడ లీగల్, జనవరి 17: 'సుప్రీంకోర్టులో జరిగిందేమిటి? జగన్ మీడియా రాసిందేమిటో ఆ పార్టీ నాయకులు స్పష్టంగా తెలుసుకోవాలి. కోర్టు తీర్పుల విషయంలో వక్ర భాష్యాలు చెప్పడానికి వీలు లేదు. రాతపూర్వకమైన ఆధారాలతో ఉన్న తీర్పును వక్రీకరించి చెప్పడం తగదు' అని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మంగళవారం సుప్రీంకోర్టు 82 పేజీల తీర్పు ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం సెక్షన్ 17-ఏ వర్తిస్తుందా? లేదా? అనేదే ఆ తీర్పులోని ప్రధాన అంశం. దీనిపైనే ఇద్దరు జడ్జిలూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇది కేసు మెరిట్స్ మీద ఇచ్చిన తీర్పు కాదు. 'చంద్రబాబుకు శిక్ష తప్పదు.. అవినీతికి పాల్పడిన బాబు..' అని ఏపీ ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జగన్ పత్రికలో ప్రకటన చేయడం సరికాదు. రాజ్యాంగ పదవిలో ఉంటూ రాజకీయపరమైన ప్రకటనలు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడటం దుర్మార్గం. పొన్నవోలు చెప్పిన విషయాలు ఏవీ కోర్టు తీర్పులో లేవు. జగన్ మీడియా రాతలు కోర్టు ధిక్కారం కిందకు వస్తాయి. జగన్ జర్నలిజాన్ని భ్రష్టు పట్టించారు. జగన్ పత్రికలో రాసిన ఏ ఒక్క విషయమైనా సుప్రీంకోర్టు తీర్పులో ఉందేమో పొన్నవోలు చూపించాలి. లేదంటే తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవాలి" అని కనకమేడల సవాల్ చేశారు.

కోర్టు తీర్పులను వక్రీకరిస్తున్న ఏఏజీ పొన్నవోలు: గూడపాటి

స్కిల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఏఏజీ పొన్నవోలు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని రాష్ట్ర టీడీపీ లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి గూడపాటి లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. "సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌లోని పేజీ నం.15, పేరా నం.13లో స్పష్టంగా 2018 జూన్ 5 నుంచి దర్యాప్తు జరుగుతున్నట్టు సీఐడీ చెప్పిన విషయాన్ని ఆమోదించలేమని, ఈ విషయంలో హైకోర్టు తీసుకొన్న నిర్ణయాన్ని తాను ఆమోదించడం లేదని గౌరవ న్యాయమూర్తి జస్టిస్ అనిరుధ్ బోస్ తన తీర్పులో పేర్కొన్నారు. సెక్షన్ 17ఏ ప్రకారం నేరం, దర్యాప్తు ప్రారంభమైన తేదీ నుంచి మాత్రమే అమల్లోకి వస్తుందని, నేరం జరిగిన తేదీ నుంచి కాదని జస్టిస్ అనిరుధ్ బోస్ స్పష్టంగా పేర్కొన్నారు. ఏఏజీ సుధాకరరెడ్డి తాను ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్నానన్న విచక్షణ మరిచి, వైసీపీ కార్యకర్తగా వ్యవహరించడం న్యాయవ్యవస్థకే సిగ్గుచేటు. పరిధి దాటి వ్యవహరిస్తూ సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను వక్రీకరిస్తూ మాట్లాడుతున్న ఏఏజీ త్వరలో కోర్టు ధిక్కార చర్యలకు సిద్ధంగా ఉండాలి" అని లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

స్కిల్ కేసులో కక్ష సాధింపుల్లేవు

- చంద్రబాబు అరెస్టు సక్రమమే: ఏఏజీ పొన్నవోలు

నెల్లూరు, జనవరి 17: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జగన్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడలేదని.. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు సక్రమమేనని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కేసులో ప్రభుత్వం న్యాయబద్ధంగా ఏ విధంగా ముందుకు అడుగులు వేసిందో ప్రజలకు తెలియజేసేందుకే ఇక్కడకు వచ్చానని చెప్పారు. ఈ వ్యవహారంలో రూ.371 కోట్లు ప్రజాధనం వృథా అయిందని తెలిపారు. ప్రభుత్వం చట్టపరంగానే విచారణ చేసిందని.. ప్రజాధనం కాపాడాలనే సంకల్పంతోనే ముందుకు సాగిందన్నారు. దర్యాప్తు ప్రక్రియలో నిబంధనల ప్రకారమే అన్ని చర్యలూ చేపడుతున్నామని తెలిపారు.

పనులు పూర్తికాకుండా ప్రారంభోత్సవమా?

(మొదటి పేజీ తరువాయి)

విగ్రహం వెనుక తలపెట్టిన కన్వెన్షన్ సెంటర్ ఇంకా పూర్తి కానేలేదు. జీ ప్లస్ 1 స్ట్రక్చర్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. 2వేల మందికి సరిపడా సీటింగ్ సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్‌ను 6,340 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. సెంటర్ అందుబాటులోకి రావడానికి కూడా 3నెలలు పైనే పడుతుందని అంటున్నారు. అయినా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారమే (19నే) దానికి ప్రారంభోత్సవం చేయనున్నారు. వాస్తవానికి స్మృతివనంలో ముందు భాగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. అది కూడా పశ్చిమం వైపు రైతుబజార్ పనుల్లో పురోగతి లేదు. అంబేడ్కర్ విగ్రహానికి వెనుక భాగం చేపట్టాల్సిన పనుల్లోనూ పెద్దగా పురోగతి లేదు. వెనుక భాగంలో ఉన్న వాటిలో ప్రధానంగా కన్వెన్షన్ సెంటర్ ఉంది. పార్కింగ్ ఏరియా కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. లాన్ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. గురువారానికి లాన్ పనులను పూర్తి చేసినా.. కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావడం సాధ్యం కాదు. శుక్రవారం ప్రారంభోత్సవ సందర్భంగా ఎవరూ దీనిని గమనించకుండా ఉండేందుకు గ్రీన్ మ్యాట్‌లను పరచి కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. బుధవారం నాటికి గ్రీన్‌మ్యాట్స్‌ను 60 శాతం ఏర్పాటు చేశారు. ముందు భాగంలోనూ కొలనేడ్ పనులు ఇంకా మిగిలే ఉన్నాయి. విగ్రహానికి రెండు వైపులా గోడలా ఈ కొలనేడ్‌ను నిర్మించారు. అంబేడ్కర్ జీవన గమనానికి సంబంధించి మ్యూరల్ ఆర్ట్ వర్క్ పనులను ఇందులోని గోడల మీద చేపట్టారు. ప్రారంభోత్సవ సమయం సమీపించినా ఇంకొన్ని ఆర్ట్ వర్క్ పనులు పూర్తి కాలేదు.



విజయవాడలో శుక్రవారం ప్రారంభించనున్న భారీ అంబేడ్కర్ విగ్రహం వెనుక భాగం ఇది. ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పనులు పూర్తి కాని ప్రాంతాలను గ్రీన్ మ్యాట్‌తో కప్పి... ముందు భాగాన్ని మాత్రం సుందరంగా లైటింగ్‌తో అలంకరించి ప్రారంభోత్సవం చేస్తున్నారు.

పూర్తికావలసిన ఫౌంటెయిన్లు..

స్మృతివనం ఆవరణలో ఏడు ఫౌంటెయిన్లను చేపట్టారు. ఇందులో ప్రధానంగా విగ్రహానికి ముందు మ్యూజికల్ ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి నాలుగు వైపులా చతురస్రాకారంలో నాలుగు ఫౌంటెయిన్లను ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి కొన్ని పనులు ఇంకా మిగిలి ఉన్నాయి. అంబేడ్కర్ విగ్రహాన్ని నిలబెట్టిన పెడెస్ట్రియల్ చుట్టూ తూర్పు, పశ్చిమ, ఉత్తర దిక్కున ఏర్పాటు చేసిన భారీ ఫౌంటెయిన్ పనులు కూడా పూర్తి కాలేదు. పాత్‌వేలలో ఇంకా టైల్స్ పూర్తి కాలేదు. రాత్రింబవళ్లు పనులు చేస్తుండడం వల్ల శుక్రవారానికి పూర్తిచేసే అవకాశం ఉంది.

లిఫ్టుల సమస్యలు..

అంబేడ్కర్ స్మృతి వనంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం పాదాల చెంతకు చేరుకోవడానికి ఏర్పాటు చేసిన లిఫ్టులు అప్పుడే మొరాయిస్తున్నాయి. మంగళవారం అధికారులు పరిశీలనకు వెళ్లినపుడు ఓ లిఫ్టు మధ్యలో ఆగిపోవటం ఆందోళనకు గురి చేసింది. బుధవారం కూడా పలు మార్లు లిఫ్టులను మరమ్మతు చేయాల్సి వచ్చింది.

పార్కింగ్ సమస్యలు.. అరకొర సదుపాయాలు

విజయవాడ నడిబొడ్డున.. పర్యాటక ఆకర్షణగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతి వనం ప్రాజెక్టులో పార్కింగ్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. కేవలం 95 కార్లు, 84 ద్విచక్ర వాహనాలు పెట్టేందుకు మాత్రమే అవకాశం కల్పించారు పశ్చిమ, ఉత్తర దిక్కుల్లో ఈ పార్కింగ్ కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ సదుపాయం కల్పించలేదు. పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో ఎగ్జిబిషన్స్ పెట్టినా, బుక్ ఫెస్టివల్స్ నిర్వహించినా సర్కస్‌లు, పెట్టినా వేలాదిగా వస్తుంటారు. స్మృతివనాన్ని కూడా భారీగా సందర్శిస్తారు. తెలంగాణలో దాదాపు 500 కార్ల పార్కింగ్‌కు అవకాశం ఉంది.

ఇంతకూ నిర్మాణ వ్యయమెంత?

స్మృతి వనం ప్రాజెక్టు ఖర్చుపైనా అనేక అనుమానాలు నెలకొన్నాయి. విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పనులను తెలంగాణలో అంబేడ్కర్ ఐకానిక్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కేపీసీ సంస్థే దక్కించుకుంది. మొదట్లో దీని అంచనా వ్యయం రూ.180 కోట్లుగా చెప్పారు.. అయితే రూ.400 కోట్లు ఖర్చయిందని జగన్‌కు చెందిన రోతపత్రికలో పేర్కొన్నారు. ఇంత భారీగా ఎందుకు ఖర్చయిందని అడిగితే అధికారులు నోరు మెదపడం లేదు. హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహ ప్రాజెక్టును ముందుగా రూ.100.23 కోట్ల అంచనాతో చేపట్టారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు రూ.150 కోట్లకు చేరింది. అయితే స్మృతవనంలో కన్వెన్షన్ సెంటర్, మ్యూజియం, లైబ్రరీ, మినీ థియేటర్, కొలనేడ్, ఫుడ్ కోర్టులు, పెడెస్ట్రియల్, ఆర్ట్ వర్క్, రాజస్థాన్ పింక్ స్టోన్ వంటి వాటితో పాటు ల్యాండ్ స్కేపింగ్ తదితరాలకు ఇంత ఖర్చవుతోందని అధికారులు అంటున్నారు. ఇవన్నీ చేపడుతున్నమాట వాస్తవమే అయినప్పటికీ రూ.400 కోట్ల వ్యయం అనుమానంగానే ఉంది.

అంబేడ్కర్‌పై జగన్‌కు గౌరవం లేదు

- శాఖమూరు స్మృతివనాన్ని బెజవాడ తరలించారు: వర్ల

తుళ్లూరు జనవరి 17: రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే సీఎం జగన్‌రెడ్డికి ఏ మాత్రం గౌరవం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. రాజధాని అమరావతిలోని శాఖమూరులో గత టీడీపీ ప్రభుత్వం 20 ఎకరాల్లో తలపెట్టిన అంబేడ్కర్ స్మృతి వనం పనులను ఆయన వచ్చాక ఆపేశారని మండిపడ్డారు. బుధవారం ఆయన, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, దళిత జేఏసీ నేత పులి చిన్నా తదితరులు ఈ స్మృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. రాజధానిలో కాదని విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని ఆక్షేపించారు. అక్కడున్న ఒక వర్గం మీద కక్ష తీర్చుకోవడానికి విజయవాడ స్వరాజ్ మైదానాన్ని ఎంపిక చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆ మైదానం ఉపయుక్తంగా ఉండేదని, వారిని ఇబ్బంది పెట్టేందుకే ఇక్కడ విగ్రహం ఏర్పాటుచేశారని దుయ్యబట్టారు. శాఖమూరు స్మృతి వనంలో ఐరన్‌ను కాజేశారని.. అంబేడ్కర్ నమూనా విగ్రహాలను సైతం మాయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్మృతివనం రాజధానిలోనే ఉండాలని డిమాండ్ చేశారు.



శాఖమూరు అంబేడ్కర్ స్మృతి వనం వద్ద టీడీపీ నేతలు

అలిపిరి పాదాల మండపాన్ని పరిశీలించిన ఆర్కియాలజీ అధికారులు

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అలిపిరిలో వున్న పాదాలమండపాన్ని, తిరుమలలోని పుష్కరిణి వద్దనున్న అస్థాన మండపాన్ని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా విభాగ అధికారులు బుధవారం పరిశీలించారు. తిరుమలలో శిథిలావస్థలో ఉన్న పార్వేట మండపాన్ని టీటీడీ గతేడాది తొలగించి ఆ స్థానంలో నూతన మండపాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నిర్మాణంపై పలు రాజకీయపార్టీల నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వచ్చాయి. అలిపిరిలో భక్తుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పాదాలమండపాన్ని రూ.1.36 కోట్లతో పునర్నిర్మించాలని తీసుకున్న నిర్ణయంపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే పాదాలమండపంతో పాటు అస్థాన మండపాన్ని పరిశీలించి తగిన సూచనలు అందించాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి గతేడాది నవంబరు 30వ తేదీన ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో మండపాల నిర్మాణంపై సాంకేతిక సహాయాన్ని అందించేందుకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు చెందిన అధికారులతో ఏర్పాటైన కమిటీ బుధవారం తిరుపతికి చేరుకుని పరిశీలించింది. గురువారం మరోసారి మండపాలను పరిశీలించి నివేదికను రూపొందించనున్నారు.

24న ఏప్రిల్ నెల రూ.300 దర్శన టికెట్ల కోటా విడుదల

- నేటి నుంచి అందుబాటులోకి ఆర్జితసేవల కోటా లక్కీడిప్

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన ఏప్రిల్ నెల కోటాను టీటీడీ ఈ నెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. అలాగే ఏప్రిల్ నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జితసేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు భక్తులు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో ఎంపికైన భక్తులు జనవరి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు టికెట్ ధర చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకరణ సేవా టికెట్లను జనవరి 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను కూడా అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవారి వార్షిక వసంతోత్సవాలు ఏప్రిల్ 21 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. ఏప్రిల్ నెలకు సంబంధించిన అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను జనవరి 23వ తేదీ ఉదయం 10 గంటలకు, శ్రీవాణి టికెట్లను ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. అలాగే తిరుమల, తిరుపతిలో వసతి గదుల కోటాను కూడా జనవరి 24న మధ్యాహ్నం 3 గంటలకు భక్తులకు అందుబాటులో ఉంచుతారు. మరోవైపు తిరుమల, తిరుపతికి చెందిన శ్రీవారి సేవ కోటాను 27 ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు నవనీతసేవ, మధ్యాహ్నం ఒంటిగంటకు పరకామణి సేవలను విడుదల చేయనున్నారు. భక్తులు వీటిని 'టీటీడేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

పొగమంచుతో విమాన సర్వీసులు రద్దు

విశాఖపట్నం, జనవరి 17: పొగమంచు ప్రభావంతో పలు ప్రాంతాల నుంచి విశాఖ వచ్చి వెళ్లాల్సిన మూడు విమాన సర్వీసులు బుధవారం రద్దయ్యాయి. బెంగళూరు-విశాఖ-బెంగళూరు, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, ఢిల్లీ-విశాఖ-ఢిల్లీ సర్వీసులు రద్దయినట్టు విమానాశ్రయ అధికారులు చెప్పారు.

బస్సుల కోసం.. బడులకు మోసం!

21 వరకు సంక్రాంతి సెలవులు పొడిగింపు

- టీచర్లు, తల్లిదండ్రులు కోరినట్లు వివరణ
- ఎవరూ కోరలేదంటున్న ఉపాధ్యాయులు
- రేపు బెజవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
- ఈ కార్యక్రమానికి జనాన్ని తరలించేందుకు పాఠశాల బస్సులను వినియోగించే ప్లాన్
- ఎన్నికలకు ముందు వైసీపీ బల ప్రదర్శన

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): "సంక్రాంతి సెలవులు పొడిగించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరారు. అందుకే ఈ నెల 21వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు పొడిగిస్తున్నాం"- ఇదీ తాజాగా ప్రభుత్వం చేసిన ప్రకటన. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కానీ, దీనిని కొంత లోతుగా పరిశీలిస్తే.. ఇప్పటికే ఈ నెల 9 నుంచి విద్యార్థులు సంక్రాంతి సెలవుల్లోనే ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19 నుంచి పాఠశాలలు ప్రారంభించాల్సి ఉంది. పైగా పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా స్కూళ్లు ఎప్పుడెప్పుడు తెరుస్తారా? అని ఎదురు చూస్తున్నారు. కానీ, సర్కారు మాత్రం పైవిధంగా సెలవిచ్చింది. మరి దీని వెనుక ఏముందంటే.. విజయవాడలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం. ఎన్నికలకు ముందు ఈ నెల 19న(శుక్రవారం) నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం బలప్రదర్శనకు వేదికగా మార్చుకోవాలని భావిస్తోంది. పలు జిల్లాల నుంచి ప్రజలను రప్పించే ప్రయత్నం చేస్తోంది. దీనికి స్కూల్ బస్సులు కూడా కావాల్సి ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారంటూ.. బడులకు సెలవులు ప్రకటించేసింది. వాస్తవానికి ఏటా బడులకు పది రోజులపాటు సంక్రాంతి సెలవులు ఇస్తారు. ఈ ఏడాది కూడా 9 నుంచి 18 వరకు సెలవులు ప్రకటించారు. సెలవులు ముగుస్తున్నందున బడులకు వెళ్లాలని టీచర్లు, విద్యార్థులు సన్నద్ధమవుతున్న సమయంలో అనూహ్యంగా ప్రభుత్వం సెలవులు పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. వాస్తవానికి ఉపాధ్యాయ సంఘాలేవీ సెలవులు పొడిగించాలని కోరలేదు. ఇక తల్లిదండ్రులు అడిగినట్టుగా కూడా సమాచారం లేదు. అడిగిన సెలవులు ఇవ్వని ప్రభుత్వం అడగకుండానే పొడిగించడం చూసి టీచర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తొలుత దీనిపై పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేయగానే అది 'ఫేక్' అని ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగింది. చివరికి ఉత్తర్వులు వెలువడ్డాయి. అసలు ఎవరూ అడగకుండానే ఎందుకు పొడిగించారనే చర్చ జరిగింది. ఎన్నికల్లో లబ్ధి కోసం సెలవులు ఇస్తున్నారని కొందరు, ట్యాబ్‌లు ఇవ్వకపోవడం వల్లే సెలవులిచ్చారని కొందరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 19న ఒక్కరోజే సెలవు ఇస్తే విగ్రహావిష్కరణే అసలు కారణమనే అర్థమవుతుందని, అందుకే మరొక రోజు పెంచారని టీచర్లు అంటున్నారు. పైగా ఇప్పుడిచ్చిన రెండు రోజులు సెలవులకు బదులుగా తర్వాత జనరల్ హాలిడేస్‌లో బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాల నుంచి సైతం ప్రజలను తరలించేందుకు స్కూల్ బస్సులను వినియోగించే వ్యూహం పన్నినట్టు తెలుస్తోంది.

విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి

- ఇవికాక ఫ్రీగా ఏదిచ్చినా మంచిది కాదు: వెంకయ్య



నరసరావుపేట టౌన్, జనవరి 17: 'విద్య, వైద్యం ఈ రెండూ పేదలకు ఉచితం చేయండి. మిగతావి ఏమీ ఫ్రీగా ఇవ్వకూడదు. ప్రభుత్వానికి సంపాదన ఉంటే దానిని విద్య, వైద్యం, రహదారులు, రవాణాపై ఖర్చు పెట్టాలి. తాత్కాలిక ప్రయోజనమిచ్చే ఉచితాలు దేశానికి మంచిది కాదు. ప్రపంచంలో భారతదేశం మూడవ ఆర్థిక శక్తిగా తయారుకాబోతుంది. అమెరికా, చైనా ఈ దేశాలతో పోటీపడే స్థాయికి భారతదేశం వస్తుంది' అని వెంకయ్య అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. డిజిటల్ అంతిమ లక్ష్యం ప్రజలను సంతోషంగా, సుఖవంతం చేయడానికేనని, వ్యవసాయం అనేది మన ప్రాథమిక సంస్కృతి అని ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రకృతిని మనం ప్రేమిస్తే ప్రకృతి మనలను ప్రేమిస్తుంది. పిల్లలకు నాయకత్వ లక్షణాలు నేర్పించాలి. వాళ్లను నిరుత్సాహపర్చవద్దు' అని అన్నారు.

చనిపోయినా ప్రభుత్వం కనికరించదా?

- చిట్టింపాడు ఘటనపై చంద్రబాబు ఆవేదన

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా చిట్టింపాడు ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. 'గంగులు కుటుంబానికి జరిగిన దారుణం విని చలించిపోయాను. తీవ్ర అనారోగ్యం పాలైన బాలింతను, ఆర్నెల్ల చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు 5 కిలోమీటర్లు డోలీపై మోసుకురావాల్సి రావడం దురదృష్టకరం. ఇలాంటి దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో గతంలో ఫీడర్ అంబులెన్స్‌లు తెచ్చాం. ఇప్పుడు వాటిని పక్కన పడేసి, గిరిజనుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తల్లీ, బిడ్డా చనిపోవటానికి కారణం ప్రభుత్వ అలసత్వం కాదా? కనీసం మనిషి చనిపోయాక కూడా ప్రభుత్వం కనికరించకపోతే ఎలా? మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయలేరా? ఏమై పోయాయి అంబులెన్స్‌లు? పుట్టెడు దుఃఖంలో భార్య మృత దేహాన్ని బైక్ మీద తీసుకెళ్లాల్సి రావడం ఎంత దయనీయం? ఎంత బాధాకరం? గిరిజనులకు ఎందుకీ దుస్థితి? ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, ఘటనపై విచారణ జరిపించాలి. ఆ కుటుంబాన్ని ఆదుకొని, చిట్టింపాడుకు రోడ్డు నిర్మాణాన్ని సత్వరం చేపట్టాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

ఇది జగన్ వైఫల్యం: మాణిక్కం ఠాగూర్

విజయనగరం జిల్లా ఎస్.కోట గిరిశిఖర గ్రామం చిట్టింపాడుకు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై మోసుకెళ్లిన ఘటనపై ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'హృదయం బద్దలయ్యే విషాద ఘటన నన్ను తీవ్ర విచారానికి గురిచేసింది. గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు లేకపోవడాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. దీనిపై అత్యవసరంగా దృష్టిపెట్టాలి. వైద్య సేవలను అందుబాటులో ఉంచడంలో, రవాణా సౌకర్యాలను కల్పించడంలో జగన్ విఫలమయ్యారు' అని ఠాగూర్ విమర్శించారు.

మొహం చెల్లకే దావోస్‌కు వెళ్లని జగన్

- దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై లేదు
- సైకో పోయి సైకిల్ రావాలన్నది ప్రజల ఆకాంక్ష: టీడీపీ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తన నిర్ణయాలతో జాతీయంగా, అంతర్జాతీయంగా పరువు తీసుకొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మొహం చెల్లకే దావోస్ వెళ్లలేదని తెలుగుదేశం పార్టీ ఎద్దేవా చేసింది. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సిద్ధ రామయ్య దావోస్ సదస్సుకు వెళ్లి తమ రాష్ట్రాలకు పెట్టుబడులు తెచ్చుకోవడానికి శ్రమిస్తుంటే జగన్‌రెడ్డి ఆ శక్తి లేక ఇంట్లో కూర్చుండిపోయారని ఆ పార్టీ విమర్శించింది. రాష్ట్రం పరువు తీసి జగన్‌రెడ్డి చరిత్ర హీనుడిలా మిగిలిపోయారని, ఆయన ఐదేళ్ల పాలనలో రాష్ట్రం దారుణంగా నష్టపోయిందని ఆ పార్టీ ఆరోపించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం బుధవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డికి ఈ రాష్ట్రంలో వనరులను దోచుకొని సొంత ఖజానాను నింపుకోవడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తేవడంపై లేదు. పెట్టుబడుల ఆకర్షణలో దావోస్ సదస్సు ఒక కీలక కేంద్రం. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు అనేకసార్లు అక్కడకు వెళ్లి తెలుగు రాష్ట్రాలకు ఎంతగానో ప్రాచుర్యం కల్పించారు. ఆయన కృషివల్ల టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రం రూ.65 వేల కోట్ల విదేశీ పెట్టుబడులను సంపాదించగలిగింది. ఆ సమయంలో మొత్తం దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 15శాతం మన రాష్ట్రానికే వచ్చాయి. జగన్ సీఎం అయిన తర్వాత ఈ రాష్ట్రానికి గతంతో పోలిస్తే కేవలం 10 శాతం పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఈ నాలుగున్నరేళ్లలో వచ్చిన విదేశీ పెట్టుబడులు రూ.ఆరున్నర వేల కోట్లు మాత్రమే. మొత్తం దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో ఇది ఒక శాతానికంటే తక్కువ. ఇంత ఘోరంగా రాష్ట్రం పరిస్థితి ఏనాడూ లేదు. విద్యుత్ పీపీఏలను అడ్డగోలుగా రద్దు చేయడంతో జగన్ వల్ల దావోస్ సదస్సులో విదేశీ కంపెనీల ముందు తల దించుకోవాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వాపోయారు. జగన్ వైఫల్యం రాష్ట్రంలో నిరుద్యోగులకు శాపంగా మారింది. అందుకే ప్రజలు సైకో పోయి సైకిల్ రావాలని కోరుకొంటున్నారు' అని పట్టాభి వ్యాఖ్యానించారు.

గర్భిణికి అరుదైన బాంబే రక్తం దానం

» తెలంగాణ నుంచి ముందుకొచ్చిన యువకుడు

నరసాపురం, జనవరి 17: దేశంలో వందల సంఖ్యలో అత్యంత అరుదుగా మాత్రమే దొరికే బాంబే గ్రూప్ రక్తాన్ని అందించిన తెలంగాణ యువకుడు ఓ తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు మండలానికి చెందిన ఐ.సుమకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు నరసాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. డెలివరీ చేయాలంటే ఆమెకు రక్తం ఎక్కించాలని వైద్యులు చెప్పారు. పరీక్షల్లో ఆమెది అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్ అని తేలింది. దీంతో దాతల కోసం ఆన్‌లైన్‌లో విన్నవించారు. ఎవరూ స్పందించకపోవడంతో నరసాపురం రెడ్‌క్రాస్‌ను సంప్రదించారు. అక్కడి సిబ్బంది అరుదైన ఈ బ్లడ్ గ్రూప్ గురించి స్థానిక ఎమ్మెల్యే, చీఫ్ విప్ ముదునూరికి వివరించి ప్రభుత్వం ద్వారా దాతల వివరాలు సేకరించాలని కోరారు. స్పందించిన ముదునూరి ఇదే బ్లడ్ గ్రూప్ కలిగిన తెలంగాణ వ్యక్తిని సంప్రదించారు. ఆయన రక్తం ఇచ్చేందుకు అంగీకరించి కారులో నరసాపురం వచ్చి రక్తదానం చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

భారత బలగం భేష్..!

» ప్రపంచ శక్తిమంతమైన సైన్యాల్లో నాలుగో స్థానం

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన సాయుధ దళం కలిగిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. సైనిక శక్తిని వెల్లడించే 'గ్లోబల్ ఫైర్‌పవర్' సంస్థ ప్రపంచ దేశాల మిలటరీకి సంబంధించిన తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ జాబితాలో అగ్రరాజ్యం అమెరికా టాప్‌లో కొనసాగుతుండగా.. రష్యా, చైనా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారత్ నాలుగో స్థానంలోనూ, దక్షిణ కొరియా ఐదో స్థానంలోనూ ఉన్నాయి. ఆయా దేశాల రక్షణ సమాచారాన్ని ట్రాక్ చేసే గ్లోబల్ ఫైర్‌పవర్.. ప్రపంచవ్యాప్తంగా 145 దేశాల సైనిక బలం ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ ఇచ్చింది. అమెరికా వద్ద 13.28 లక్షల సైన్యం, 13,209 విమానాలు, 11 విమాన వాహక నౌకలు, 4,657 యుద్ధ ట్యాంకులు ఉన్నాయి. భారత సైన్యంలో 14,55,550 మంది క్రియాశీల సిబ్బంది ఉండగా.. పారామిలటరీలో 25,27,000 మంది ఉన్నారు. మొత్తం 2,296 విమానాలు భారత్ వద్ద ఉండగా వాటిలో 606 యుద్ధ విమానాలు, 869 హెలికాప్టర్లు ఉన్నాయి. నావికా దళానికి రెండు విమానవాహక యుద్ధ నౌకలు, 12 క్షిపణి విధ్వంసక నౌకలు, 18 జలాంతర్గాములు ఉన్నాయి.

ఆయుష్మాన్ భారత్ కవరేజీ రెట్టింపు?

న్యూఢిల్లీ, జనవరి 17: ఆయుష్మాన్ భారత్ కార్డుపై కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా 10 లక్షల రూపాయల వ్యయం వరకు వైద్యం పొందే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ కార్డుపై కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నారు. కేన్సర్ చికిత్స, అవయవ మార్పిడి తదితరాలకు మరింత వ్యయం అవుతున్న దృష్ట్యా 2024-25 సంవత్సరం నుంచి ఈ కార్డుపై ఆరోగ్య బీమా కవరేజీని రెట్టింపు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌లో దీనిపై ప్రకటన వెలువడే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. వచ్చే మూడేళ్లలో కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులు, భవన నిర్మాణ కార్మికులు, బొగ్గు యేతర మైనింగ్ కార్మికులు, ఆశా వర్కర్లను కూడా ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రణాళికలు రూపొందిస్తోందని, తద్వారా ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల సంఖ్య 100 కోట్లకు చేరుతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ఎరువులపై సబ్సిడీని తగ్గించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 17: ఎరువులపై రైతులకు కేంద్రప్రభుత్వం అందించే సబ్సిడీ ఈ ఏడాది భారీగా తగ్గనుంది. సబ్సిడీని గత ఏడాది కంటే 30 నుంచి 34 శాతం మేర తగ్గిస్తున్నట్లు కేంద్ర రసాయన, ఎరువులశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. పోయిన సంవత్సరం రూ.2.56 లక్షల కోట్ల సబ్సిడీ ఇవ్వగా, ఈ ఏడాది రూ.1.7 నుంచి 1.8 లక్షల కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గడం, భారతదేశంలో ప్రస్తుతం ఎరువుల కొరత లేకపోవడంతో సబ్సిడీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఎర్రసముద్రంలో విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ ఎరువుల దిగుమతుల్లో ఏ మాత్రం తగ్గుదల లేదని, ఈ ఏడాది 40 నుంచి 50 లక్షల టన్నుల మేర దిగుమతులుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు.

అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి రేసులో వివేక్..?

న్యూహ్యాంప్‌షైర్, జనవరి 17: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వపు రేసు నుంచి వైదొలిగిన వివేక్ రామస్వామి బుధవారం ట్రంప్‌తో కలిసి న్యూహ్యాంప్‌షైర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతుండగా అక్కడి జనం వీపీ-వీపీ (వైస్ ప్రెసిడెంట్) అని నినాదాలు చేశారు. ట్రంప్, వివేక్ వారిని చూసి చిరునవ్వులు చిందించారు. తాను గెలిస్తే వివేక్ ఉపాధ్యక్ష సహచరుడిగా ఉంటారని ట్రంప్ సూచనప్రాయంగా వెల్లడించారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, వివేక్ చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని, ఆయన చాలా కాలంపాటు రిపబ్లికన్ పార్టీతో కలిసి ముందుకు సాగాతారని ప్రకటించారు.

16న దేశవ్యాప్త సమ్మె!: ట్రేడ్ యూనియన్లు

న్యూఢిల్లీ, జనవరి 17: వచ్చేనెల 16న దేశవ్యాప్త సమ్మెకు, గ్రామీణ బంద్‌కు ట్రేడ్ యూనియన్లు, రైతులు సంఘాల సంయుక్త ఫోరం పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, జాతీయ వ్యతిరేక విధానాలకు నిరసగా ఈ సమ్మె నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16న తాము నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతివ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా, సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్, ఫెడరేషన్స్/అసోసియేషన్స్ కోరుతున్నాయి. అలాగే సమ్మె, గ్రామీణ బంద్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ స్థాయిలలో భారీ సమీకరణాలకు పిలుపునిచ్చాయి. కార్మికులకు నెలకు రూ.26,000 కనీస కూలీ, ఉపాధి హామీ, కనీస మద్దతు ధర, లేబర్ కోడ్‌ల రద్దు, ఐపీసీ/సీఆర్‌పీసీ చట్టాలకు చేసిన సవరణల రద్దు.. వంటి డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నాయి.

ధనిక రైతులకు పన్ను.. కేంద్రం యోచన

న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్రప్రభుత్వం దేశంలోని ధనిక రైతులకు పన్ను విధించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పేద రైతులను ఆదుకునేందుకు వారి ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేస్తున్న ప్రభుత్వం, సంపన్న రైతుల నుంచి పన్నులు వసూలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రకటన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ దీనిని ప్రకటించే అవకాశముంది. సంపన్న రైతుల నుంచి పన్నులు వసూలు చేసి, పన్నుల పద్ధతిలో పారదర్శకత తీసుకువచ్చేందుకు కేంద్రం అడుగులు వేస్తోందని రిజర్వ్ బ్యాంకు మానిటరీ పాలసీ కమిటీ మెంబర్ ఆషిమా గోయల్ పేర్కొన్నారు.

నేడు హైదరాబాద్‌కు జగన్

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హైదరాబాద్ వెళ్తున్నారు. గురువారం సాయంత్రం 6.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళతారు. గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో సోదరి వైఎస్ షర్మిల కుమారుడి వివాహ నిశ్చితార్థ వేడుకలో పాల్గొంటారు. నూతన దంపతులను ఆశీర్వదించి హైదరాబాద్ నుంచి తాడేపల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

షటిల్ ఆడుతూ కుప్పకూలిన కొత్త అల్లుడు

» రెండు కుటుంబాల్లో విషాదం



సీతానగరం, జనవరి 17: సంక్రాంతి పండక్కి అత్తవారింటికి వచ్చిన కొత్త అల్లుడు షటిల్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన చిట్టూరి రమేష్(32)కు అదే మండలంలోని బొబ్బిల్లంక గ్రామానికి చెందిన శ్రావణితో 8 నెలల కిందట వివాహం జరిగింది. సంక్రాతి సందర్భంగా అత్తారింటికి వెళ్లాడు. రెండు రోజులు సంతోషంగా గడిపాడు. మంగళవారం బంధువులతో షటిల్ ఆడుతూ విపరీతమైన రొప్పుతో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. అక్కడ ఉన్న స్థానికులు సపర్యలు చేయగా వాంతి చేసుకుని అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. దీంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పండుగ రోజున రెండు కుటుంబాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

అయోధ్యలో మోదీ..

వేరే ఆలయాల్లో విపక్షాలు

22న దేశ ప్రధాన రాజకీయ నేతలంతా భగవన్నామ స్మరణలోనే

» అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠకు 10వేల మందికి పైగా ఆహ్వానం

» తిరస్కరించిన ఖర్గే, లాలూ, పవార్

» బీజేపీ ఎన్నికల స్టంట్ అని ఆరోపణలు

» అదే రోజున సొంత కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే యోచన

న్యూఢిల్లీ/అయోధ్య, జనవరి 17: అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నెల 22న అత్యంత వైభవోపేతంగా జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ఆధునిక వసతులతో పునరుద్ధరించిన రైల్వేస్టేషన్‌ను ఇప్పటికే ప్రారంభించారు. దేశ ప్రజల శతాబ్దాల నాటి దివ్య స్వప్నాన్ని తాము నెరవేర్చామని అధికార బీజేపీ నేతలు చెబుతుండగా, ఇదంతా మోదీ సర్కారు చేస్తున్న ఎన్నికల స్టంట్ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలంటూ 10వేల మందికి పైగా ప్రముఖులు, మఠాధిపతులు, మతపెద్దలకు ఆహ్వానాలు పంపారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, లాలూప్రసాద్ సహా సీనియర్ ప్రతిపక్ష నేతలందరూ ఆహ్వానాలు అందుకున్నారు. అయితే వీరెవరూ 22న అయోధ్యకు రావడం లేదు. మతపరమైన కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని ఇండియా కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని 'నరేంద్ర మోదీ ఫంక్షన్'గా రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ఇంకా నిర్మాణమే పూర్తికాని ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరిపి, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలని చూస్తోందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, లాలూప్రసాద్, ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. వీరు కూడా ఆహ్వానాలను తిరస్కరించారు. అయితే, ఆయా పార్టీల నేతలు 22న తమ సొంత కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు.

కాళీ ఘాట్ సందర్శనకు మమత

కోల్‌కతాలో అన్ని మతాల ప్రజలతో కలసి 22న 'సామరస్య ర్యాలీ' నిర్వహిస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు. 22న కాళీ ఘాట్‌లో కాళీమాత ఆలయాన్ని సందర్శించిన తర్వాత అన్ని మతాల ప్రజలతో కలసి తాను కూడా ర్యాలీలో పాల్గొంటానని తెలిపారు. టీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీ.. మసీదులు, చర్చిలు, గురుద్వారాలు సహా వివిధ మతాల ప్రార్థనాలయాలను స్పృశించి పార్క్ సర్కస్ మైదాన్ వద్ద ముగుస్తుందని మమత పేర్కొన్నారు.



అయోధ్యలోని గర్భగుడిలో ప్రతిష్ఠించనున్న బాలరాముడి విగ్రహాన్ని జైశ్రీరామ్ నినాదాల మధ్య బుధవారం నాడు ఆలయ ఆవరణలోకి తీసుకువచ్చారు. 22న గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ చేశాకే విగ్రహాన్ని దర్శించుకోవడానికి అవకాశం ఉంటుంది. మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన ఈ విగ్రహాన్ని అత్యంత భద్రత నడుమ ఓ ట్రక్కులో తీసుకువచ్చారు.

అసోంలో ఆలయానికి రాహుల్

భారత్ జోడో న్యాయ యాత్రను కొనసాగిస్తున్న రాహుల్ గాంధీ 22న అసోంలో ఉంటారు. ఆ రోజు కార్యక్రమాల్లో భాగంగా అక్కడున్న ఒక ఆలయాన్ని ఆయన సందర్శిస్తారు. కాగా, తనకు ఆహ్వానం పంపినందుకు ట్రస్ట్ అధికారులకు శరద్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన తర్వాత దర్శనం సులువు అవుతుంది కాబట్టి, ఈ కార్యక్రమానికి తాను హాజరు కాబోవడం లేదని ప్రకటించారు. పైగా అప్పటికి రామమందిరం నిర్మాణం కూడా పూర్తవుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే జనవరి 22న నాసిక్‌లోని కాలారామ్ ఆలయంలో జరిపే మహా హారతిలో పాల్గొంటానని తెలిపారు. రామమందిర ప్రతిష్ఠకు హాజరు కాబోనని లాలూప్రసాద్ బుధవారమే ప్రకటించారు.

దావోస్‌లో రామమందిరం సందడి

అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ అంశం దావోస్‌లోనూ సందడి చేస్తోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని పలువురు స్థానిక భక్తులు కలిశారు. 22న సోమవారం నగర వ్యాప్తంగా రామ భజనలు చేయడంతో పాటు, సాయంత్రం వేళ దీపాలు వెలిగించేలా తమకు సందేశం ఇవ్వాలని ఆమెను కోరారు.

ధర్మవరం పట్టుచీర డిజైనర్‌కు రాని ఆహ్వానం

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణపతిష్ఠ నేపథ్యంలో సీతమ్మవారికి పట్టుచీరను నేసిన కార్మికుడికి ఆహ్వానం అందలేదు. రామ జన్మభూమి ట్రస్ట్ కోరిక మేరకు నాలుగు నెలల పాటు రాత్రింబవళ్లు శ్రమించి సీతమ్మకు పట్టుచీరను తయారు చేశానని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్ నాగరాజు తెలిపారు. దాన్ని అమ్మవారికి సమర్పించడానికి అయోధ్యకు వెళ్లేందుకు సిద్ధమయ్యానని, అయితే ఇప్పటివరకూ తనకు ఆహ్వానం అందలేదని బుధవారం ఆయన కన్నీటిపర్యంతమయ్యారు.

పూరీలో 'జగన్నాథ్ కారిడార్' ప్రారంభం

ఒడిశాలో ప్రముఖ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథ ఆలయం చుట్టూ రూ.800 కోట్లతో నిర్మించిన హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టును సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్, నేపాల్ పశుపతినాథ్ ఆలయం, ఉజ్జయిని మహాకాల్ ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయం, దుబాయ్, ఆస్ట్రేలియా, యూకేలలో ఉన్న జగన్నాథ ఆలయాలు సహా 90 దేవాలయాల ప్రతినిధులు, వేలాది మంది భక్తుల సమక్షంలో 'శ్రీమందిర్ పరిక్రమ ప్రకల్ప'ను పట్నాయక్ అధికారికంగా ఆవిష్కరించారు.

అయోధ్యకు 200 ప్రత్యేక రైళ్లు

● సికింద్రాబాద్, కాజీపేట నుంచి అవకాశం.. ఐఆర్‌సీటీసీలోనే బుకింగ్

న్యూఢిల్లీ, జనవరి 17: అయోధ్యలోని బాల రాముడ్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం భారతీయ రైల్వే సుమారు 200 ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని 66 పట్టణాల నుంచి 'ఆస్థా స్పెషల్' పేరుతో వీటిని నిర్వహించనుంది. తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట జంక్షన్‌ల నుంచి ఇవి బయలుదేరనున్నాయి. ఈ నెల 22న ఆలయ ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అనంతరం 100 రోజుల పాటు వీటిని నడపనుంది. ఆయా రైళ్లు.. ప్రారంభమైన స్టేషన్ నుంచి నేరుగా గమ్యస్థానమైన అయోధ్యధామ్‌కు చేరుకుంటాయి. టిక్కెట్లను కేవలం ఐఆర్‌సీటీసీ పోర్టల్‌లోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రయాణికుల నుంచి రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్, కేటరింగ్ రుసుములు, జీఎస్టీలు వసూలు చేస్తారు. రైలులో శాకాహార భోజనం అందజేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ స్టేషన్ల నుంచి ఈ రైళ్లు బయల్దేరుతాయన్న అంశంపై ఇంకా నిర్ణయం వెలువడాల్సి ఉంది.

లోకం తీరు



ప్రజల నుంచి సూచనలెందుకు అడిగారయ్యా!

రాముడితో రాజకీయమేంటి?

» మందిర నిర్మాణం పూర్తయింది

» మండపాల పనులే మిగిలాయి

» ఆలయ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాముడు రాజకీయం చేశాడా, లేక భక్తులే ఆయనతో రాజకీయం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా వ్యాఖ్యానించారు. బుధవారం ఒక మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాజకీయాలను చూడటం మన దృష్టిని బట్టి ఉంటుందన్నారు. ఆలయం పూర్తిగా నిర్మాణమైందని నృపేంద్ర స్పష్టం చేశారు. బాల రాముడు గర్భగృహంలో ఉంటారని తెలిపారు. అయిదు మండపాలు, ఆలయం కింది అంతస్తులో ఉంటాయని అన్నారు. మొదటి అంతస్తు మాత్రమే ఇంకా నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నదని చెప్పారు. అందులో రామ దర్బార్ ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత నిర్మించే రెండో అంతస్తులో అనుష్ఠానం, యజ్ఞాలు జరుగుతాయని వివరించారు.

ప్రాణప్రతిష్ఠ తర్వాతా గుడి నిర్మాణం

బెంగళూరు, జనవరి 17: అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠపై జ్యోతిర్మఠం శంకరాచార్య అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ స్పందించారు. ప్రాణప్రతిష్ఠ తర్వాత కూడా ఆలయాల నిర్మాణం కొనసాగిన సందర్భాలున్నాయని, దీనికి నిబంధనలు కూడా ఉన్నాయని తెలిపారు. "తమిళనాడులోని రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా శివలింగానికి ప్రాణప్రతిష్ఠ చేశాడు. ఆ సమయంలో అక్కడ ఆలయమే లేదు. తర్వాతే ఆలయం నిర్మించారు" అని రవిశంకర్ చెప్పారు. మదురై ఆలయం, తిరుమల బాలాజీ ఆలయం కూడా మొదట్లో చిన్నవిగా ఉండేవని, తర్వాత కాలంలో రాజులు వాటిని నిర్మించారని గుర్తుచేశారు.

వేగంగా దేశాభివృద్ధి బీజేపీకే సాధ్యం

తొమ్మిదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి: మోదీ



గురువాయూర్ శ్రీకృష్ణుడి ఆలయంలో మోదీ

కొచ్చి/త్రిసూర్, జనవరి 17: దేశాన్ని వేగంగా అభివృద్ధి చేయగల ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని, దేశ భవిష్యత్తుపై బీజేపీకి స్పష్టమైన దృక్పథం ఉందని ప్రధాని మోదీ అన్నారు. గత తొమ్మిదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. బుధవారం కేరళలోని కొచ్చిలో సుమారు 6 వేల మంది పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌ల చరిత్ర అవినీతిమయమని ఓటర్లకు వివరించాలని చెప్పారు. కాగా, కొచ్చిలో రూ.4 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. వీటిలో కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో దేశంలో అతి పెద్దదైన 'డ్రై డాక్' ఒకటి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ డ్రై డాక్‌తో పాటు పాటు ప్రారంభించిన ఓడల నిర్మాణం, మరమ్మతుల యూనిట్, ఎల్పీజీ దిగుమతి టెర్మినల్ దక్షిణాదిలో అభివృద్ధిని వేగవంతం చేస్తాయన్నారు. మోదీ కేరళలో రెండో రోజు పర్యటనలో భాగంగా బుధవారం గురువాయూర్ శ్రీకృష్ణుడి ఆలయం, త్రిప్రయర్ శ్రీరామస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. గురువాయూర్ ఆలయంలో మలయాళ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపి కుమార్తె వివాహానికి మోదీ హాజరయ్యారు. కొత్త జంటను ఆశీర్వదించి వరమాలలు అందించారు. వారితో మాట్లాడి ఫొటోలు దిగారు. ఈ వేడుకకు మోహన్‌లాల్, మమ్ముట్టి, జయరాం, ఖుష్బూ తదితర నటులు కూడా హాజరయ్యారు.

ఈశాన్యంపై మోదీ నిర్లక్ష్యం

'న్యాయ్ యాత్ర'లో రాహుల్ గాంధీ ధ్వజం

మణిపూర్ ఘర్షణల్లో ఇద్దరు కమెండోల మృతి



న్యూఢిల్లీ/కోహిమా, జనవరి 17: ఈశాన్య భారతాన్ని ఏదో ఉద్ధరిస్తున్నట్లు ప్రధాని మోదీ గొప్పలు చెబుతుంటారని.. నిజానికి ఈ ప్రాంతాన్ని ఆయన పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధానంగా నాగాలాండ్‌లో మౌలిక వసతుల అభివృద్ధే లేదని ఆక్షేపించారు. ఒకసారి వచ్చి ఈ రోడ్లపై తిరగాలని సవాల్ విసిరారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా బుధవారం ఆయన ఓ సభలో ప్రసంగించారు. గతుకుల రోడ్లు, అరకొరగా కరెంటు సదుపాయం, వైద్య వసతులు లేమిని విమర్శించారు. 'నాగాలాండ్ ప్రజలను ఈ చెత్త రోడ్లపై తిరగమనడం అన్యాయం. వారిని మోసగించడమే! ఇలాంటి రోడ్లపై యువతకు సానుకూల భవిష్యత్ అందించగలమని ఎలా ఆశిస్తాం? నాగాలాండ్, మణిపూర్, అసోం ప్రజలపై యావద్దేశం దృష్టి సారించేలా చేసేందుకే భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టాను' అని ధ్వజమెత్తారు.

మణిపూర్‌లో చల్లారని జ్వాలలు

మణిపూర్‌లో వర్గవైషమ్యాలు ఇంకా చల్లారలేదు. ప్రతి రోజూ ఘర్షణలు జరుగుతున్నాయి. బుధవారం సరిహద్దు పట్టణం మోరేహ్‌లో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇద్దరు కమెండోలు చనిపోయారు. హింసాత్మక ప్రాంతాల్లోకి అదనపు బలగాలను తరలించడం కష్టంగా మారింది. ఆందోళనకారులు వాటిపై దాడులకు దిగుతున్నారు. దీంతో హెలికాప్టర్ల ద్వారా వారిని తరలించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. రాజధాని ఇంఫాల్‌కు హెలికాప్టర్లు పంపాలని కేంద్ర హోం శాఖకు లేఖ రాసింది. నిరుడు అక్టోబరు 31న సీనియర్ పోలీసు అధికారి హత్యకు సంబంధించి ఇద్దరు కుకీలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని విడుదల చేయాలని బుధవారం కుకీలు ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా, మణిపూర్ ఘర్షణల్లో పోలీసు ఆయుధాలను లూటీ చేశారన్న ఆరోపణలతో అయిదుగురిపై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది.

మేనిఫెస్టోకు సూచనలు పంపండి: కాంగ్రెస్

రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలను సూచించాల్సిందిగా ప్రజలను కాంగ్రెస్ కోరింది. ప్రజల నుంచి వచ్చే సూచనల్లో సాధ్యమైనన్ని ఎక్కువ అంశాల్ని చేర్చడం ద్వారా తమ పార్టీ మేనిఫెస్టోను ప్రజల మేనిఫెస్టోగా రూపొందించనున్నామని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సారథి చిదంబరం తెలిపారు. మేనిఫెస్టో కమిటీ సభ్యులు ప్రతి రాష్ట్రంలో ప్రజలతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతారని, సూచనల కోసం ఈ-మెయిల్ అకౌంట్‌ను వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రజలు తమ సూచనలను ేౌ్ఞఞజుజీఃజీఛి.జీ లేదా ఠీఠీఠీ.ేౌ్ఞఞజుజీ.జీ కు

అన్నమయ్య కలెక్టర్‌పై సస్పెన్షన్ వేటు?

» దొంగ ఓట్ల వ్యవహారంలో ఈసీ సీరియస్

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు, అధికార పార్టీకి కొమ్ముకాసిన అధికారులపై చర్యలకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఉపక్రమించింది. తొలి వికెట్ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాదే. ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఆయన తన లాగిన్, పాస్‌వర్డ్‌ను వైసీపీకి చెందిన వ్యక్తులకు అప్పగించారు. ఆ సమయంలో తిరుపతి ఉప ఎన్నికలో ఆయన రిటర్నింగ్ అధికారి (ఆర్వో)గా కూడా ఉన్నారు. సదరు వ్యక్తులు ఆయన లాగిన్‌లో నుంచి 30 వేల కార్డులు డౌన్‌లోడ్ చేసి, వాటి ద్వారా దొంగ ఓటర్ కార్డులను సృష్టించారు. అప్పటి నుంచే ఆయనపై నిఘా పెట్టిన ఈసీ.. ఆయన లాగిన్ నుంచి ఎన్ని వేల కార్డులు డౌన్‌లోడ్ చేశారు.. ఏయే పేర్లు మార్చారు.. ఎన్నిసార్లు లాగిన్ అయ్యారో డేటా మొత్తం సేకరించింది. ఈ నెల 9, 10వ తేదీల్లో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని బయటపెట్టింది. అక్రమ లాగిన్ వ్యవహారంపై నేరుగా సమావేశంలోనే ఆయన్నే ప్రశ్నించింది. ఈసీ అడిగిన ప్రశ్నలకు ఆయన వద్ద కనీస సమాధానం కూడా లేదు. ఆ సమయంలో మీ లాగిన్ మీ వద్దనే ఉందా.. లేదా..? ఆ లాగిన్ నుంచి 30 వేల మందికి సంబంధించిన కార్డులు డౌన్‌లోడ్ చేశారు.. ఈ విషయం మీకు తెలుసా.. వాటి ఆధారంగా అనేక దొంగ ఓటర్ కార్డులను సృష్టించిన విషయం మీ దృష్టికి వచ్చిందా..? అని ప్రశ్నించారు. ఆయన వద్ద సమాధానం లేకపోవడంతో ఈసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ సమయంలోనే మీకు పార్టీ పక్షపాతం ఉంటే వెంటనే విధుల్లో నుంచి తప్పుకోవాలని హెచ్చరించింది. ఏదైనా ఉంటే ఎన్నికల తర్వాత చూసుకోవాలని.. ఇప్పుడు మాత్రం తమ నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ సమావేశం తర్వాత గిరీషాపై ఈసీ వేటు వస్తుందని అందరూ భావించారు. అనుకున్నట్లుగానే ఈసీ ఆయన్ను సస్పెండ్ చేసింది. ఈ సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)కి మాత్రమే పంపించారు. కానీ బుధవారం రాత్రి వరకూ సీఎస్‌కు తెలియజేయలేదు. ప్రస్తుతం గిరీషా మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నారు. గురువారం ఉదయం ఆయన విధుల్లో చేరనున్నారు. ఈలోగా ఈసీ సస్పెండ్ చేసింది. ప్రభుత్వం ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌ను నియమించాల్సి ఉంటుంది.

వైసీపీ కోసం బలి.

అధికార పార్టీకి కొమ్ముకాసినందుకు మరో ఐఏఎస్ బలైపోయారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో విజయం కోసం వైసీపీ అనేక అడ్డదారులు తొక్కింది. ముఖ్యంగా దొంగ ఓటర్ కార్డులపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. ఈ వ్యవహారంపై ఈసీకి అనేక ఫిర్యాదులు అందాయి. అప్పటి నుంచి కమిషన్ పూర్తి స్థాయిలో ఆరా తీయడం మొదలుపెట్టింది. గిరీషా ఎన్నికల కమిషన్ లాగిన్, పాస్‌వర్డ్‌ను స్థానిక ప్రజాప్రతినిధి కొడుక్కి అప్పగించేవారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు లాగిన్ అయి.. ఓటర్ గుర్తింపు కార్డులు డౌన్‌లోడ్ చేయడం చేశారు. ఇలా 30 వేల కార్డులు డౌన్‌లోడ్ చేసినట్లు ఈసీ గుర్తించింది. వైసీపీకి అడ్డగోలుగా సహకరించి ఆయన బలైపోయారు.

కలెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధం

» 23 తర్వాత ట్రాన్స్‌ఫర్లకు సన్నాహాలు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సాగుతోంది. ఈ సమయంలో కలెక్టర్లను బదిలీ చేయడానికి ఎన్నికల కమిషన్ అంగీకరించదు. ఈ నెల 22న ఓటర్ల తుది జాబితాను ఈసీ విడుదల చేయనుంది. దీంతో ఈ నెల 23 నుంచి 30లోపు కొందరు సీనియర్ ఐఏఎస్‌లు, కలెక్టర్ల బదిలీలు చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ 2021 నుంచి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను కచ్చితంగా మార్చాల్సి ఉంటుంది. నంద్యాల జిల్లా కలెక్టర్ మనజిర్ జీలానీ సమూన్ కర్నూలు జిల్లాలో ఎక్కువకాలం పనిచేశారు. ఉమ్మడి కర్నూలు జేసీగా ఆ తర్వాత నుంచి నంద్యాల కలెక్టర్‌గా విధుల్లో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలను ఈసీ పరిగణనలోకి తీసుకుంటున్నందున ఆయన్ను కూడా బదిలీ చేయాల్సి ఉంది. అలాగే జూన్‌లో పదవీ విరమణ చేయనున్న తిరుపతి జిల్లా కలెక్టర్ బదిలీ కానున్నారు. ప్రతిపక్షాలు, ఇతర పార్టీల ఫిర్యాదులతో మరికొంత మందిపైనా బదిలీ వేటుపడే అవకాశం ఉంది. కొంతమంది కలెక్టర్ల పనితీరుపై ఈసీ తీవ్ర అసంతృప్తితో ఉంది. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు జిల్లా కలెక్టర్లు కూడా బదిలీల జాబితాలో ఉన్నట్లు సమాచారం.

మృత్యువుతో చైనా చెలగాటం

» 100 శాతం ప్రాణాంతకమైన కరోనా సృష్టి

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రపంచం మొత్తాన్నీ రెండేళ్ల పాటు గడగడలాడించి, కోట్లాది మంది ప్రాణాలు పోవడానికి కారణమైన కరోనా మహమ్మారిని చైనా పరిశోధకులే ల్యాబ్‌లో సృష్టించారన్న వాదనలో నిజం ఎంతుందో తెలియదుగానీ.. ఇప్పుడు వారో కొత్త వైరస్‌ను సృష్టించినట్టు సమాచారం. చైనా పీపుల్ లిబరేషన్ ఆర్మీకి చెందిన వైద్యులు తయారుచేసిన ఆ పాంగోలిన్ కరోనా వైరస్ పేరు.. 'జీఎక్స్-పీ2వీ'. సాధారణంగా పాంగోలిన్ల శరీరాల్లో కరోనా వైరస్ ఉంటుంది. అలా 2017లో మలేసియన్ పాంగోలిన్లలో గుర్తించిన 'జీఎక్స్/2017' ఉత్పరివర్తనం నుంచి ఈ కొత్త రకాన్ని చైనా పరిశోధకులు తయారుచేశారు. అది ఎంత ప్రమాదకరమైన వైరస్ అంటే.. ప్రయోగశాలలోని ఎలుకలకు 100% ప్రాణాంతకంగా పరిణమిస్తున్నట్టు బయోఆర్కైవ్‌లో ఇటీవల ఒక రిపోర్ట్ ప్రచురితమైంది. ఆ నివేదిక ప్రకారం.. ప్రయోగశాలలోని నాలుగు ఎలుకలకు ఈ వైరస్‌ను ఎక్కించిన ఐదురోజుల్లో వాటిలో వేగంగా బరువుతగ్గిపోవడం, కళ్లు తెల్లగా మారిపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. నాలుగు ఎలుకలూ ఆ వైరస్‌ను ఎక్కించిన 8 రోజుల్లోగా చనిపోయాయి. వైరస్ వాటి మెదడుకు, కళ్లకు, ఊపిరితిత్తులకూ చాలా వేగంగా వ్యాపించినట్టు.. చివరి రెండురోజుల్లో మెదడులో వైరల్ లోడ్ విపరీతంగా పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. ఆ వైరస్ మనుషులకూ అంతే ప్రమాదకరమని.. దురదృష్టవశాత్తూ ఆ వైరస్ ల్యాబ్ నుంచి బయటపడి మనుషులకు సోకడం మొదలైతే మానవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఊరు మారలేదు!

జగనన్నా మా ఊరు మారలేదు

వైసీపీ పాలనలో పల్లెలు మారిపోయాయని ప్రభుత్వం సొంత పత్రికలో వస్తున్న ప్రకటనలు చూసి ప్రజాప్రతినిధులు, ప్రజలు నవ్వుకుంటున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికిచ్చే నిధులను పంచాయతీలకు ఇవ్వకుండా ఎలా దొంగిలించిందో అందరికీ తెలుసు. ఉపాధి నిధులు కూడా పక్కదారి మళ్లించటంతో అభివృద్ధి పథకాలు మధ్యలోనే ఆగిపోయాయి. మా ఊరు మారలేదు..మా పల్లెల్లో అభివృద్ధి జరగలేదు.

- మండలి ఉదయ భాస్కర్, సర్పంచ్, భావదేవరపల్లి, నాగాయలంక, కృష్ణాజిల్లా..

ఊరంతా వైసీపీయే, కానీ..

(మొదటి పేజీ తరువాయి)

రావడంతో నిలిచిపోయాయి. ఆ తర్వాత రోడ్డు వేసే క్రమంలో పరిచిన కంకర బేబీ చిప్స్ సైతం నేడు కనిపించడం లేదు. ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే విద్యాశాఖ మంత్రిగా పనిచేసినా.. గ్రామంలో ప్రాథమిక పాఠశాల 'నాడు-నేడు' అభివృద్ధి పనులకు నోచుకోలేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు పారుతోంది. టీడీపీ హయాంలో వేసిన సీసీ రోడ్డు మినహా కొత్తగా వేసినవి తక్కువే. కేవలం రూ.4లక్షలతో 300అడుగుల సీసీ రోడ్డును మాత్రమే కొత్తగా ఏర్పాటుచేశారు.అయినప్పటికీ, పల్లెలు వెలిగిపోతున్నాయని ప్రభుత్వం డబ్బా కొట్టుకొంటోంది.



పిల్లర్లూ లేవకుండానే..



చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం సీఆర్ కండ్రిగలోని రైతుభరోసా కేంద్రం (పై ఫొటో) డిజిటల్ లైబ్రరీ (కింద ఫొటో) పరిస్థితి ఇది. వీటి కోసం వేసిన పిల్లర్లు శిథిలమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.

డ్రైనేజీ కట్టలేదు...



కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల ఎస్సీ కాలనీలో టీడీపీ హయాంలో వేసిన సీసీ రోడ్డు. ఇప్పటికీ ఆ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మించలేదు.

మిగిలిన రోడ్డూ వేయలేదు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని సి.కొత్తపల్లిలో టీడీపీ హయాంలో వేసిన సీసీ రోడ్డు ఇది. మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్నా మిగిలిన రోడ్డును పూర్తి చేయలేదు. డ్రైనేజీ నిర్మించలేదు.

తుప్పల్లో నిర్మాణాలు తుప్పు పట్టి..

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం భావదేవరపల్లి పంచాయతీలో సచివాలయం పనులు మొదలై ఏళ్లు గడిచిపోయాయి. కానీ, ఇంకా ఆ భవన నిర్మాణం ప్రాథమిక దశలోనే ఉంది. బేస్‌మెంట్ పూర్తయి, పిల్లర్లు లేశాక పనులు ఆగిపోయాయి. ఇప్పుడు చూస్తే.. పిల్లర్ల ఇనుపచువ్వలు తుప్పు పడుతున్నాయి. లోపల, బయట పిచ్చి చెట్లు మొలిచి పాత భవనంలా దర్శనమిస్తోంది. రైతు భరోసా కేంద్ర భవనానికి స్థలం చూపించినా, ఆ ప్రాంతంలో నిర్మాణపనులు ప్రారంభం కాలేదు. గ్రామంలోని సామాజిక భవనంలో ఆర్బీకేను నిర్వహిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని నిర్మించారు కానీ, ఇంకా తుదిమెరుగులు దిద్దలేదు. తుఫాను రక్షిత భవనంలో విధులను నిర్వర్తిస్తున్నారు. మండల కేంద్రంలో నిర్మించాల్సిన డిజిటల్



గ్రంథాలయానికి స్థలం దొరకక, భావదేవరపల్లిలో నిర్మిస్తున్నారు. స్లాబ్ పూర్తయింది. గ్రామంలో పలు అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తుంటే..పల్లెలో సమగ్రాభివృద్ధి జరిగిపోయిందని పాలకులు తమ పత్రికలో ప్రకటనలు ఇవ్వటం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్ ఉదయభాస్కర్ విమర్శించారు.

సిద్ధమైన భవనాలూ చెరలోనే!



కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి అభివృద్ధి అంటే.. ఐదేళ్ల క్రితం వేసిన 'చంద్రన్న బాట' రహదారులే కనిపిస్తున్నాయి. జగన్ పాలనలో 350 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారు. కానీ వాటికి నేటికీ లేఅవుట్ వేయలేదని, కనీసం స్థలాలు కూడా చూపలేదని ప్రజలు తెలిపారు. మంత్రి గుమ్మనూరు జయరాం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు నియోజకవర్గం మూసానహళ్లి గ్రామ జనాభా 2,340 మంది. రూ.14 లక్షలతో ఆర్బీకే కేంద్రం నిర్మించినా, ఫైనల్ బిల్లు రాకపోవడంతో భవనాన్ని కాంట్రాక్టర్ స్వాధీనం చేయలేదు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం నూతన భవనం తుదిదశలో బిల్లు రాక ప్రారంభానికి నోచుకోలేదు. రూ.14లక్షలతో మంజూరైన విలేజ్ క్లినిక్ అర్ధంతరంగా నిలిచిపోయింది. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయినా, ఏ వీధికి వెళ్లినా, రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. గ్రామంలో మొత్తం 28 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో చాలా ఇళ్లు మొండి గోడలు, బేస్‌మెంట్ లెవెల్‌లోనే నిలిచిపోయాయి. ప్రాథమిక పాఠశాలకు రెండు అదనపు గదులు, వంట గది, నిర్మాణం కోసం రూ.16 లక్షలు మంజూరు కాగా, బిల్లులు మంజూరుకాక నిర్మాణ పనులు ఆగిపోయాయి.

పట్టా ఇచ్చారు.. ఇల్లు మరిచారు..



శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం పరిధిలోని రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామానికి చెందిన రామాంజినమ్మకు జగన్ ప్రభుత్వం ఇంటిపట్టా ఇచ్చింది. కానీ ఇల్లు మంజూరు చేయలేదు. దీంతో ఆమె నేటికీ పూరిగుడిసెలోనే జీవనం సాగిస్తోంది. ఈ గ్రామంలో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. గుక్కెడు రక్షిత మంచినీటికి నోచుకోలేని దయనీయ స్థితిలో గ్రామ ప్రజలున్నారు. మల్లిమడుగు గ్రామంలో దాదాపు 800 కుటుంబాలు ఉన్నాయి. ఇళ్లులేనివారికి స్థలాల పట్టాలిచ్చారేగాని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. సచివాలయం, బల్క్‌కూలింగ్ సెంటర్, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర భవనాల నిర్మాణాలను ప్రారంభించారేగాని.. ఇప్పటికీ పూర్తి చేయలేదు. భవనాలన్నీ మొండిగోడలకే పరిమితమయ్యాయి. కొన్ని భవనాలు పునాదుల వద్దే నిలిచిపోయాయి. నిధులలేమితో రెండేళ్లుగా వాటి గురించి పట్టించుకోవడం లేదు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో లక్షలాది రూపాయల ఖర్చులతో చేపట్టిన ఓహెచ్ఆర్ నిర్మాణం, శుద్ధజల నీటి పథకం పనులను వైసీపీ ప్రభుత్వం వచ్చాక విస్మరించారు.

పిల్లలు బడికి వెళ్లేదెలా?



శ్రీకాకుళం జిల్లాలో బహుదా నదిపై టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.7.5 కోట్ల వ్యయంతో వంతెన పనులను ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. ఇప్పటివరకు బహుదా వద్ద సగం పనులు కూడా చేయలేకపోయారు. వంతెన పూర్తికాకపోవడంతో పక్కగ్రామంలో ఉన్న కొలిగాం ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలం వెంకటాపురం పంచాయతీని, కొత్తూరు పంచాయతీని కలిపి ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. కానీ, సచివాలయ భవన నిర్మాణం చేపట్టలేదు. వెంకటాపురం గ్రామంలో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందిపడుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన సోలార్ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోందని.. ఎండ ఉంటేనే మోటార్ పనిచేస్తుందని.. లేకుంటే పాఠశాలకు చెందిన బోరు నుంచి నీటిని తెచ్చి వినియోగిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. కొత్తూరు గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కోసం వచ్చిన స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతికి రోడ్డు మంజూరుచేయాలని గ్రామస్థులు కోరినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మర్రివలస పంచాయతీలో మాకివలస, జమ్మినివలస, గార్నివలస గ్రామాలున్నాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు కానీ.. పనులు పూర్తిస్థాయిలో ప్రారంభించలేదు. సకాలంలో బిల్లులు చెల్లింపులు జరగకపోవడమే కారణం. గిరిజన గ్రామమైన మాకివలసకు వెళ్లేందుకు సరైన మార్గం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వంశధార ఎడమ ప్రధానకాలువలపై అప్పట్లో కాలిబాట నిర్మించారు. దీనిపై నాలుగు చక్రాల వాహనాలు వెళ్లడానికి వీలు లేక పోవడంతో అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాలిబాట స్థానంలో వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టకపోవడం పట్ల గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

మాగుంట ఊసే వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ సీరియస్‌గా చెప్పేశారు. ఒంగోలు లోక్‌సభ.. అసెంబ్లీ టికెట్లపై ముఖ్యమంత్రి స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని మాగుంటకే ఇవ్వాలని బాలినేని పట్టుబడుతున్నారు. ఆయనకు సీటిస్తేనే తాను ఒంగోలు అసెంబ్లీ బరిలో నిలుస్తానని ఇంతకాలం చెబుతూ వచ్చారు. జగన్ అంగీకరించకపోవడంతో అలిగి హైదరాబాద్ వెళ్లి కూర్చున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయన్ను సీఎంవోకు పిలిచారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కలసి బాలినేని, ఆయన కుమారుడు తాడేపల్లి వచ్చారు. ఈ సందర్భంగా బాలినేని, జగన్ చర్చలు పట్టుమని పదినిమిషాలూ జరగలేదని తెలుస్తోంది. మాగుంట పేరెత్తగానే సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఆయనకు, ఆయన కుమారుడికీ టికెట్లు ఇచ్చేది లేదన్నారు.

ఎట్టకేలకు రాజీ!

మాగుంటకు ఒంగోలు లోక్‌సభ టికెట్ ఇస్తేనే తాను అసెంబ్లీకి పోటీచేస్తానని ప్రకటించిన బాలినేని.. ఇప్పుడు ఒంగోలులో ఇళ్ల పట్టాల సంగతి తేలిస్తేనే పోటీ చేస్తానని జగన్‌కు చెప్పారు. ఈ వ్యవహారంలో ఇద్దరూ రాజీపడినట్లేనని రాజకీయ వర్గాలు తెలిపాయి. ఇళ్ల పట్టాలకు ఎంత ఖర్చవుతుందో అధికారులతో మాట్లాడి తేలుస్తానని, ఖర్చు భరించగలమో లేదో చెబుతానని జగన్ అన్నారు. ఆ నిర్ణయాన్ని బట్టి తాను ఒంగోలు నుంచి పోటీ చేయాలో.. గిద్దలూరుకు వెళ్లాలో నిర్ణయించుకుంటానని బాలినేని చెప్పారు. అయితే మాగుంటకు టికెట్ విషయంలో ఆయన సీఎంతో రాజీపడినట్లు స్పష్టమవుతోంది. బుధవారం సాయంత్రం తొలుత విజయవాడలో ఐ-ప్యాక్ ప్రతినిధులతో.. తర్వాత సీఎంవో అధికారి ధనుంజయరెడ్డిలతో బాలినేని సమావేశమయ్యారు. తన డిమాండ్లు, నియోజకవర్గ అభివృద్ధి వ్యవహారాలపై చర్చించారు. తర్వాత సాయంత్రం 5గంటల సమయంలో ఆయన సీఎంను కలిసినట్లు తెలిసింది. ఒంగోలులో ఆయన డిమాండ్లలో ఒకటైన పేదలకు నివాస స్థల పట్టాలిచ్చే భూములకు సంబంధించి ప్రకాశం జిల్లా కలెక్టరుకు ఆగమేఘాలపై కొన్ని ఉత్తర్వులిచ్చారు. 25 వేల మందికి పట్టాలిచ్చేందుకు భూమి కొనుగోలు, అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఇంకా రూ.170 కోట్లు రావలసి ఉంది. అవి వచ్చి పట్టాలిస్తేనే తాను పోటీచేస్తానని.. లేకుంటే లేదని బాలినేని బహిరంగ వ్యాఖ్యలు చేయడంపై జగన్ కస్సుమన్నారు. సీఎంవోకు వచ్చినా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. తాజా పరిణామాలతో.. ప్రకాశం జిల్లా కొండపి, సంతనూతలపాడుల్లో పోటీచేస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జునతో పాటు విజయసాయిరెడ్డి, ఇతరుల సూచనలతో జగనే స్వయంగా బాలినేనికి ఫోన్ చేసి పిలిపించుకున్నారు. ఇదే సమయంలో ప్రకాశం కలెక్టరు పేదలకు నివాసస్థలాలు ఇచ్చేందుకు గుర్తించిన భూమి 402 ఎకరాలలో రూ.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి కూడా ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే బాలినేని రాజకీయ డిమాండ్లలో ప్రధానమైనది ఒంగోలు ఎంపీ స్థానాన్ని మాగుంటకు ఇవ్వడం. ఇందుకు జగన్ ససేమిరా అన్నారు. బాలినేనితోపాటు ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డికి కూడా రాజకీయంగా అవకాశాలు కల్పించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బాలినేని ఎక్కడ పోటీచేయాలి.. ఆయన కుమారుడికి ఏ అవకాశమిస్తారో స్పష్టత ఇవ్వలేదని అంటున్నారు. మాగుంట విషయంలో బాలినేని వెనక్కి తగ్గినట్లేనని వైసీపీ శ్రేణులు అనుమానిస్తున్నాయి. ఇంకో వైపు.. మాగుంట ఇప్పటికే టీడీపీ నుంచి నెల్లూరు లేక ఒంగోలులో పోటీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

పండగ పోయినా కుస్తీలే!

సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై జగన్ కసరత్తు కొనసాగుతోంది. పండక్కి ముందే అభ్యర్థులను ఖరారు చేయాలన్న ఆయన ఆలోచన నిజం కాలేదు. ఇప్పటిదాకా 3 విడతల్లో 50 మంది అసెంబ్లీ, 9 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన.. ఇంకెన్ని స్థానాల్లో మార్పులూ చేర్పులూ చేస్తారోనని ఎమ్మెల్యేలకు ఉత్కంఠగా ఉంది. సంక్రాంతి వెళ్లిపోయినా నాలుగో జాబితాపై జగన్ ఎడతెగని కసరత్తు చేస్తున్నారు. బుధవారం నాడు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, శృంగవరపు కోట, నరసరావుపేట, కమలాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి సీఎంవోకు వచ్చారు. సలహాదారు సజ్జల, ధనుంజయరెడ్డితో చర్చించారు. ఈ కసరత్తు 2-3 రోజులు కొనసాగుతుందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్మా, నోటీసులకు భయపడం!

- హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించం
- షోకాజ్‌లకు అంగన్వాడీల లిఖితపూర్వక సమాధానాలు
- 37వ రోజూ కొనసాగిన నిరసనలు
- సమ్మెకు కార్మిక సంఘాల మద్దతు
- 20న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



అనంతపురం కలెక్టరేట్ వద్ద రోడ్డుపైనే వంటా-వార్పు, భోజనాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు



విజయవాడలో అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా బొప్పరాజు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరుల అభివాదం

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 37వ రోజూ(బుధవారం) కొనసాగింది. సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ నోటీసులకు అంగన్వాడీలు లిఖితపూర్వకంగా సమాధానాలు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదంటూ షోకాజ్ నోటీసులకు సమాధాన పత్రాలను పార్వతీపురం మన్యం జిల్లాలోని అంగన్వాడీలు ఐసీడీఎస్ కార్యాలయాలలో అందించారు. అయితే కొన్నిచోట్ల సీడీపీవోలు ఆ పత్రాలను స్వీకరించలేదు. దీంతో అంగన్వాడీలు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయాలకు తమ సమాధాన పత్రాలను అతికిస్తామని స్పష్టం చేశారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్మా, నోటీసులకు భయపడేది లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సర్కారు దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైనే వంటా వార్పు నిర్వహించారు. వందలాది మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, సీఐటీయూ నాయకులు ఎండలో రోడ్డుపైనే కూర్చొని భోజనాలు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో అంగన్వాడీల సమ్మెకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. పుట్టపర్తి హనుమాన్ సర్కిల్ నుంచి సీడీపీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద అంగన్వాడీలు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పొర్లుదండాలు.. సాష్టాంగ నమస్కారాలు చేశారు. కనికరించండి మహాప్రభో అంటూ నినదించారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ కేంద్రాల వద్ద అంగన్వాడీలు దీక్షలు కొనసాగిస్తున్నారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట చిన్నారులతో కలసి దీక్షలు చేశారు. వారికి సీఐటీయూ, సీపీఎం నేతలు మద్దతు తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు బి.పైడిరాజు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ నెరవేర్చిన డిమాండ్లు ఏంటో తమకు ఇంతవరకు తెలియదన్నారు. మంత్రి ఏ డిమాండ్లు నెరవేర్చారో లిఖిత పూర్వకంగా వివరించాలని ఆమె కోరారు.

నిరవధిక దీక్షలు ప్రారంభం..

విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్వాడీల నిరవధిక దీక్షలను బుధవారం ప్రారంభించారు. దీక్షలకు మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నా సానుకూలంగా స్పందించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం కేవలం రెండు శాతం ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో లక్షకుపైగా ఉన్న అంగన్వాడీల కుటుంబాలు ఓట్లు వేయాలనే విషయాన్ని గుర్తించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీల ఉద్యమానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు ఉంటుందన్నారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చర్చల పేరుతో కాలయాపన చేయకుండా అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. 11 డిమాండ్లలో 10 పరిష్కరించామంటూ ప్రభుత్వం తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. జీతభత్యాలు, గ్రాట్యుటీ అంశాలపై అసలు చర్చించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ నేతలు ఏవీ.నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, ఆర్.రవీంద్రనాథ్, ఓబులేసు, పొలారి, రవిచంద్ర తదితరులు ఈ దీక్షకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిర్వహించే ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందన్నారు.

కార్మిక సంఘాల మద్దతు..

అంగన్వాడీల నిరవధిక దీక్షలకు మద్దతుగా ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీల సమావేశాన్ని బుధవారం విజయవాడలో నిర్వహించారు. అంగన్‌వాడీల నిరవధిక దీక్షలకు సంఘీభావంగా 20న అన్ని జిల్లాల్లో గంట పాటు రాస్తారోకోలు నిర్వహించాలని నిర్ణయించారు.

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భీకర యుద్ధం..!

- పామేడ్‌లో సీఆర్‌పీఎఫ్‌ను చుట్టుముట్టిన నక్సల్స్
- 3 వేల మంది పాల్గొన్నట్లు అంచనా

చర్ల, జనవరి 17: రాకెట్ లాంచర్లతో దాడులు.. తుపాకీ తూటాల మోతలతో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులు మంగళవారం రాత్రంతా దద్దరిల్లాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు గ్రామంలోని మూడు సీఆర్పీఎఫ్ క్యాంపులతోపాటు.. కొత్తగా నిర్మిస్తున్న ధర్మారం శిబిరాన్ని సుమారు 3 వేల మంది మావోయిస్టులు చుట్టుముట్టి.. రాకెట్ లాంచర్లతో దాడులకు తెగబడ్డారు. మంగళవారం రాత్రి 6 గంటల సమయంలో మొదలైన ఈ దాడులు.. బుధవారం తెల్లవారుజాము వరకు.. సుమారు 10 గంటల పాటు కొనసాగాయి. పక్కా వ్యూహంతో ఈ శిబిరాలను చుట్టుముట్టిన మావోయిస్టులు.. బ్యాకప్ ఫోర్స్ రావడానికి అవకాశమే లేకుండా చర్ల-పామేడు, పామేడు-దిల్పాపురం రోడ్లను దిగ్బంధించారు. ఎక్కడికక్కడ కల్వర్టుల వద్ద మందుపాతరలతో రోడ్లను ధ్వంసం చేశారు. సీఆర్పీఎఫ్ బలగాలకు అండగా బ్యాకప్ ఫోర్స్ రాకుండా ఉండేందుకు అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికి రోడ్డుపై అడ్డంగా వేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు తీవ్ర గాయాలపాలైనట్లు తెలిసింది. ఏపీకి చెందిన 40 మంది కూలీలు త్రుటిలో మావోయిస్టుల రాకెట్, తుపాకీ దాడుల నుంచి తప్పించుకున్నారు. బుధవారం రాత్రి పొద్దుపోయేదాకా మావోయిస్టుల కోసం ఆపరేషన్ కొనసాగుతోందని చెబుతున్న సీఆర్పీఎఫ్ వర్గాలు.. ఘటన వివరాలను వెల్లడించడానికి నిరాకరించాయి. అటు మావోయిస్టుల వైపు నుంచి కూడా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

300కు పైగా రాకెట్ దాడులు

ఘటన జరిగిన స్థలం సమీపం వరకు 'ఆంధ్రజ్యోతి' వెళ్లగలిగింది. అయితే.. మావోయిస్టులు ఎక్కడికక్కడ మందుపాతరలు పెట్టారని, ముందుకు వెళ్లడం కుదరదని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. పామేడ్ పోలీస్‌స్టేషన్ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వరకే అనుమతించారు. అసలు ఏం జరిగిందో చెప్పడానికి నిరాకరించారు. అయితే.. స్థానిక గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు, ఏపీకి చెందిన పలువురు కూలీలు మాత్రం రాత్రంతా బాంబుల మోతతో అటవీ ప్రాంతం దద్దరిల్లిందని చెప్పారు. నివాసాలు, గుడిసెల్లోంచి బయటకు వచ్చి చూస్తే.. సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉన్న ప్రదేశాల్లో తూటాలు, రాకెట్లు దూసుకువస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపించిందని వివరించారు. క్యాంపుల చుట్టూ దాదాపు 3 వేల మంది వరకు మావోయిస్టులు(పీఎల్‌జీఏ) తెరిపినివ్వకుండా కాల్పులు జరుపుతుండడం.. నిప్పురవ్వలు సీఆర్పీఎఫ్ 151వ బెటాలియన్‌కు చెందిన శిబిరాల వైపు దూసుకురావడం చూశామన్నారు. ఇటు పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపినట్లు తెలిసింది. "రాత్రి 6 గంటల సమయంలో ఈ మార్గం మీదుగా వెళ్తున్న వాహనదారులను మావోయిస్టులు నిలిపివేశారు. వేరే మార్గంలో వెళ్లాలని సూచించారు" అని స్థానికులు పేర్కొన్నారు.

గుడివాడలో నేడు ఘనంగా

ఎన్టీఆర్ వర్ధంతి సభ

- దారిద్ర్య నిర్మూలనపై విధాన పత్రం నిమ్మకూరులో విడుదల

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి కార్యక్రమం గురువారం ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో జరగనుంది. ఎన్టీఆర్ స్వస్థల ప్రాంతమైన గుడివాడలో ఈసారి ఈ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించడానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు సమాయత్తం అయ్యాయి. గుడివాడ పట్టణ శివార్లలోని మల్లాయపాలెంలో పెద్ద బహిరంగ సభను ఈ సందర్భంగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈసారి దీనిని మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆ పార్టీ నేతలు పనిచేస్తున్నారు. ఈ సభ నిర్వహణను విజయవంతం చేయడం ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఒక ఊపు తేవడానికి ఆ పార్టీ వ్యూహ రచన చేసింది. ఈసారి గుడివాడలో గెలుపును టీడీపీ కీలకంగా పరిగణిస్తోంది. ఆ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ప్రవాసాంధ్రుడు వెనిగళ్ల రామ్మోహన్‌ను ఇటీవల నియమించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుకు ప్రత్యామ్నాయం చూపుతామని పార్టీ నాయకత్వం హామీ ఇవ్వడంతో ఆయన కూడా రామ్మోహన్‌తో కలిసి పనిచేస్తున్నారు. గుడివాడతోపాటు పొరుగున ఉన్న పామర్రు, గన్నవరం తదితర నియోజకవర్గాల నుంచి కూడా పార్టీ శ్రేణులను సమీకరించి ఘనంగా ఈ సభను నిర్వహించే లక్ష్యంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు ఈ సభలో పాల్గొంటున్నారు. ఇక్కడి ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతున్న ఆయన మొదట ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరును మధ్యాహ్నం మూడు గంటలకు సందర్శిస్తారు. అక్కడ రామారావు విగ్రహానికి పుష్పమాల వేసి నివాళి అర్పిస్తారు. పి 4 అన్న పేరుతో దారిద్ర్య నిర్మూలనపై రూపొందించిన ఒక పత్రాన్ని అక్కడ విడుదల చేస్తారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలను ఆర్థికంగా పైకి తేవడం లక్ష్యంగా ఈ పత్రాన్ని రూపొందించారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజు దీనిని విడుదల చేయాలని ఆయన నిర్ణయించారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లోనే గుడివాడ చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరున్నర వరకూ ఈ సభ జరుగుతుంది. తర్వాత ఆయన రోడ్డు మార్గంలో ఉండవల్లిలోని తన నివాసానికి తిరిగి వస్తారు.

పోటీ ర్యాలీకి కొడాలి నాని రెడీ

గుడివాడ, జనవరి 17: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ అధినేత చంద్రబాబు గుడివాడలో గురువారం సభ నిర్వహించనుండగా.. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నాని దానికి పోటీగా ర్యాలీ చేయాలని నిర్ణయించారు. దీంతో పట్టణంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. చంద్రబాబు సభ గుడివాడకు కూతవేటు దూరంలో సాయంత్రం జరగనుంది. అయితే ఉదయం టీడీపీ శ్రేణులు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ తలపెట్టాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ అభిమానుల పేరిట బైక్ ర్యాలీ, భారీ అన్న సంతర్పణ ఉంటుందని కొడాలి నాని ప్రకటించారు. ఈ బైక్ ర్యాలీకి భారీ స్థాయిలో తరలి రావాలని వైసీపీ శ్రేణులకు వాట్సాప్‌లో ఆదేశాలిచ్చారు. టీడీపీ గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక స్టేడియం వద్ద గల ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తారు. నాని కూడా విగ్రహానికి నివాళులర్పించేందుకు రానున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు ఎదురు పడితే పరిస్థితి ఏవిటా అని పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఏం జరుగుతుందోనని పట్టణవాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

న్యాయం కోసం నిరాహార దీక్ష

- నేటి నుంచి విశాఖ జైలులో కోడికత్తి శ్రీను దీక్ష
- విజయవాడలో ప్రజాసంఘాలతో కలిసి తల్లి కూడా
- న్యాయం జరిగే వరకు పోరాటం: కుటుంబ సభ్యులు

విజయవాడ, విశాఖపట్నం, జనవరి 17: కోడికత్తి కేసులో జనుపల్లి శ్రీనివాస్ ఐదేళ్ల నుంచి రిమాండ్ ఖైదీగా జైల్లోనే మగ్గుతున్నాడు. ఈ కేసులో సీఎం జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పడం లేదు. దీంతో శ్రీనుకి బెయిల్ కూడా రావడం లేదు. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న తన కుమారుడు ఎప్పుడు బయటకు వస్తాడా అని ఎదురుచూస్తున్న శ్రీనివాస్ తల్లి మరియమ్మ.. న్యాయం కోసం గురువారం నుంచి నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం శ్రీను తల్లి మరియమ్మ, సోదరుడు సుబ్బరాజు మీడియాతో మాట్లాడారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న శ్రీనివాస్ తమకు ఫోన్ చేసి గురువారం నుంచి దీక్షకు కూర్చుంటున్నానని చెప్పాడని, తన కుమారుడికి న్యాయం జరిగేంత వరకు దళిత, మైనార్టీ, ప్రజాసంఘాల మద్దతుతో తాము కూడా విజయవాడలో గురువారం నుంచి నిరహారదీక్ష చేపడతామని చెప్పారు. ఈ కేసులో సీఎం జగన్ న్యాయస్థానానికి వచ్చి సాక్ష్యం చెప్పి బాధితుడు శ్రీనివాస్ జైలు నుంచి విడుదలయ్యేందుకు సహకరించాలని వేడుకున్నారు. జైల్లో ఉన్న శ్రీనుకు ఏదైనా హాని జరిగితే దానికి సీఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కోడికత్తి కేసును సీఎం జగన్ బాగా వాడుకున్నారని, సీఎం అయిన తర్వాత ఆయనను కలిసి తమ ఆవేదన తెలియజేసేందుకు అనేకసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. సిట్, ఎన్ఐఏ కూడా ఈ సంఘటనలో ఎటువంటి కుట్ర కోణం లేదని తేల్చాయన్నారు. దళితులం కాబట్టే న్యాయస్థానాల్లో సైతం తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. కాగా, శ్రీనివాస్ జైలులో దీక్ష చేస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని విశాఖపట్నం కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ మీడియాకు తెలిపారు. దీక్ష చేస్తానని శ్రీనివాస్ మంగళవారం చెప్పాడని, అయితే 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా లేఖ ఇవ్వాలని తెలియజేశామని అన్నారు. కానీ, ఇప్పటివరకు అలాంటి లేఖ ఏమీ తమకు అందలేదని, కాబట్టి గురువారం శ్రీనివాస్ దీక్ష చేసే అవకాశాలు లేవని ఆయన చెప్పారు.


విజయవాడలో మీడియా ఎదుట తన ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీను తల్లి మరియమ్మ

21న ఇడుపులపాయలో..!

పీసీసీ సారథిగా షర్మిల బాధ్యతల స్వీకరణ



అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఈ నెల 21న బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇడుపులపాయలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి చెంత ఆమె పీసీసీ పగ్గాలు చేపడతారని సమాచారం. వైఎస్ అనుచరులు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఆమెకు మద్దతు పలుకనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, వర్కింగ్ కమిటీ సభ్యులు, సీనియర్ నేతలు పాల్గొంటారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రలో నామరూపాల్లేకుండా పోయిన కాంగ్రెస్‌లో జవసత్వాలు నింపేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. కర్ణాటకలో డీకే శివకుమార్‌ను కేపీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డికి పగ్గాలు అప్పగించి అనూహ్యంగా అధికారం కైవసం చేసుకుంది. ఇప్పుడు ఆంధ్రలో పుంజుకోవడానికి వైఎస్ కుమార్తెను బరిలోకి దింపుతోంది. తమ ఓటు బ్యాంకు అయిన ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలతో పాటు రెడ్డి సామాజికవర్గాన్ని కూడా తిరిగి తన వైపు లాక్కునేందుకు జగన్ చెల్లెలినే మోహరిస్తోంది.

ఇడుపులపాయ నుంచే...

కుమారుడు రాజారెడ్డి వివాహ పత్రికను తండ్రి సమాధిపై ఉంచిన తర్వాతే తాడేపల్లి వచ్చి అన్నను ఆహ్వానించిన ఆమె.. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 17న ఆమె కుమారుడి పెళ్లి. గురువారం హైదరాబాద్‌లో నిశ్చితార్థ వేడుక జరుపనున్నారు. మర్నాడు శుక్రవారం రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, తన తండ్రి అనుచరులతో సమావేశమవుతారు. 21న ఇడుపులపాయలో బాధ్యతలు స్వీకరిస్తారని పీసీసీ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆమె తన కార్యాచరణ ప్రకటించి నేరుగా ప్రజల్లోకి వెళ్తారని తెలుస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రైల్వే జోన్, రాజధాని నిర్మాణం సహా అన్ని విభజన హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమంటూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తారని సమాచారం. బడుగు, బలహీన, మైనారిటీలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని చెబుతారు. జగన్ ఆ వర్గాలను ఓటుబ్యాంకులుగా చూడడం తప్ప వారి అభివృద్ధికి చేసిందేమీ లేదని, అంబేడ్కర్ విద్యా దీవెన లాంటి పథకాలకు వాటికి తన పేరు పెట్టుకోవడాన్ని కూడా ప్రస్తావించనున్నట్లు తెలిసింది.

వైసీపీ ఓట్లు చీల్చేస్తాం!

తండ్రిని కోల్పోయిన జగన్ పట్ల ప్రజలు ఒకప్పుడు చూపిన సానుభూతి ఆయనకు ఓట్లు కురిపించిందని.. వాటిని తాము చీల్చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నేతలు ధీమాగా చెబుతున్నారు. రాయలసీమలో సుమారు 9 శాతం, ఇతర జిల్లాల్లో 6 శాతం వరకూ వైసీపీ ఓట్లను కాంగ్రెస్ చీల్చే అవకాశముందని విశ్లేషకులు కూడా అంచనా వేస్తున్నారు. వైసీపీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులతోపాటు కాంగ్రెస్‌కు, రాజకీయాలకు దూరంగా ఉంటున్న పాత నేతలంతా ఇప్పుడు క్యూ కడతారని చెబుతున్నారు.

జనసేనానితో కొణతాల భేటీ

- పవన్‌ను కలిసిన షర్మిల

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో అనకాపల్లి మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ భేటీ అయ్యారు. ప్రస్తుతం జనసేనాని హైదరాబాద్‌లో ఉన్నారు. ఆయనను కొణతాల మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలు, ఉత్తరాంధ్రలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పవన్‌తో భేటీ తర్వాత జనవరి నెలాఖరులో ఆయన జనసేనలో చేరనున్నట్లు తెలుస్తోంది. అనకాపల్లి ఎంపీ సీటు ఆశిస్తున్న ఆయనకు పవన్ నుంచి పూర్తిస్థాయి హామీ రాలేదు. కాగా, పవన్ కల్యాణ్‌ను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కలిశారు. హైదరాబాద్‌లో పవన్ నివాసానికి వెళ్లిన ఆమె తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి హాజరు కావాలని ఆహ్వానించారు.

దోపిడీకి 'ద్వారం'

ఆ ఎమ్మెల్యే అక్రమ సంపాదన రూ.900కోట్లపైనే.. ఉమ్మడి తూర్పులో ఆయన 'ట్వంటీ పర్సంటేజ్ ఎమ్మెల్యే'

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రానికి ఒక సీఎం ఉంటారు. కానీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మాత్రం ఆయనే సర్వం. జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగుల వరకు అందరినీ కంటిచూపుతో శాసిస్తారు. ముఖ్యమంత్రి దర్జాకు ఏమాత్రం తగ్గడు. వందల ఎకరాల్లో కొండలు, గుట్టలు మింగేశారు. పచ్చని భూములను లోయలుగా మార్చేసి రూ.450 కోట్లకుపైగా సంపాదించారు. ఆ జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో రియల్ ఎస్టేట్ అవసరాలకు మట్టి, గ్రావెల్ సరఫరాలో మొత్తం హోల్ అండ్ సోల్ ఆయనే. పేదల రేషన్ బియ్యాన్ని కుటుంబంతో కలిసి సొంత మిల్లుల్లో పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తూ ఎన్ని వందల కోట్లు కూడబెట్టారో లెక్కేలేదు.



పేదల ఇళ్ల స్థలాల దగ్గరనుంచి వాటి చదును వరకు కాంట్రాక్టులన్నీ చేజిక్కించుకుని మింగింది వందకోట్లుపైనే.. ఇలా ఆయన అవినీతిపై రాయాలంటే పుస్తకాలు చాలవు. మాటల్లో చెప్పాలంటే రోజులు సరిపోవు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడి అవినీతికి పూర్తిగా 'ద్వారం' తెరిచేశారు. తనకు అడ్డేలేదన్నట్టు చెలరేగిపోతున్నారు. రాష్ట్ర ముఖ్యనేత అండదండలతో అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు. ఈయన అక్రమ సంపాదన రూ.900కోట్లపైనే ఉండొచ్చని అధికార పార్టీ వర్గాల్లోనే విస్తృత ప్రచారం జరుగుతోంది.

కొండలు మింగేసి లోయలుగా మార్చేసి..

823 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండలు, గుట్టలవి. అందులో కొంత రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. జింకలు, దుప్పిలు,లేళ్లు ఇతర వన్యప్రాణులకు ఆవాసం అది. అయినా ఇవేవీ ఎమ్మెల్యే అవినీతి ముందు ఆగలేదు. రాష్ట్ర ముఖ్యనేతకు అతి సన్నిహితమైన వ్యక్తి కావడంతో పేదల ఇళ్లస్థలాల చదును అవసరం సాకుతో కొండల్లో మట్టి, గ్రావెల్ తరలించడం మొదలుపెట్టి ఆ తర్వాత నాలుగున్నరేళ్లుగా అక్కడే పాగా వేసేశారు. చుట్టు పక్కల నియోజకవర్గాలను కూడా ఇదే విధానంలో చదును చేసేశారు. అక్కడ వందలాది ప్రభుత్వ ఇళ్ల స్థలాల లేఅవుట్‌లకు మట్టి, గ్రావెల్ సరఫరా పేరుతో ఉచితంగా తవ్వేసుకుని కోట్లు చేసుకున్నారు. ఇప్పటివరకు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ తరలించి 200కోట్లకుపైగా సంపాదించారు. కలెక్టర్, జేసీ, గనులశాఖ, రెవెన్యూశాఖలు అటువైపు కన్నెత్తి చూస్తే కొలువులు పోతాయన్న భయంతో కళ్లు మూసేసుకున్నారు. ఇక్కడ మెట్టలో అక్రమ తవ్వకాలతో సదరు ఎమ్మెల్యే సంపాదించింది రూ.450కోట్లపైనే. ఇప్పుడక్కడ చూస్తే కొండలను తవ్వేయడంతో వేల టేకు, వేప, మామిడి చెట్లు ఎండిపడి ఉన్నాయి. తవ్వకాల ధాటికి కొన్ని పెద్దపెద్ద కొండలు పూర్తిగా కరిగిపోయి భూ ఉపరితలంనుంచి మరో 40నుంచి 50 అడుగుల కిందకు కూడా గ్రావెల్ తవ్వడంతో వందల ఎకరాలు లోయలుగా మారిపోయాయి. కొండలను ఆనుకున్న ప్రభుత్వ భూముల్లో ఎస్సీ లబ్ధిదారులు సాగుచేసుకుంటున్న భూములకు ఎకరాకు రూ.10లక్షలు ఇచ్చి వాటిని కూడా లోయలుగా మార్చేశారు. ఇంత జరిగితే ప్రభుత్వశాఖలు ఒక్కటంటే ఒక్కటి స్పందిస్తే ఒట్టు. ఈ ఎమ్మెల్యే మట్టి టిప్పర్ల వల్లే జిల్లాలో అనేక రహదారులు ధ్వంసం అయ్యాయంటే ఏస్థాయిలో గ్రావెల్ దందా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

రూ.వందల కోట్లు పండించిన బియ్యం..

ఆయన జిల్లాలో రేషన్ బియ్యంపై ఎక్కడ క్రయవిక్రయాలు జరిగినా చివరకు ఆ ఎమ్మెల్యే గోదాములు, మిల్లులకే చేరాలి. అక్కడ గుట్టుగా పాలిషింగ్ చేసి పేరు మార్చి ప్యాకింగ్ చేసి నౌకల్లో విదేశాలకు తరలిస్తూ రూ.250కోట్లకుపైగా సంపాదించారు. సదరు ఎమ్మెల్యే సోదరుడు, తండ్రి.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నుంచి మిల్లర్ల సంఘాల వరకు అంతా గుప్పిట పెట్టుకున్నారు. దీంతో రేషన్ బియ్యం సేకరణ వీరికి చాలా సులువైంది. పైగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు ఎమ్మెల్యే బియ్యం ఎగుమతుల్లో వేగం పెంచడానికి ప్రభుత్వాన్ని వాడుకున్నారు. అప్పటివరకు ఎన్నో ఏళ్లుగా ఒక్క కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి మాత్రమే బియ్యం విదేశాలకు అవుతుండగా, పక్కనే ఉన్న ఆధునిక డీప్ వాటర్ పోర్టు నుంచి కూడా స్పీడుగా ఎగుమతులు జరిగేలా అనుమతులు తెచ్చుకున్నారు. ప్రధానంగా ఆఫ్రికాకు ఎగుమతవుతున్న ఈ బియ్యానికి సంబంధించి అక్కడ వ్యాపారులు నగదు చెల్లింపులు వేగంగా చేయడం లేదట! అందుకని స్వయంగా ఎమ్మెల్యే ఆ దేశాలకు వెళ్లి అక్కడ సొంతంగా గోదాములు కడుతున్నారు. అయినా.. ఏనాడూ ఈయన విల్లులు, గోదాములపై దాడులు కూడా జరగలేదు. ఇదే కాదు మిల్లర్లకు ప్రభుత్వం రూ.2వేల కోట్లకుపైగా చెల్లించాల్సిన బాకీలను విడిపించడానికి సదరు ఎమ్మెల్యే వారినుంచి 20శాతం కమీషన్ డిమాండ్ చేసి భారీస్థాయిలో తన వాటా నొక్కేశారు.

ప్రభుత్వ భుములు కనిపిస్తే కబ్జా చేయడం ఆయనకు కామన్. నియోజకవర్గంలో ఓ ఎకరం ప్రభుత్వ భూమికి ఏకంగా గోడకట్టేశారు. దీని విలువ రూ.5కోట్లు. రెండెకరాల పార్కు స్థలాన్ని ప్రైవేటు స్థలంగా చూపించి టీడీఆర్ బాండ్లు రూ.219కోట్లకు కార్పొరేషన్ నుంచి తీసుకుని విక్రయించారు. దీనిలో రూ.50కోట్లు వరకు సంపాదించారు. ఇటీవల ఓ వ్యక్తి రూ.2కోట్లతో కొన్న భూమిని విక్రయించుకోకుండా అడ్డుకున్నారు. ఓ స్వీట్‌షాపు యజమాని నుంచి డబ్బులు రూ.కోటి వరకు అప్పుతెచ్చి ఇవ్వకుండా బెదిరించారు. ఆయన ఆస్తిని కూడా రాయించుకున్నారు. కాకినాడ రూరల్‌లో వంద ఎకరాల చెరువును పూడికతీసే కాంట్రాక్టుకు ఎవరూ టెండర్లు వేయకుండా బెదిరించి ఈయనే కొట్టేశారు. అటు చెరువులో మట్టి పూడిక తీసినందుకు కార్పొరేషన్ నుంచి రూ.కోటిన్నర వరకు బిల్లు చేసుకున్నారు. పిఠాపురం, పెద్దాపురం తదితర నియోజకవర్గాల్లో ఆయన అనుచరులు చెరువులను లోయలుగా మార్చేసి రియల్ ఎస్టేట్‌కు తరలించి అందులో కాసులు పంట పండించుకున్నారు.

అవినీతికి అడ్డొస్తే శంకరగిరి మాన్యాలే..

ఈ ఎమ్మెల్యే తను ఏం చెబితే అది చేయాలి. కాదంటే రాత్రికి రాత్రి సీఎం పేషీతో చెప్పి మరీ బదిలీ చేయించేస్తారు. కొవిడ్ మృతులకు సంబంధించి ఆయా కుటుంబాలకు జారీచేసే ఎఫ్ఎంసీ ధ్రువీకరణ పత్రాల్లో తహసీల్దార్ అవినీతికి పాల్పడితే ఈయన్ను ఎమ్మెల్యే రక్షించే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో ఆర్డీవోపై కక్షపెట్టి బదిలీ చేయించారు. కార్పొరేషన్ పరిధిలో పనులకు బిల్లులు తనకు తెలియకుండా చెల్లించారనే కోపంతో కమిషనర్‌ను బదిలీ చేయించారు. తన భూఅక్రమాలకు సహకరించనందుకు సబ్‌రిస్ట్రార్‌పై వేటేయించారు. ఇవన్నీ మాట విననందుకే చేయించానని ఆ ఎమ్మెల్యే బహిరంగంగానే చెప్పారు.

ఎమ్మెల్యే ఫ్యాక్టరీకి లైన్ క్లియర్..

దీంతో సదరు ఎమ్మెల్యే రొయ్యల ఫ్యాక్టరీకి ఏ ఇబ్బంది లేకుండా వ్యాపారం జరుగుతోంది. కాకినాడ నగర నడిబొడ్డున ఓ హోటల్ అప్పుల్లో కూరుకుపోయింది. రూ.40కోట్ల వరకు బ్యాంకులకు బాకీలు పేరుకుపోయాయి. దీంతో వేలం వేసిన ఈ ఆస్తిని బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు కొట్టేశారు. హోటల్ యజమాని బయట కొందరు ప్రైవేటు వ్యక్తులకు బాకీలుంటే అవి చెల్లించకుండా సెటిల్‌మెంట్ చేశారు. కాకినాడలో జయలక్ష్మి సొసైటీ రూ.500కోట్లకుపైగా ఖాతాదారులకు శఠగోపం పెట్టింది. సదరు ఎమ్మెల్యే రంగంలోకి దిగి వారి నుంచి ఓ పెద్ద స్థలం బినామీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. కాకినాడలో ఓ సొసైటీలో అక్రమాలను బూచీగా చూపించి మూడెకరాల స్థలాన్ని తీసుకుని భారీగా అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. కొవిడ్ నిధులతో ప్రభుత్వం కొన్న మంచాలు, కుర్చీలు, బకెట్లు కూడా సొంతానికి దొంగిలించేశారు.

ఏయూ వీసీగా మళ్లీ ప్రసాద్‌రెడ్డే

- మూడోసారి నియామకం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అత్యంత వివాదాస్పద వైస్ చాన్స్‌లర్‌గా ముద్రపడిన పీవీజీడీ ప్రసాద్‌రెడ్డికి ప్రభుత్వం మళ్లీ పెద్దపీట వేసింది. ఇటీవల ఆయన పదవీ కాలం ముగియడంతో కొత్త వీసీని నియమిస్తారని ప్రచారం జరిగినా అనూహ్యంగా మళ్లీ అతడినే ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. తొలుత ఏడాది కాలం ఇన్‌చార్జ్ వీసీగా, తర్వాత మూడేళ్లపాటు రెగ్యులర్ వీసీగా పనిచేసిన ఆయన ఇప్పుడు మరో మూడేళ్లపాటు వీసీగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. అధికార పార్టీకి అత్యంత సన్నిహితుడిగా ప్రసాద్‌రెడ్డి వ్యవహరించారు. యూనివర్సిటీలో జగన్ పుట్టినరోజు వేడుకలు చేయడం, అధికార పార్టీ నాయకుల కోసం క్యాంపస్‌లో భారీగా చెట్లు నరికివేయించడం లాంటి పలు ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. విద్యార్థి సంఘాలు కూడా ఆయనను తొలగించాలని అనేకసార్లు డిమాండ్ చేశాయి. చివరికి పదవీకాలం ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే తనకు ఇవ్వకపోయినా తన శిష్యుడిగా ఉన్న మరో వ్యక్తికి వీసీ పదవి ఇవ్వాలని ఆయన పట్టుబట్టారు. కానీ ప్రసాద్‌రెడ్డి ప్రమేయం లేనివారికి ఇవ్వాలని ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ మంత్రి సిఫారసు చేశారు. కానీ మళ్లీ ప్రసాద్‌రెడ్డిని వీసీగా నియమించడంతో విద్యాశాఖ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే ఉన్నత విద్యామండలి మాజీ కార్యదర్శి, జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను రాయలసీమ వర్సిటీ వీసీగా నియమించింది. ఆయనను సీఎం కుటుంబంలోని వ్యక్తులు సిఫారసు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా రిటైర్డ్ ప్రొఫెసర్ కలాంగి రెమి రజనీ, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీగా అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న కె.హుస్సేన్ రెడ్డి నియమితులయ్యారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీగా ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావును ప్రభుత్వం నియమించింది. కాగా, ఆంధ్రా యూనివర్సిటీకి తిరిగి ప్రసాద్‌రెడ్డి నియామకంపై ఆలిండియా విద్యార్థి సంఘం నిరసన వ్యక్తం చేసింది. అనేక అవినీతి ఆరోపణలున్న ఆయన్ను మళ్లీ నియమించడంపై యూజీసీకి ఫిర్యాదు చేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేమన ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు టీడీపీలోకి వైసీపీ నేత రూపానందరెడ్డి

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన వైసీపీ నేత రూపానంద రెడ్డి గురువారం ఇక్కడ టీడీపీలో చేరనున్నారు. పెద్ద సంఖ్యలో తన అనుచర వర్గంతో సహా తరలివచ్చి ఆయన పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో చేరబోతున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న రూపానందరెడ్డి గతంలో హైదరాబాద్, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి 2014లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీ అధినేత జగన్‌కు సన్నిహితుల్లో ఒకరుగా ఆయనకు గుర్తింపు ఉంది. ఆయన చేరిక రైల్వే కోడూరు నియోజకవర్గంలో టీడీపీకి లాభిస్తుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, శ్రీకాకుళం నగరానికి చెందిన వైసీపీ నేత రెడ్డి చిరంజీవి, కదిరి, మడకశిర నియోజకవర్గాల నేతలు కూడా గురువారం టీడీపీలో చేరనున్నారు.

హిట్ అండ్ రన్ శిక్షలపై నిరసన

- రాష్ట్రంలో లారీ డ్రైవర్ల మెరుపు సమ్మె

విజయవాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న న్యాయసంహిత- 2023లో హిట్ అండ్ రన్‌కి సంబంధించిన కేసులకు పదేళ్ల జైలుశిక్ష, రూ.7లక్షల జరిమానా విధింపును నిరసిస్తూ.. రాష్ట్రంలోని లారీ డ్రైవర్లు బుధవారం మెరుపు సమ్మెకు దిగారు. యజమానులు నచ్చజెప్పడంతో చాలామంది డ్యూటీలకెక్కడంతో సమ్మె పాక్షికంగానే జరిగింది. ఏపీ లారీ యజమానుల సంఘం తరఫున సంఘ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు డ్రైవర్ల సంఘం నాయకులతో చర్చించారు. కేంద్రం ఆ చట్టాన్ని అమలు చేయాలని చూస్తే యజమానులు, డ్రైవర్లు కలసి సమ్మెకు వెళ్లాలే తప్ప వేర్వేరుగా వెళ్లకూడదని చెప్పారు. ఇందుకు కొన్ని డ్రైవర్ల సంఘాలు సానుకూలంగా స్పందించాయి.

అసోం చీఫ్ సెక్రటరీగా సిక్కోలు వాసి

- ఏప్రిల్ నుంచి కోట రవి బాధ్యతలు

టెక్కలి, జనవరి 17: అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కోట రవి నియమితులయ్యారు. ఏప్రిల్ 1 నుంచి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కోట రవి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామం. ఆయన విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలు, టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగింది. అసోంలోని గోసాయిగాం అసిస్టెంట్ కలెక్టర్‌గా, శివసాగర్, జార్హాట్, జోలాగాట్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఉమ్మడి ఏపీ, పాండిచ్చేరి, అండమాన్‌కు సంబంధించి ఎఫ్‌సీఐ సీనియర్ రీజనల్ మేనేజర్‌గా పనిచేశారు. 15వ ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీగా, అప్పటి గనులశాఖ, మానవవనరుల శాఖ మంత్రులకు ఓఎస్‌డీగా పనిచేశారు. అమెరికాలో మినిస్ట్రీ ఆఫ్ ఎకనమిక్స్ తరఫున భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల అసోం ప్రభుత్వం తరఫున ఉల్ఫా తీవ్రవాదులతో జరిగిన శాంతి ఒప్పందం చర్చల్లో పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల తొలగింపుపై కమిటీలు

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములను నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఐదేళ్ల నుంచి ఈ మాట చెబుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో దీనిపై మరింత ఆసక్తి చూపిస్తోంది. ఏ జిల్లాలో ఎన్ని అసైన్డ్ భూములు ఉన్నాయో కలెక్టర్ల నుంచి ప్రభుత్వానికి నివేదిక అందింది. ఈ నివేదికల్లోని అసైన్డ్ భూముల విస్తీర్ణం సరిగ్గా ఉందో.. లేదో నిర్ధారించడానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ.. ప్రతి జిల్లాకు ఒక కమిటీని వేశారు. అందులో జిల్లా రెవెన్యూ అధికారి, రిజిస్ట్రార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారు. కలెక్టర్లు పంపిన నివేదికలోని అసైన్డ్ భూములను ఈ నెల 20లోగా 22(ఏ) నుంచి తొలగించాలని ఆదేశించారు.

'కోటా' అమలులో కుదుపు

- మహిళలకు కొంత మేర నష్టం
- సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లో సవరణ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల అమలు విధానంలో స్టేట్ సబార్డినేట్ రూల్స్‌ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఇప్పటి వరకు రూల్స్‌లో మహిళలకు సంబంధించి రోస్టర్ పాయింట్ల పక్కన 'ఉమెన్' అని ఉండగా, సవరణలో ఈ పదాన్ని తొలగించారు. ప్రస్తుత విధానంతో పోల్చుకుంటే ఈ సవరణతో మహిళలకు కొంతమేర నష్టం జరగనుంది. ఇకనుంచి హారిజంటల్ రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. మహిళలు, దివ్యాంగులు, క్రీడాకారులు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు అమలు చేస్తున్న హారిజంటల్ రిజర్వేషన్లు ప్రత్యేకమైనవి కావని, రెగ్యులర్(వర్టికల్) రిజర్వేషన్లలో అంతర్భాగమేనని ప్రభుత్వం వెల్లడించింది. ఆ నాలుగు విభాగాల వారికి రోస్టర్‌లో ఉన్న పాయింట్లను తొలగించి, కొత్తగా స్లాట్ విధానం తెచ్చింది. దాని ప్రకారమే ఆ విభాగాలకు భర్తీ ప్రక్రియ అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మహిళలకు ప్రాతినిధ్యం తగ్గుతుంది.

సామాజిక వర్గాల వారీగా

దివ్యాంగులకు ఉన్న 4% రిజర్వేషన్లను ఇప్పటి వరకు ఓపెన్ కోటా కింద భర్తీ చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఈబీసీ ఏ వర్గానికి చెందిన వారైనా ఓపెన్ కోటా కిందే నియమిస్తున్నారు. దీనివల్ల ఓపెన్ కోటా పరిమితి తగ్గిపోతోంది. తాజా జీవోలో దివ్యాంగులకు వారి సామాజికవర్గాల వారీగా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఓపెన్ కోటాకు కొంత రిలీఫ్ దక్కుతుంది. అదేవిధంగా క్రీడాకారులకు ఉన్న 2% రిజర్వేషన్లను, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఉన్న 2% రిజర్వేషన్లను కూడా ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ కింద భర్తీ చేస్తున్నారు. ఇకపై వీటిని కూడా వారి సామాజిక వర్గాల ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాలోనే భర్తీ చేస్తామని పేర్కొంది. దీనికి అనుగుణంగా వారికి ఉన్న రోస్టర్ పాయింట్లను ఆగస్టులోనే తొలగించారు. దివ్యాంగులను 4 విభాగాలుగా చేశారు. మొదటి విభాగంలో కంటి సంబంధిత లోపాలున్న వారుంటారు. వీరికి 1నుంచి 25పోస్టుల స్లాట్ కేటాయించారు. రెండో విభాగంలో వినికిడి లోపాలున్నవారికి 26నుంచి 50 వరకు, మూడో విభాగంలో శారీరక వైకల్యం(కాళ్లు, చేతులు వంటివి) ఉన్నవారికి 51 నుంచి 75 వరకు, నాలుగో విభాగంలో పైమూడు విభాగాల కిందకు రాని లోపాలున్న వారికి(ఆటిజం, మల్టిపుల్ డిజెబిలిటీస్) 76 నుంచి 100 పోస్టుల వరకు స్లాట్లు కేటాయించారు.

మహిళల కోటాలో మార్పులు

మహిళలకు 33% రిజర్వేషన్ ఉంది. ఈ రిజర్వేషన్‌ను అటు కోటాలోను, మెరిట్ ప్రకారం ఓపెన్ కేటగిరీలోనూ భర్తీ చేస్తున్నారు. ఇకపై మెరిట్ లిస్టు ప్రకారం ఓపెన్ కేటగిరీలో భర్తీ అయిన మహిళలు 33% కోటాకు సరిపడా ఉంటే ప్రత్యేకించి కోటా అమలు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది. మెరిట్ లిస్టు ప్రకారం చేసిన భర్తీలో మహిళా ప్రాతినిధ్యం 33% లేనిపక్షంలో లిస్టులో ఎక్కడ మహిళలున్నా కోటా మేరకు భర్తీచేయాలని పేర్కొంది. ఉదాహరణకు 10 పోస్టుల్లో కోటా ప్రకారం మూడు పోస్టులను మహిళలతో భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు, మెరిట్ ద్వారానే ముగ్గురు మహిళలు ఆ పోస్టులు కైవసం చేసుకుంటే వీరికి రోస్టర్‌పాయింట్లు ఇవ్వరు. ఒకవేళ మూడు పోస్టులకుగాను కేవలం ఒక్కరే మెరిట్ ద్వారా వచ్చినప్పుడు ఆ పది పోస్టుల్లో చివరి రెండు పోస్టులు 9, 10 పోస్టులను మహిళలకు కేటాయించి మెరిట్ లిస్ట్‌లో వారెంత దిగువన ఉన్నా సరే భర్తీ చేస్తారు.

ఓపెన్ కోటా కాకుండా

ప్రస్తుతం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6, బీసీలకు 25, ముస్లింలకు 4, ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కోటాలున్నాయి. మొత్తం కోటా 60శాతం, 40 శాతం ఓపెన్ కోటా కింద ఉన్నాయి. వీటిని వర్టికల్ రిజర్వేషన్‌గా పేర్కొంటున్నారు. ఇవికాకుండా మహిళలకు 33 శాతం, దివ్యాంగులకు 4శాతం, క్రీడాకారులకు 2శాతం, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు 2శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. మొత్తం 41శాతం. వీటిని హారిజంటల్ రిజర్వేషన్లుగా పేర్కొంటున్నారు. వర్టికల్ రిజర్వేషన్ల కోటా 60 శాతం పోను, మిగిలిన 40శాతం ఓపెన్‌లోనే హారిజంటల్ రిజర్వేషన్ల ప్రకారం పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీంతో ఓపెన్ కోటాకు పెద్దగా చాన్స్ ఉండడంలేదు. హారిజంటల్ రిజర్వేషన్లను సామాజిక వర్గాల వారీగా ఆయా రిజర్వేషన్ల కోటాలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అన్నిశాఖల అధికారులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి ఈ జీవో ఇచ్చినట్టు తెలుస్తోంది.


జేసీ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో తొడ కొడుతున్న మహిళ

వైసీపీ దౌర్జన్యాలపై ఆగ్రహం
జేసీ సమక్షంలో తొడగొట్టిన మహిళ

తాడిపత్రి, జనవరి 17: వైసీపీ వారి దౌర్జన్యాలపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఓ మహిళ.. తొడకొట్టి సవాల్ చేశారు. యువ చైతన్య రథయాత్ర చేపట్టిన జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లిలో పర్యటించారు. టీడీపీలో చురుకుగా ఉండే తన కుమారుడు సతీష్‌రెడ్డిని వైసీపీ నాయకులు, పోలీసులు చిత్రహింసలకు గురిచేసి ఊరువిడిచి వెళ్లిపోయేలా చేశారని రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను జేసీ ప్రభాకర్ రెడ్డి ఓదార్చి.. 'వచ్చేది మన ప్రభుత్వమే. మీ అందరికీ నేను అండగా ఉంటా..' అని భరోసా ఇచ్చి, తొడ కొట్టారు. జేసీ ఇచ్చిన భరోసాతో రామలక్ష్మి కూడా తొడ కొట్టారు.



రోడ్డుపై గుంతలు.. తప్పించబోయి తుప్పల్లోకి దూసుకుపోయిన కారు

గుంతను తప్పించబోయి తుప్పల్లోకి!

భామిని, జనవరి 17: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో రహదారిపై ఏర్పడిన భారీగుంతను తప్పించబోయిన కారు అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకుపోయింది. బత్తిలి నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న కారు.. బత్తిలి సమీపంలో ఆర్ అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యిను తప్పించబోయి అదుపుతప్పింది. రోడ్డుకు పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. పశువుల కాపర్లు, వాహనదారులు కారులో ఉన్న నలుగురు యువకులను బయటకు తీశారు. వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఈ మార్గంలో ఉన్న గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై 'గుంత' పొంగనాలు



గుంటూరు, జనవరి 17: గుంటూరు నగరంలోని రహదారుల దుస్థితిపై ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు బుధవారం నిరసన తెలిపారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నాయకులు ఎన్‌టీఆర్ బస్టాండ్ వెనుకనున్న గుంతల రహదారిపై గ్యాస్ స్టౌ పెట్టి, దానిపై గుంత పొంగనాలు వండారు. రైతుబజారు వరకు నిరసన ప్రదర్శన చేశారు. రహదారులను త్వరితగతిన అభివృద్ధి చేయకుంటే ఎమ్మెల్యే అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

రోడ్డు లేక పెళ్లిళ్లు కావడంలేదు!

- మంత్రి ఉష శ్రీచరణ్‌కు మొరపెట్టుకున్న మహిళ

రొద్దం, జనవరి 17: 'మా ఊరికి తారు రోడ్డు లేక మగ పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదు. రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి' అని మంత్రి ఉష శ్రీచరణ్‌ను అంజినమ్మ అనే మహిళ కోరారు. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లి గ్రామాల్లో మంత్రి బుధవారం పర్యటించారు. చిన్నకోడిపల్లిలో తమ ఊరికి తారు రోడ్డు వేయాలని అంజినమ్మ మంత్రిని కోరారు. కందుకూర్లపల్లిలోనూ రోడ్డు సౌకర్యం గురించే స్థానికులు ప్రశ్నించారు. మిగిలిన సమ్యలు ఎట్లున్నా, తమ ఊరికి మొదట తారు రోడ్డు వేయాలని మంత్రిని గణేష్ అనే యువకుడు కోరాడు. రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వాలని యువకుడు పట్టుబట్టడంతో ఆమె సరేనన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 18 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

'బిట్స్' ఇంజనీరింగ్ అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌శాట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి. గత ఏడాది ఇంటర్ స్థాయి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 2022లోకానీ అంతకన్నా ముందుకానీ ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు, ప్రస్తుతం బిట్స్ క్యాంపస్‌లలో చదువుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు. ఇంటర్/తత్సమాన కోర్సుల్లో టాప్ ర్యాంక్‌లు సాధించిన అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు బిట్స్‌శాట్ రాయనవసరం లేదు. దీనికి సంబంధించిన వివరాలను జూన్ 1 నుంచి వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



బిట్స్‌శాట్ 2024 వివరాలు

- ఇందులో నాలుగు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజిక్స్ నుంచి 30; రెండో పార్ట్‌లో కెమిస్ట్రీ నుంచి 30; మూడో పార్ట్‌లో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ నుంచి 10, లాజికల్ రీజనింగ్ నుంచి 20; నాలుగో పార్ట్‌లో మేథమెటిక్స్/బయాలజీ నుంచి 40 చొప్పున మొత్తం 130 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- అన్ని ప్రశ్నలకూ సమాధానాలు గుర్తించిన తరవాత ఇంకా సమయం మిగిలి ఉంటే అభ్యర్థులు అదనపు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్/బయాలజీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ఒక్కోదానిలో మూడు చొప్పున మొత్తం పన్నెండు ప్రశ్నలు ఇస్తారు. వీటికి సమాధానాలు గుర్తించి అధిక స్కోర్ పొందవచ్చు. ఒకసారి ఈ ఆప్షన్ ఎంచుకొన్న తరవాత బ్యాక్‌కి వెళ్లి మొదటి 130 ప్రశ్నలకు సంబంధించి కరెక్షన్స్ చేయడం సాధ్యం కాదు.
- బిట్స్‌శాట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండుసార్లూ పరీక్ష రాయవచ్చు. రెంటిలో బెస్ట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు రెండో విడత ఎగ్జామ్ రాయదలచుకొంటే దరఖాస్తులో తెలపాల్సి ఉంటుంది. లేని పక్షంలో రెండో విడత అప్లికేషన్ విండో ఓపెన్ కాదు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ముఖ్య సమాచారం

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

అప్లికేషన్ కరక్షన్ విండో ఓపెన్: ఏప్రిల్ 15 నుంచి 19 వరకు

టెస్ట్ తేదీ, స్లాట్ రిజర్వ్: మే 6 నుంచి 10 వరకు

హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్: మే 15 నుంచి

బిట్స్‌శాట్ 2024 మొదటి విడత తేదీలు: మే 21 నుంచి 26 వరకు

రెండో విడత అప్లికేషన్ విండో ఓపెన్: మే 22 నుంచి జూన్ 10 వరకు

రెండో విడత అప్లికేషన్ కరక్షన్ విండో ఓపెన్: జూన్ 11 నుంచి 12 వరకు

రెండో విడత టెస్ట్ తేదీ, స్లాట్ రిజర్వ్: జూన్ 15 నుంచి 17 వరకు

రెండో విడత హాల్ టికెట్ డౌన్‌లోడింగ్: జూన్ 19 నుంచి

బిట్స్‌శాట్ 2024 రెండో విడత తేదీలు: జూన్ 22 నుంచి 26 వరకు

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి

ఇంటర్/ పన్నెండోతరగతి మార్కులతో అడ్మిషన్ కోసం దరఖాస్తు తేదీలు: జూన్ 1 నుంచి 28 వరకు

వెబ్‌సైట్: bitsadmission.com

ఐఐటీ ఢిల్లీలో ఎంబీఏ

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీడీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఎంఎస్)- ఎంబీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 72 క్రెడిట్స్ నిర్దేశించారు. క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

- టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్

అర్హత

- టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/ఫార్మసీ డిగ్రీలు పూర్తిచేసినవారు; బీఎస్సీ(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్, ఎలక్ట్రానిక్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆపరేషన్స్ రీసెర్చ్, కంప్యూటేషనల్/ఇన్ఫర్మేషన్ సైన్స్, అగ్రికల్చర్, ఎకనామిక్స్, కామర్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ పూర్తిచేసినవారు; సీఏ/ఐసీడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 11 నుంచి 14 వరకు
- ఇంటర్వ్యూ కేంద్రం: ఐఐటీ ఢిల్లీ క్యాంపస్
- **వెబ్‌సైట్:** dms.iitd.ac.in



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు.

డిగ్రీ

బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయశ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.



- కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

పీజీ డిప్లొమా

కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చార్టర్డ్ అకౌంటెన్సీ/కాస్ట్ అకౌంటెన్సీ/కంపెనీ సెక్రటరీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అర్హులే.

డిప్లొమా

కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.

రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు విభాగానికి మాత్రం ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు మాస్ మీడియాలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైకలాజికల్ కౌన్సెలింగ్ విభాగానికి(డిగ్రీ/ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) పూర్తిచేసినవారు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in

ఎఫ్‌డీడీఐలో వివిధ ఖాళీలు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 16

పోస్టుల వివరాలు:

1. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(ఎర్గోనామిక్స్ అండ్ బయోమెకానిక్స్): 3
2. అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(పాలిమర్ అండ్ నిట్టింగ్): 2
3. అసోసియేట్ ఫుట్‌వేర్ డిజైనర్(డిజైన్): 1
4. జూనియర్ టెక్నాలజిస్ట్(టెస్టింగ్ ల్యాబ్): 2
5. అసోసియేట్ ప్రాజెక్ట్ సైంటిస్ట్(ఎర్గోనామిక్స్ అండ్ బయోమెకానిక్స్ టెస్టింగ్ ల్యాబ్(హ్యూమన్ ఫిజియాలజీ): 1
6. టెక్నీషియన్: 1
7. ప్రాజెక్ట్ టెక్నీషియన్(అడ్వాన్స్‌డ్ ప్రింటింగ్- డిజిటల్ ఫ్యాబ్రిక్ ప్రింట్ అండ్ పోస్ట్ ప్రాసెస్): 1
8. స్ట్రాటజీ డెవలపర్/మేనేజర్(హెచ్‌ఓ)(క్వాలిటీ): 1
9. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(ఇంఛార్జ్/హెడ్): 1
10. సింపుల్ మేకర్(షూ మేకింగ్)(డిజైన్ స్టుడియో అండ్ ప్రొడక్ట్ డెవలప్ ల్యాబ్): 1
11. అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(అడ్వాన్స్‌డ్ ప్రింటింగ్): 1

అర్హత: టెక్స్‌టైల్ ఇంజనీరింగ్‌లో ఎమ్మెస్సీ, ఎంటెక్ బయోమెడికల్ ఇంజనీరింగ్/సైన్స్‌లో పీహెచ్‌డీ, ప్లాస్టిక్/పాలిమర్ కెమికల్ ఇంజనీరింగ్‌లో బీఈ, బీటెక్, ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్‌లో ఎండీఈఎస్, ఇంటర్‌తో పాటు ఆరు నెలల ఫుట్‌వేర్ టెక్నాలజీలో 50 శాతం మార్కులతో సర్టిఫికెట్ కోర్సు కలిగి మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

జీతం: సంబంధిత పోస్టును అనుసరించి రూ.30,000 నుంచి రూ.1,30,000 వరకు చెల్లిస్తారు.

వయోపరిమితి: 38-40 ఏళ్లు మించరాదు

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: https://fddiindia.com/



జాబ్ కార్నర్

ఎన్‌ఎల్‌సీలో అప్రెంటిస్‌లు

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 632

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 314 పోస్టులు
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్: 318 పోస్టులు

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15028; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.12524.

అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: డిప్లొమా/డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 18

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31

అభ్యర్థుల ఎంపిక జాబితా వెల్లడి: ఫిబ్రవరి 19

అప్రెంటిస్‌షిప్ ప్రవేశ తేదీలు: 2024 ఫిబ్రవరి 23 నుంచిచ 29 వరకు

వెబ్‌సైట్: https://www.nlcindia.in/new_website/index.htm

ఆర్‌పీఎన్‌ఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ప్రయాగ్‌రాజ్(ఉత్తరప్రదేశ్)లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేషనల్ లా యూనివర్సిటీ... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్ **ఖాళీలు: 6**

సబ్జెక్టులు: హిస్టరీ, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, లా, సోషియాలజీ

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.15,600 - రూ.39,100

దరఖాస్తు ఫీజు: రూ.2,500. ఎస్సీ అభ్యర్థులకు రూ.2,000

ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రెజెంటేషన్, మాక్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: https://www.rpnlup.ac.in/

చిట్టి కథ



కుందేలు తెలివి


పెద్ద తుఫాను. భీకరమైన వర్షానికి నది పారుతోంది. ఓ కుందేలు పిల్ల నీటిలో కొట్టుకుని పోయి బ్రతికిపోయింది. బతికినందుకు సంతోషపడింది. ఆ రాత్రివేళ దాటిన తర్వాత చూస్తే తనో లంకలో విసిరివేయబడ్డది. అక్కడ ఉండే పచ్చగడ్డి, దొరికిన ఆహారం తిని రోజూ ఏడ్చేది. దేవుడు ఎంత దొంగవాడు అనుకుంటూ తిట్టుకునేది.

ఒక రోజు లంకలో ఏడుస్తూ కూర్చుంది కుందేలు. ఓ దుంగ తేలుతూ వస్తోంది. అది మొసలి అని అర్థం చేసుకుంది. మొసలి బావా నీ గురించి తెలుసులే.. తల పైకెత్తు అన్నది. మొసలి ఆశ్చర్యపోయింది. కుందేలు ఇలా అన్నది.. 'ఈ గడ్డిమీదకు రా. ఎప్పుడూ నీళ్లలోనే ఉంటావు. మాలా ఆడుకోలేవు. గంపెడు పిల్లలు మీకు ఉండరు కదా?' అన్నది కుందేలు. 'అదేంటీ.. అలా అంటున్నావు. మాకేమీ కాదు. నీళ్లలోనే ఉంటాం' అన్నది. 'అయినా మీ గుడ్లుమీరే తింటారట కదా. మీకు పిల్లలు ఎక్కడివిలే' అన్నది వెటకారంగా. ఇది అబద్ధం. అయినా నీలా మాట్లాడించేవారు లేరు.. అన్నది భోరున ఏడుస్తూ మొసలి. 'మాలా సంతోషంగా గడపటం మీకు రాదు. ఆకారం పెద్దది. తెలివి తక్కువ' అన్నది. మొసలి కోప్పడింది. 'కోప్పడి ఉపయోగం లేదు. పట్టుమని వంద మంది దండు కూడా మీరు ఉండరు' అన్నది. మొసలి రోషంగా తీసుకుంది. కేకలేసింది. నిముషాల్లో నీళ్లలో మునిగిన మొసళ్లు వచ్చాయి. భయంతో లోలోపల కుందేలు వణికిపోయింది.



ఇపుడు చూశావా? నా తడాఖా అన్నది మొసలి. అయినా మీరు ఈ లంకనుంచి ఆ తీరం వరకు వరుసగా ఉంటే తీరం కూడా తాకదులే అన్నది వెటకారంగా. వెంటనే మొసళ్లను వంతెనలా కట్టమన్నది. అన్నీ వరుసగా వంతెనలా కట్టాయి. 'కనీసం వంద ఉంటే గొప్పనేమో' అన్నది కుందేలు. 'ఎంచుకో' అన్నది మొసలి. 'మీరంతా దగ్గరగా ఉండండి. అప్పుడు లెక్కపెడతా' అన్నది కుందేలు. ఒకదాని మీద ఎగురుతూ అవతలి తీరం మీదకు క్షణాల్లో వెళ్లిపోయింది. తీరం వెళ్లిన తర్వాత పొట్టపట్టుకుని కుందేలు నవ్వింది. ఎందుకంత నవ్వు? అన్నది మొసలి. 'ఏమీ లేదు. ఆ లంకలో ఏడ్చాను ఇన్నాళ్లు. మీరు పేరుగా పెద్ద జీవాలు. మెదడు లేదు. దేవుడు తెలివి ఇవ్వలేదు. నాకు తెలివి ఇచ్చాడు. నేను ఏమి చెబితే అది చేశావు. నీ మూర్ఖత్వానికి జోహార్లు' అంటూ కుందేలు నవ్వింది. కుందేలు మోసం చూసి మొసలి గట్టిగా ఏడ్చింది.


దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 206

8	2							
	4	6			2		3	
		3		7				
9			6		5	4		
7			9		1			8
		2	7		8			5
				8		3		
	8		4			1	2	
							8	6

సుడోకు - 205 సమాధానం

7	8	2	9	4	1	5	3	6
9	5	4	3	6	2	7	1	8
3	1	6	5	7	8	2	4	9
4	6	3	2	9	7	1	8	5
8	7	1	6	3	5	9	2	4
2	9	5	1	8	4	3	6	7
5	4	7	8	1	3	6	9	2
1	2	9	4	5	6	8	7	3
6	3	8	7	2	9	4	5	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.